ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 02.03.2026 | సంపుటి : 12 సంచిక : 222 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## ఖమేనీ మృతితో ఇరాన్
# బాంబుల వర్షం


ఇరాన్ క్షిపణి దాడుల్లో ఇజ్రాయెల్‌లో ధ్వంసమైన ఓ భవనం




**ఇజ్రాయెల్, పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై ఎడాపెడా దాడులు**

**ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న ఇరాన్**

**సుప్రీం లీడర్ మృతికి కచ్చితంగా బదులు తీర్చుకుంటామని హెచ్చరిక**

**టెహ్రాన్(జనంసాక్షి):** అమెరికా– ఇజ్రాయెల్ జరిపిన భీకర దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ చర్యను ఇరాన్ తీవ్రంగా పరిగణించింది. కచ్చితంగా బదులు తీర్చుకుంటామని హెచ్చరించింది. ఖమేనీ మృతికి సరైన సమాధానం చెప్పకుండా వదిలిపెట్టేది లేదని ఇరాన్ క్యాబినెట్ పేర్కొంది. ఖమేనీ మృతిపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ సంతాపం తెలిపింది. తమ సుప్రీం నేతను చంపిన వారికి కఠిన శిక్ష విధిస్తామని.. చరిత్రలో ఎన్నడూ చూడని భయంకరమైన దాడులు ఏ క్షణాల్లోనైనా జరగొచ్చని హెచ్చరించింది. ఇజ్రాయెల్, యూఎస్ స్థావరాల లక్ష్యంగా భారీ ఆపరేషన్ చేపట్టేందుకు ఐఆర్‌జీసీ సిద్ధమైనట్లు అక్కడి మీడియా వెల్లడించింది. ఇక, అమెరికా– ఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీ కీలక సలహాదారులు అలీ షంఖానీతో పాటు ఐఆర్‌జీసీ చీఫ్ మహమ్మద్ పాక్‌పోర్ ప్రాణాలు కోల్పోయారని తాజాగా ఇరాన్ ధ్రువీకరించింది. ఈ క్రమంలో ఐఆర్‌జీసీ తన కొత్త కమాండర్–ఇన్–చీఫ్‌ను నియమించింది. మాజీ రక్షణ మంత్రి అహ్మద్ వాహిదీకి ఆ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ప్రకటించింది. తమ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి నేపథ్యంలో ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తాజాగా పశ్చిమాసియాలోని 27 అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా క్షిపణులు, మిగతా 2లో..

## దాడులు ఆపకపోతే తీవ్రపరిణామాలు



- కనీవినీ ఎరుగని భీకరశక్తితో ఇరాన్‌పై దాడిచేస్తాం..ట్రంప్ హెచ్చరిక
- 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని స్వయంగా పర్యవేక్షించిన అమెరికా అధ్యక్షుడు

2లో..

## తెలంగాణ బిడ్డలు అప్రమత్తంగా ఉండండి

- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు
- గల్ఫ్‌లో ఉద్రిక్తతల నేపథ్యంలో సీఎం రేవంత్ సూచన

## అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన

ఖమేనీ మృతిపై పుతిన్ సంతాపం

### ఖమేనీ పగ్గాలు ముగ్గురు సభ్యుల
## కౌన్సిల్ చేతికి

కొత్త వారసులను ప్రకటించిన ఇరాన్ అధికారిక మీడియా



2లో..

### ప్రతిపక్షాలు చిల్లర రాజకీయాలు చేయకుండా
# సంయమనం పాటించాలి

**వెలుగుమట్లలో పేదలకు 15లోపు ఇళ్ల స్థలాలతోపాటు రూ.5 లక్షలు దగ్గరుండి ఇప్పిస్తా**

- పేదలను అడ్డుపెట్టుకొని రాజకీయం చేయొద్దు
- ఖమ్మం భూదాన్ భూములపై ఆధారాలతోనే మాట్లాడుతున్నాం
- అధికారులు తప్పు చేసి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటాం:మంత్రి పొంగులేటి

**ఖమ్మం(జనంసాక్షి):** ఖమ్మం నగర శివారులోని వెలుగుమట్లలో అర్హులైన పేదలకు ఈ నెల 15లోపు ఇళ్ల స్థలాలతోపాటు రూ.5 లక్షలు దగ్గరుండి ఇప్పిస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అధికారులు తప్పు చేసి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిపక్షాలు చిల్లర రాజకీయాలు చేయకుండా సంయమనం పాటించాలని అన్నారు. ఖమ్మంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం భూదాన్ భూములపై ఆధారాలతోనే మాట్లాడుతున్నట్లు చెప్పారు. పేదలను అడ్డుపెటుకొని రాజకీయం చేయవద్దని హితవు పలికారు. వెలుగుమట్ల గ్రామ సర్వే నంబర్లు 147, 148, 149లోని భూదాన్ భూముల్లో పలువురు ఇళ్లు నిర్మించుకోగా.. సీసీఎల్ఏ, హైకోర్టు ఆదేశాలతో ఈ నెల 24న అధికారులు 652 పైగా ఇళ్లను తొలగించారు. భూదాన్ యజ్ఞ బోర్డు, రెవెన్యూశాఖ విచారణలో నకిలీపత్రాలు, అక్రమ కేటాయింపులు మిగతా 2లో..



## ఖమ్మంలో దౌర్జన్యంగా పేదల ఇళ్లు కూల్చేశారు

రాష్ట్ర భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు 2లో..



### సవాళ్లను ఎదుర్కొనేందుకు నిరంతరం
## అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పని చేయాలి
- శాంతి భద్రతల పై ఖమ్మం, వరంగల్ కమిషనరేట్ల పోలీస్ అధికారులతో డీజీపీ శివధర్ రెడ్డి సమీక్ష
- ముఖ్యమంత్రి నిర్దేశించిన "ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాలకు సిద్ధం కండి

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి ఖమ్మం, వరంగల్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఆదివారం నాడు విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల పోలీస్ అధికారులతో శాంతిభద్రతల పరిస్థితులపై సమీక్షించి, నేరాల అదుపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీస్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పని చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఉద్దేశించిన "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ఈనెల 25వ తేదీ నుండి 31వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాల్సి ఉందన్నారు. అన్ని శాఖల అధికారులను అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగస్వాములను చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి తగు ఆదేశాలు ఇచ్చారన్నారు. మిగతా 2లో..

# తెలంగాణలో బుల్డోజర్‌పాలన

**హైదరాబాద్‌లో ఒక్క ఇల్లు కట్టినట్లు నిరూపించినా రాజకీయ సన్యాసం తీసుకుంటా: కేటీఆర్**

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఒక్క ఇల్లు కట్టినట్లు నిరూపించినా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సవాల్ విసిరారు. తెలంగాణలో నడుస్తోంది ప్రజాపాలన కాదని, బుల్డోజర్ పాలన అని ఆరోపించారు. మూసీ బాధితులకు అండగా కేకే నగర్ ఫేజ్ 2 నుంచి మధుపార్క్ రిడ్జ్ వరకు మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి తదితర నేతలతో కలిసి కేటీఆర్ 'మూసీ దండియాత్ర' మిగతా 2లో..



# రైతులను నిండా ముంచేందుకే అమెరికాతో ఒప్పందం

**రాహుల్ గాంధీ విమర్శలు**



**బర్నాలా(జనంసాక్షి):** భారత్–అమెరికా మధ్య కుదిరిన తాత్కాలిక వాణిజ్య ఒప్పందం దేశీయ రైతాంగాన్ని దెబ్బతీస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. శనివారం పంజాబ్‌లోని బర్నాలాలో నిర్వహించిన మజ్దూర్ కిసాన్ మహార్యాలీలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని విదేశీ మార్కెట్లకు అనుకూలంగా మార్చే అంశంపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ ఒప్పందం నాలుగు నెలలుగా నిలిచిపోయిందన్నారు. 'ప్రధాని నాలుగు నెలలుగా చేయని పనిని, 15 నిమిషాల్లో ఎలా చేశారు? ఆకస్మికంగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది?' అని ఆయన ప్రశ్నించారు. ఏటా అమెరికా నుంచి సుమారు రూ.తొమ్మిది లక్షల కోట్ల విలువైన ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తుందని ట్రంప్‌నకు ప్రధాని మోదీ హామీ ఇచ్చారని, ఇది దేశ రైతులను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. లోక్‌సభలో ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ నరవణే పుస్తకం గురించి మాట్లాడాలని అనుకున్నానని, కానీ, అవకాశం ఇవ్వలేదని రాహుల్ తెలిపారు. అలాగే పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో అక్కడి భారతీయుల భద్రతకు సంబంధించి కేంద్రం వెంటనే ముందస్తు చర్యలు తీసుకోవాలని రాహుల్ 'ఎక్స్' వేదికగా కోరారు. మాజీ సైనికుల సహకార ఆరోగ్య పథకం కు నిధులు కేటాయించడంతో పాటు వికలాంగుల పెన్షన్లపై పూర్తి ఆదాయపు పన్ను మినహాయింపును పునరుద్ధరించాలని కోరుతూ నిర్మలా సీతారామన్‌కు లేఖ రాసినట్లు రాహుల్ తెలిపారు.

## నేడు రాష్ట్రానికి రాహుల్

- తెలంగాణ పర్యటనకు రానున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- వికారాబాద్‌లో జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతులకు హాజరు
- తాజా రాజకీయపరిణామాలు, పార్టీబోపేతంపై చర్చించే అవకాశం

2లో..



## నాగ్‌పూర్‌లో భారీ పేలుడు

**17 మంది మృతి.. పలువురికి గాయాలు**

**నాగ్‌పూర్(జనంసాక్షి):** మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో భారీ పేలుడు సంభవించింది. కటోల్‌లోని పేలుడు పదార్థాల తయారీ పరిశ్రమ ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్‌లో తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో 17 మంది మృతిచెందగా.. 18 మంది తీవ్రంగా గాయపడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీయడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.ప్రమాదం జరిగిన పరిశ్రమలో డిటోనేటర్లు, కాస్ట్ బూస్టర్లు, భూకంప పేలుడు పదార్థాలు తయారు చేస్తారని స్థానికులు వెల్లడించారు. ఉదయం ఇందులోని ఒక యూనిట్‌లో అకస్మాత్తుగా పేలుడు సంభవించిందని.. ఆ సమయంలో, 30 మందికి మిగతా 9లో..

### నాణ్యమైన తీర్పులతో న్యాయ వ్యవస్థపై
# ప్రజల్లో నమ్మకం

**న్యాయ వ్యవస్థలో మధ్యవర్తిత్వానికి కీలక పాత్ర :సీజేఐ జస్టిస్ సూర్యకాంత్**



**అమరావతి(జనంసాక్షి):** కోర్టుల్లో వాదనలు సరిగ్గా ఉన్నప్పుడే జడ్జీల నుంచి నాణ్యమైన తీర్పులు వస్తాయని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. అలాంటి తీర్పులతో న్యాయ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని చెప్పారు. తిరుపతి పరిధిలోని దామినీడులో 16 కోర్టు భవనాల సముదాయానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ న్యాయం అందించేందుకు నిర్దేశిత గడువు ఉండాలని అభిప్రాయపడ్డారు. కోర్టు నూతన భవనంలో న్యాయవాదులకు మంచి సౌకర్యాలు కల్పించాలని, మెడికల్ సెంటర్ ఉండాలని సూచించారు. ఏపీ హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ గతంలో చాలా కోర్టుల్లో జడ్జీల ఛాంబర్లు సరిగా ఉండేవి కాదన్నారు. గతంలో కశ్మీర్ వరదలు వచ్చినప్పుడు హైకోర్టు భవనం పూర్తిగా మునిగిపోయిందని, టెంట్‌ల కింద కోర్టు కార్యకలాపాలు నిర్వహించామని తెలిపారు. న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగేలా సిబ్బంది వ్యవహరించాలని హైకోర్టు సీజే పేర్కొన్నారు.

**న్యాయ వ్యవస్థలో మధ్యవర్తిత్వానికి కీలక పాత్ర**

న్యాయ వ్యవస్థలో మధ్యవర్తిత్వానిది కీలక పాత్ర అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. మధ్యవర్తిత్వం వల్ల అనేక కేసులు సులువుగా పరిష్కారం అవుతాయన్నారు. ప్రతి సమస్యకు కోర్టుకు రావడమే పరిష్కారం కాదని, కుటుంబ తగాదాల వల్ల కోర్టుల్లో కేసులు బాగా పెరుగుతున్నాయని చెప్పారు. అమరావతిలో నిర్వహించిన 'మధ్యవర్తిత్వంపై రాష్ట్రస్థాయి సదస్సు'కు ఆయన హాజరయ్యారు. " మధ్యవర్తిత్వం వల్ల మిగతా 2లో..

# తెలంగాణ ఆత్మ కళలు

**కళలు, సంస్కృతికి ప్రభుత్వం పెద్దపీట • దేవాలయాలు, టూరిజం, కల్చర్‌తో కూడిన యాక్షన్ ప్లాన్ రూపొందించండి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రం ఆత్మ కళలు, ఆ కళలు, సంస్కృతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ లోని ఎల్బీ ఇండోర్ స్టేడియంలో రామదాసు జయంతి ఉత్సవాలలో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ నేల గర్వించదగ్గ గొప్ప వాగ్గేయకారుడు, భద్రాచల రామదాసు అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కొనియాడారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోని కళాకారులకు, సాంస్కృతిక వైభవానికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం సాధించిన అనేక విజయాలను రాష్ట్ర అభివృద్ధి గురించి సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలతో ప్రజలకు వివరించారు, ఆ కళారూపాల్లో ప్రజలు పాల్గొనడమే కాదు ప్రజలు స్పందించిన తీరు తనకు వ్యక్తిగతంగా తెలిసిన వ్యక్తిగా భవిష్యత్తులో సంగీత నాటక అకాడమీ విరివిగా కార్యక్రమాలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తూ ముందుంటుందని, అవసరమైన ఆర్థిక అవసరాలను తీరుస్తామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. నేలకొండపల్లిలో జన్మించిన గోపన్న తన భక్తితో, కీర్తనలతో భక్త రామదాసుగా చిరస్థాయిగా నిలిచిపోయారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కొనియాడారు. ఆయన కట్టిన భద్రాచలం ఆలయం, రాసిన కీర్తనలు ప్రతి తెలుగువారి గుండెల్లో నిలిచిపోయాయని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత మన ప్రాంత వాగ్గేయకారుల గొప్పతనాన్ని మిగతా 2లో..



## కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో

# విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- ఆరోగ్యం నిలకడగానే ఉందని అధికారుల వెల్లడి






**గూడూరు, మార్చి1 (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం ఉదయం ఘటన చోటుచేసుకుంది. పాఠశాలలో చదువుతున్న 8వ,తరగతి విద్యార్థినిల మధ్య జరిగిన చిన్న గొడవ తీవ్ర స్థాయికి చేరడంతో ఒక విద్యార్థిని సుమారు 16 ఐరన్ మాత్రలు మింగినట్లు గుర్తించిన ఉపాధ్యాయులు అప్రమత్తమై వెంటనే స్పందించారు. బాలికను గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థిని వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతూ ఉండగా ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సునీత తెలిపారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, విద్యార్థినిల మధ్య ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

## పేదల ఇండ్ల కూల్చివేతపై జోక్యం చేసుకోండి

**సీఎం రేవంత్‌కు సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు లేఖ**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఖమ్మం పట్టణంలో పేదల ఇండ్ల కూల్చివేత సమస్యపై వెంటనే జోక్యం చేసుకొని, ప్రస్తుతం సరైన భోజనం, వసతి సౌకర్యాలు కల్పించి, వారికి అదే భూదాన భూముల్లో పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీఎం రేవంత్‌కు సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు లేఖ రాశారు. గత నెల 24న ఖమ్మం కార్పొరేషన్, వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలో గత 12 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్న సుమారు 700 మంది పేదల ఇండ్లు కూల్చివేశారని, పోలీసు, రెవెన్యూ సిబ్బంది కలిసి ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని, అవి భూదాన యజ్ఞ బోర్డుకు చెందిన భూములు. 2014లోనే ఈ బోర్డు చైర్మన్ రాజేందర్‌రెడ్డి అక్కడి పేదలకు ఇంటి స్థలం కోసం 100 గజాల చొప్పున మంజూరు చేసినట్లు తెలిసిందని లేఖలో పేర్కొన్నారు. అవి విలువైన భూములనే పేరుతో పేదలను అక్కడి నుండి తొలగించటం సరైంది కాదని, గత నెల 28న తాను ఆ ప్రాంత సందర్శనకు వెళ్లానని, అది యుద్ధంలోనో, భారీ భూ కంపంలోనో నాశనమైనట్లు బీభత్సంగా ఉందని పేర్కొన్నారు. ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉండి బుల్డోజర్ సంస్కృతిని వ్యతిరేకిస్తున్న ప్రజాప్రభుత్వం ఈ విధంగా పేదల పట్ల అమానుషంగా వ్యవహరించటం దారుణమైన విషయమని, అలాగే వారికి తాత్కాలిక ఆశ్రయం కల్పించిన అంబేద్కర్ భవన్, టిటిడిసిలలో కూడా, సరైన వసతి, భోజన ఏర్పాట్లు, మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేదని, అక్కడ ఉన్నవారు అనారోగ్యం పాలౌతున్నట్లు కూడా చెప్పారని తెలిపారు. వెంటనే మీరు జోక్యం చేసుకొని, ప్రస్తుతం సరైన భోజనం, వసతి సౌకర్యాలు కల్పించి, వారికి అదే భూదాన భూముల్లో పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.

# ధరలేక.. వదిలేయలేక

- టమాట రైతులకు నష్టాలు
- కూలీల ఖర్చులూ రావడం లేదని ఆందోళన



**సిద్దిపేట (జనంసాక్షి) :** ఊహించని విధంగా టమాట ధరలు పడిపోవడంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయారు. మొన్నటివరకూ బాగా పలికిన టమాట ధర ఇప్పుడు అమాంతం పడిపోవడంతో పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం చేనులో టమాట తెంపినందుకు కూలీలకు చెల్లించాల్సిన డబ్బులు, రవాణా ఖర్చులు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ మాత్రం గిట్టుబాటు కాకపోవడంతో టమాట తెంపకుండానే చేనులోనే వదిలేస్తున్నారు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలో నీటి వసతి అంతంత మాత్రమే ఉన్న చోట రైతులు కూరగాయల సాగుపై ఎక్కువ దృష్టి పెట్టారు. ఇందులో అధిక మొత్తంలో టమాట సాగు చేశారు. అయితే ఒక్కసారిగా టమాట ధర పడిపోవడంతో పెట్టుబడులు రాని పరిస్థితి నెలకొన్నదని రైతులు వాపోతున్నారు. కనీసం కూలీలు, పంట తరలించే రవాణా చార్జీలు కూడా గిట్టుబాటు కాకపోవడంతో చేనులోనే వదిలేస్తున్నామని తెలిపారు. 20 రోజుల క్రితం మార్కెట్‌లో కిలో రూ.30 ధర పలుకగా పండించిన రైతుకు రూ.20 వచ్చేది. కానీ ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.5 నుంచి రూ.10 మధ్య ధర పలుకడంతో హోల్‌సేల్ కిలో రూ.2 కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాయపోల్ మండలంలోని తిమ్మక్కపల్లి గ్రామానికి చెందిన ఎకరం టమాట పంట సాగు చేశాడు. అయితే పంట సాగు చేసి చేతికి వచ్చిన హయాంలో ధర పడిపోవడంతోపాటు అకాల వర్షానికి పంట నష్టం జరగడంతో ప్రకాశ్ బోరున విలపించారు. టమాట పంటను మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు వంద ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు. టమాట పంటకు నీరు లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

## నోటీసులు ఇవ్వకుండా ఇండ్లను కూల్చడం సరైనది కాదు

- బాధితులకు తక్షణమే పునరావాసం కల్పించి, తగిన న్యాయం చేయాలి..
- ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ ప్రాంతాన్ని సందర్శించిన ప్రొఫెసర్ కోదండరాం



**ఖమ్మం (జనంసాక్షి) :** ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల భూదాన్ ఇండ్ల నిర్వాసితులను కలిసి వారి సమస్యలను తెలుసుకుని, నగరంలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో బాధితులను పరామర్శించారు. అనంతరం వెలుగుమట్ల ప్రాంతాన్ని సందర్శించి, అక్కడి ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నోటీసులు ఇవ్వకుండా ఇండ్లను కూల్చడం సరైనది కాదని అభిప్రాయపడుతూ బాధితులకు తక్షణమే పునరావాసం కల్పించి తగిన న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం భూమి వివాదాల పేరుతో చర్యలు చేపట్టినట్లు చెబుతున్నా, పేదలపై దాని ప్రభావం తీవ్రంగా పడిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ముందస్తుగా నోటీసులు ఇచ్చి కొంత సమయం ఇవ్వాల్సి ఉండేదని అభిప్రాయపడ్డారు. అక్కడ నివసిస్తున్న వారంతా పేద ప్రజలే అని, ఖమ్మం నగరంలోనే పనిచేస్తూ జీవనాధారం పొందుతున్నారని తెలిపారు. వారికి ఖమ్మం నగరంలోనే ప్రత్యామ్నాయ వసతి సౌకర్యం కల్పించాలని కోరారు. ఇక్కడ పరిశీలించి, స్థానికులతో మాట్లాడిన అంశాలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్, జిల్లా నాయకులు సర్దార్, రవి, షేక్ నబీ, కరుణాకర్, జేఏసీ నాయకులు రంగ రాజు, భాస్కర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు

- పేదోడి కలను సాకారం చేస్తున్నా ప్రజా ప్రభుత్వం
- మంజూరు చేసిన ఇండ్లను త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలి
- మంత్రి దనసరి అనసూయ సీతక్క





**ఏటూరునాగారం, మార్చి 01(జనంసాక్షి) :** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు, ప్రజా ప్రభుత్వం పేదవారికి కలలను సాకారం చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం ఏటూరునాగారం మండలం కేంద్రంలోని ఎస్ ఎల్ ఎన్ గార్డెన్ ఫంక్షన్ లో మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామానికి చెందిన 90 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను, ఏటూరునాగారం మండలానికి చెందిన 38 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని పేదవాడి కలను సకారం చేయడానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, మంజూరు చేసిన ఇండ్లను లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణం పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. కొండాయి గ్రామంలో పార్టీలకు అతీతంగా 90 మందికి ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని, 16 కోట్ల రూపాయల నిధులతో పటిష్టంగా అత్యంత నాణ్యత ప్రమాణాలతో వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మహిళా సంఘం లో సభ్యురాలుగా ఉంటే ఇంటి నిర్మాణానికి తక్షణమే లక్ష రూపాయల రుణాన్ని అందిస్తామన్నారు. కొండాయి గ్రామం జంపన్న వాగు పరివాహక ప్రాంతంలో ఉన్నందున మంజూరు అయిన ఇండ్లను సురక్షిత ప్రాంతంలో నిర్మించుకోవాలని లబ్ధిదారులకు మంత్రి సూచించారు. ప్రభుత్వం ములుగు ప్రాంతాన్ని గతంలో ఎన్నడూ లేనటువంటి విధంగా సంక్షేమ పథకాలకు అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఈ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం ఏటూరునాగారం మండలానికి చెందిన 38 మంది లబ్ధిదారులకు మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ తో కలిసి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలని ఎవరైనా బాల్యవివాహాలు చేయడానికి, చేసుకోవడానికి సిద్ధపడిన జైలు శిక్షతో పాటు కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, డిపిఓ వెంకయ్య, హౌసింగ్ పీడీ ఎస్ సూర్యనారాయణ, ఎంపీడీవో శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి






- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త

**హైదరాబాద్ (జనంసాక్షి) :** క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. బండ్లగూడ, నాగోల్‌లో అస్మిత సైక్లింగ్ లీగ్ 2025-26 కార్యక్రమం చైర్మెన్ డాక్టర్ మాక్స్‌వెల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వమించారు. మహిళా క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఖేలో ఇండియా ఆధ్వర్యంలో ఈ సైక్లింగ్ లీగ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. మహిళలు క్రీడలలో ముందుకు రావడం సమాజానికి గర్వకారణమని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాకారులకు అన్ని విధాలా కృషి చేస్తుంది అని ఆయన అన్నారు. అన్ని జిల్లాల్లో త్వరలోనే క్రీడా స్టేడియం లు ఏర్పాటు చేయడం జరిగింది అని ఆయన అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించి, జాతీయ స్థాయిలో ప్రతిభను వెలికితీస్తాయని పేర్కొన్నారు.

క్రీడల ద్వారా మహిళలకు గుర్తింపు లభిస్తుందన్న సందేశంతో నిర్వహించిన ఈ అస్మిత సైక్లింగ్ లీగ్ విజయవంతంగా ముగిసింది.

ఎలైట్ విభాగంలో శివ బిందియా (బంగారు పతకం), బారిగే కావ్య (వెండి పతకం), పచిమట్ల రవళి(కాంస్య పతకం), మహిళల జూనియర్ విభాగంలో వర్షా రెడ్డి (బంగారు పతకం), బారిగే కావ్య (వెండి పతకం), పచిమట్ల రవళి (కాంస్య పతకం), 8-9 సంవత్సరాల విభాగంలో ఎస్. అభికా (బంగారు పతకం), బి. స్నితిషా (వెండి పతకం), స్రిజన్య (కాంస్య పతకం)లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐవీఫ్ యూత్ ప్రెసిడెంట్ కట్ట రవి కుమార్ గుప్త, లోరీన్ ట్రెవర్ ఎం.కే. పాషా, శ్రీకాంత్ మన్నార్ డా. పండిత్ మద్నూర్ సంజీవ రెడ్డి యాదయ్య పెరిక పాల్ రాస్ డా. యూజిన్ జార్జ్ నార్మన్ ఐజాక్ దేశ్‌ముఖ్ చింతామణి - శ్రీనివాస్ ఎ యోగేష్ కటారియా శ్రీనివాస్ ఉదారి తదితరులు పాల్గొన్నారు.

## బెదిరింపులకు పాల్పడి డబ్బులు వసూలు చేసిన విలేకర్లు అరెస్ట్

**బోథ్, మార్చి 01 (జనంసాక్షి) :** ప్రజలను బెదిరిస్తూ వారి నుంచి నగదు వసూలు చేస్తున్న విలేకరులను ఆదివారం బోథ్ పోలీసులు అరెస్టు చేశారు. సిఐ గురు స్వామి తెలిపిన వివరాల మేరకు వివరాలీలా ఉన్నాయి. బోథ్ మండలం ధన్నూరు(బి) గ్రామానికి చెందిన బైరీ వెంకట స్వామి అతడి వద్ద 2023 వ సంవత్సరంలో మండలానికి చెందిన ఐదుగురు విలేకర్లు తనను బెదిరించి అక్రమంగా రెండు లక్షలు వసూలు చేశారని. ఎందుకని బాధితుడు ప్రశ్నించగా డబ్బులు ఇవ్వకపోతే అక్రమ సంబంధం అంటగట్టి ఆత్మహత్య చేసుకునే విధంగా వార్త పత్రికలో ప్రచురిస్తామని బెదిరించినట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. చట్టం దృష్టిలో ప్రతి ఒక్కరు సమానమే అని ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ప్రజలు నిర్భయంగా పోలీసుల ముందుకు వచ్చి సంప్రదించవచ్చని వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్ఐ పురుషోత్తం సిబ్బంది పాల్గొన్నారు.

## ఇండ్ల మధ్యలో పాము కలకలం

- భయాందోళనకు గురవుతున్న ప్రజలు



**షాద్‌నగర్ (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని మున్సిపాలిటీ 9వ వార్డులోని వెంకటరణ కాలనీలో పాము కలకలం సృష్టించింది కాలనీలోని చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీ ఎత్తున గడ్డి చెట్లు చెత్తా చెదారం పేరుకుపోవడంతో చాలాకాలంగా పాములు ఆ ప్రాంతంలో తిరుగుతున్నాయి దీంతో ప్రజలు కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు సంబంధిత అధికారులు స్పందించి గడ్డి చెట్లను చెత్త చెదారంను తొలగించాలని కోరుతున్నారు..

# వలస కూలిపై అడవి పంది దాడి..

- ఆస్పత్రికి తరలించిన 108 సిబ్బంది..

**భువనగిరి (జనంసాక్షి) :** యాదాద్రి జిల్లా పోచంపల్లి మండలానికి చెందిన ధోతి గూడెం గ్రామంలో వలస కూలీపై అడవి పంది దాడి చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. దోతి గూడెం గ్రామంలో రైతు కూలీ పనిచేస్తున్న ప్రదేశంలోకి అడవి పంది అకస్మాత్తుగా వచ్చి పాలకుర్తి వెంకటేశ్వర్లు (35)పై ఒక్కసారిగా దాడి చేసింది. దీంతో ఆయనకు తీవ్రమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. వారు వెంటనే ప్రథమ చికిత్స కోసం బీబీనగర్ కి తీసుకురాగా, అక్కడనుండి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి వెళ్ళవలసిందిగా వైద్యులు సూచించారు. గాంధీ ఆస్పత్రికి సకాలంలో తరలించినందుకు బాధితుడి బంధువులు ఈఎంటి విశ్వం, పైలెట్ చిన్న కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు సమాచారం.

## జీహెచ్ఎంసీ 'ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం'

# కార్యక్రమానికి విశేష స్పందన

- పన్నులు చెల్లించండి.. నగరాభివృద్ధికి సహకరించండి : కమిషనర్ ఆర్ వి కర్ణన్ పిలుపు



**హైదరాబాద్, మార్చి 1 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ నగర పౌరుల ప్రాపర్టీ ట్యాక్స్ సంబంధిత సమస్యలకు వేగవంతమైన పరిష్కారం కల్పించేందుకు జీహెచ్ఎంసీ 'ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం' (పీపీటీ) కార్యక్రమం జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని సర్కిల్ కార్యాలయాలలో ఆదివారం నిర్వహించింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించిన పీపీపీ ప్రత్యేక కార్యక్రమంలో రివిజన్ పిటిషన్లు, ట్యాక్స్ అంచనాల సవరణలు, బిల్ కలెక్టర్లు , ఆన్లైన్, ఆర్‌టీజీఎస్ ద్వారా చెల్లించిన మొత్తాల నమోదు, బకాయిల సవరణలు, కోర్టు కేసుల పరిష్కారం, ఐజీఆర్ఎస్ అంశాలు, స్వీయ అంచనా సమస్యలు తదితర పన్ను సంబంధిత సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను ఈ వేదిక గా డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్లు, వాల్యుయేషన్ అధికారులు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు స్వీకరించారు. పీపీటీ కార్యక్రమం కు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రాపర్టీ ట్యాక్స్ పన్ను సమస్యల పరిష్కారం కోరుతూ ఆదివారం మొత్తం 285 దరఖాస్తులు వచ్చాయి. ప్రధానంగా ఆస్తి పన్నుల్లో హెచ్చు తగ్గులు, ఉన్న విస్తీర్ణం కంటే ఎక్కువ విస్తీర్ణం నమోదు, మ్యుటేషన్ తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. వీటిని నిబంధనల మేరకు అధికారులు పరిష్కరించనున్నారు. ఈ నెల 8, 15, 22, 29 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అన్ని సర్కిల్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం జరగనుంది.

**పన్నులు చెల్లించండి.. నగరాభివృద్ధికి సహకరించండి : కమిషనర్ ఆర్ వి కర్ణన్ పిలుపు**

గ్రేటర్ హైదరాబాద్ నగర ప్రజలు తమ ప్రాపర్టీ టాక్స్ చెల్లించి నగర అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కమిషనర్ పిలుపునిచ్చారు. దీర్ఘకాలంగా ఆస్తి పన్ను బకాయిలు ఉన్న వారికి ఊరటనిస్తూ 'వన్ టైమ్ సెటిల్మెంట్' (ఓటీఎస్) పథకాన్ని 2025-2026 ఆర్థిక సంవత్సరంకు గానూ ప్రభుత్వం ప్రకటించిదన్నారు.. ఈ స్కీమ్ కింద పాత బకాయిలపై పేరుకుపోయిన వడ్డీలో ఏకంగా 90 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వెంటనే పనులను చెల్లించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
2 మార్చి 2026

# తెలంగాణ చరిత్రలో కొన్ని అంశాలు



చెరువులు, కులవృత్తులతో ఉత్పత్తి, నైపుణ్యం... పూర్వం శాతవాహ నుల కాలం నుండి వ్యవసాయానికి సాగునీరు అందించడానికి చెరువుల నిర్మాణం, కాలువల నిర్మాణం మొదలైనవి చేపట్టిన్రు. చాళుక్యులు, కాకతీయులు, మహమ్మదీయ రాజులు కూడా ఈ క్రమాన్ని కొనసాగించిన్రు. చేతివృత్తులు అభివృద్ధి చెందడానికి కృషి చేసిన్రు.తద్వారా భారతదేశం నుండి ఇతర దేశాలకు క్రీ.శ. 1810 దాకా ఎగుమతులు జరుగుతూనే వచ్చినై. పారిశ్రామిక విప్లవం ప్రారంభమైన తర్వాత 60 ఏళ్ల దాకా కూడా ఈ క్రమం కొనసా గింది. అలా భారతీయ కుటీర పరిశ్రమల, చేతివృత్తుల, వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత మహోన్నతమైనది. తెలంగాణ రాష్ట్ర చరిత్ర గురించి, ఎన్ని అందమైన టూరిస్టు ప్రదేశాలు, చారిత్రక ప్రదేశాలు ఉన్నయో బి.ఎన్. శాస్త్రి, తేరాల సత్యనారాయణ శర్మ, ద్యావనపల్లి సత్యనారాయణ, 1948 వరకు సుంకిరెడ్డి నారాయణరెడ్డి, 1948 తర్వాత తెలంగాణ గురించి ఎలికట్టె శంకర్రావు చక్కని పుస్తకాలు వేసిన్రు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఏర్పడ్డంక తెలంగాణ రాష్ట్ర చరిత్ర గురించి ఉద్యోగ పోటీ పరీక్షల కొరకు అనేక గ్రంథాలు వెలువడుతున్నై. తెలంగాణ చరిత్ర ఎంత గొప్పదో వాల్లు తీస్తున్న పుస్తకాల ద్వారా మనకు తెలుస్తున్నది.

### భారతీయ చేతివృత్తి కులాలను అణచివేసిన ఆంగ్లేయులు

ఈస్టిండియా కంపెనీ, బ్రిటీష్ ప్రభుత్వం భారతీయ ఉత్పత్తులపై 200 శాతం పన్నులు వేసి మాంచెస్టర్ నుండి దిగుమతి చేసుకునే బట్టలు, ఉత్పత్తులపై సబ్సిడీలిచ్చి భారతీయ కుటీర పరిశ్రమలను దెబ్బతీసిన్రు. ఈ దెబ్బతో ప్రజలు వృత్తులు కోల్పోయిన్రు. పట్టణాల నుండి, నగరాల నుండి పొట్ట చేత పట్టుకొని పల్లెలకు వలస సాగింది. పల్లెల్లో వ్యవసాయ కూలీలపై ఒత్తిడి పెరిగి కూలీలస్థితి మరింత దిగజారిపోయింది. అలా దళితుల బతుకులు హీనంగా మారిపోయినై అని డా॥ బి.ఆర్.అంబేద్కర్ 1929లో సైమన్ కమిషన్‌కు అందించిన రిపోర్టులో బ్రిటిష్ వారి దోపిడీని, అణచివేతను విస్తారంగా చర్చించి ఖండించిండు.

### వ్యవసాయం పై పెరిగిన ఒత్తిడి

అలా వ్యవసాయంపై మునుపెన్నడూ లేని ఒత్తిడి పెరిగింది. చీరాలను మున్సిపాల్టీగా ప్రకటించడంతో పన్నుల భారం పెరిగి ప్రజలు దూరాలకు తరలి పోయిన్రు. మున్సిపాల్టీగా ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ పెద్ద ఉద్యమాలు సాగినై. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నాయకత్వంలో సాగిన పోరాటాల గురించి 'చీరాల – పేరాల పోరాటం' పేరిట వెయ్యి పేజీల పుస్తకం వెలువడింది. ఇలా ప్రజలు అదనపు భారాలను భరించలేకపోయిన్రు.

### పారిశ్రామికీకరణ ఆవశ్యకత

అందువల్ల అంబేద్కర్ పారిశ్రామికీకరణ ఆవశ్యకతను గుర్తించి పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి పరచి వ్యవసాయంపై ఒత్తిడి తగ్గించాలని, జనాభాను నగరాలకు, పారిశ్రామిక వాడలకు తరలించాలని కోరిండు. భారతీయ సామాజిక చరిత్రను అంబేద్కర్ లోతుగా అధ్యయనం చేసినట్టు వామపక్షాలు అధ్యయనం చేయలేదు. నిర్దిష్ట సామాజిక వైరుధ్యాలను, చరిత్ర పరిణామాలను విశ్లేషించలేదు. పట్టుకోలేదు.

### భూమిపై వ్యక్తిగత ఆస్తిహక్కు లేని కాలం

రాజుల కాలంలో భూమి అంతా రాజుదే కనుక పండించుకున్న వాళ్లనించి నాలుగో వంతు లేదా ఆరోవంతు వసూలు చేసే వాళ్లు. ఇది మొదట విన్నప్పుడు నాకు చాలా బాధ కలిగింది. కానీ భూమిని కొన్నమని నమోదు చేసుకున్నందుకే ఏడోవంతు దాకా ఖరీదు ఫీజుల రూపంలో, రిజిస్ట్రేషన్ రూపంలో నేటి ప్రభుత్వాలు గుంజుతున్నయి. ఆదాయం పన్ను, అమ్మకం పన్ను, పెట్రోల్‌పై పన్ను అనేక రకాల పన్నులు వేస్తున్న నేటి ప్రభుత్వాలకు ఆదాయ వనరులు ఎన్నో. ఆనాడు వ్యవసాయ ఉత్పత్తులే ఆదాయం. అందువల్ల రాజులు అడవులను నరికించి, చెరువులు నిర్మించి, రహదారులు వేసి, కొత్త గ్రామాలను రూపొందించి, అక్కడికి తరలి వెళ్లడానికి ప్రజలకు భూమి ఇస్తామని ప్రకటించి ఆకర్షించిన్రు. 16 కులాల కులవృత్తుల వారితో అలా శతాబ్దాలుగా కొత్త గ్రామాలు ఏర్పడుతూ వచ్చినై. అలా గ్రామీణ స్వయంపోషక కుల వ్యవస్థ తాలూకు ఆర్థిక వ్యవస్థ కొనసాగుతూ వచ్చింది.

### భూమి వ్యక్తిగత ఆస్తిగా మారిన క్రమం

అలా భూమి తొలుత ఎవరి సొంత ఆస్థికాదు. రాజుల పేరిటనే ఉండేది. భూస్వాముల వద్ద, పట్వారీల వద్ద పేరుకుపోయిన భూములు, ఆయా సంస్థానాలు, రాజ్యాలు, రాష్ట్రాలు, పన్నుల వసూళ్ళ కోసం పెట్టిన యంత్రాంగం ద్వారా లభించినవి. తాహసిల్దార్ కింద ఉండే భూములన్నీ తాహసిల్‌దారువి కావు కదా! కానీ పట్వారీలు, భూస్వాములు, పటేల్లవద్ద పేరుకుపోయిన భూములు తమ సొంతం అని ప్రకటించు కున్నరు. రికార్డులు రాసుకున్నరు. క్రీ.శ. 1840కి ముందు తెలంగాణాలో దొరల గడీలు లేవు. క్రీ.శ. 1840–1860 మధ్య నేటి టోల్‌గేట్ కాంట్రాక్టర్ల లాగ పన్నుల వసూళ్ల కోసం ఏర్పాటు చేసిన భూస్వాములు, జాగీరుదార్లు, జమీందారులు ప్రజలకు చెందే భూములను ఎంత వీలైతే అంత తమ పేరిట రాసుకోవడం జరిగింది. ఒక రూపాయి పన్నుకు బదులు పదిరూపాయలు వసూలు చేసిన్రు. పండినపుడు ఇచ్చిన్రు. కరువుల కాలంలో ఇవ్వలేదు. ఇవ్వని వారి భూములను తమపేరిట రాసుకున్నరు. తొమ్మిదిమంది కట్టకపోయినా ఒక్కరు పన్ను కట్టినా నైజాంకు పన్ను చెల్లించి భూములను తమ పేరిట రాసుకుంటూ ప్రజలను భూమినుండి తొలగించి, పంటలు పండించుకుంటూ ప్రజల చేత వెట్టి చాకిరి చేయించుకోవడం జరిగింది. ఇది కేంద్రంలో, రాష్ట్రంలో, జిల్లాలో అధికారం మారినట్టు గ్రామాల్లో అధికారాన్ని బదిలీ చేయకపోవడంవల్ల ఏర్పడిన పెద్ద ముప్పు.

### నాలుగంచెల వ్యవస్థలో మారని చివరి అంచె

స్వాతంత్ర్యం వచ్చే క్రమంలో కేంద్ర ప్రభుత్వంలోని ఇంగ్లాండు ప్రభుత్వం తప్పుకున్నది. రాష్ట్రాల్లో, సంస్థానాల్లో సంస్థానాధీశులు తప్పుకోవడానికి 565 సంస్థానాలను విలీనం చేసి రాష్ట్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. అదే సమయంలో గ్రామీణ స్థాయిలో ఉన్న పాత వ్యవస్థను తొలగించాల్సి ఉండింది. అయితే ఆ సెక్షన్ల నుండే జాతీయోద్యమంలో ప్రధాన నాయకత్వం రావడం, వారి నుండే జాతీయ నాయకత్వానికి సహకారం అందడంవల్ల ఆ కర్తవ్యాన్ని వదిలేసిన్రు. ఇలా కేంద్రం, రాష్ట్రం, జిల్లా వ్యవస్థల తర్వాత గ్రామీణ స్థాయిలో స్థిరపడిన చివరి వ్యవస్థను ముట్టుకోలేదు. ప్రజాస్వామ్య వ్యవస్థకు అనుకూలంగా మార్చలేదు. ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాలకు రెండు మూడేళ్లకో సారి ఎన్నికలు జరుపుకున్నట్టు స్థానిక సంస్థలు గ్రామ పంచాయితీలకు, మండలాలకు, జిల్లా పరిషత్‌లకు ప్రతి రెండు మూడేళ్ళకోసారి రాజ్యాంగబద్ధంగా జరిపితే గ్రామీణ సమస్యలు, గ్రామీణ సంస్కృతి, గ్రామీణ చైతన్యం కదలబారతాయి. మిగతా ప్రపంచమంతా పోటీ పడతారు. ఓటు హక్కు యొక్క విలువ గ్రామ పంచాయితీ ఎన్నికల్లో తెలిసినంత దగ్గరగా ఎమ్మెల్యే, ఎంపీ ఎలక్షన్స్‌కు తెలియవు. గ్రామ పంచాయితీలే గ్రామాలు మారడానికి కీలకంగా రెండు మూడేళ్ళకోసారి ఎన్నికలు జరిపితే రాష్ట్ర, కేంద్ర రాజకీయాలు కూడా చాలా మారతాయి.

### ప్రజలకు, ప్రజాస్వామ్యానికి ముప్పగా పరిణమించిన గ్రామీణ వ్యవస్థ

ఈ ముప్పు కారణంగా దేశంలోని ఏడు లక్షల గ్రామాల్లో ఇప్పటికీ ఆనాటి ఆధిపత్య సామాజిక వర్గాలే అనేక రంగాల్లో ఆధిపత్యం వహిస్తూ ప్రజాస్వామికంగా ఎదుగుతున్న ప్రజానీకాన్ని ఎదగకుండా అడ్డుకుంటున్నరు. అన్ని అభివృద్ధి పథకాలను, అన్ని స్థాయిల్లోని రాజకీయ, సామాజిక, ఆర్థిక సాంస్కృతిక ఆధిపత్యాన్ని సొంతం చేసుకుంటున్నరు. స్వాతంత్ర్యానంతరం జరుగుతున్న పరిణామాలకు ఇది పునాది. ఈ విషయం ముందే పసికట్టిన డా. బి.ఆర్. అంబేద్కర్ గ్రామీణ స్వరాజ్యం అనే గాంధీజీ పిలుపును తీవ్రంగా వ్యతిరేకించిండు. రాజ్యాంగంలో చేర్చడానికి నిరాకరించిండు. గ్రామీణ స్వరాజ్యం పేరిట ఎన్నికల ద్వారా తిరిగి ఆయా కులాధిపత్య, సామాజిక వర్గాలే తమ ఆధిపత్యాన్ని మరింత చట్టబద్ధంగా కొనసాగిస్తూ మిగతా ప్రజలను అణచి వేస్తరని, ఎదగకుండా చేస్తరని అంబేద్కర్ వాదించిండు. అంబేద్కర్ అంచనా వేసినట్టే స్వాతం త్ర్యం వచ్చినంక అలా కొన్ని గ్రామీణ సామాజిక వర్గాల (బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ, వెలమ, వైశ్య, ముస్లింల, దొరల, రాజుల, సంస్థానాధీశుల) ఆధిపత్యం కొనసాగుతూ వస్తున్నది. అన్నిరంగాలు వాళ్లే ఆక్రమించిన్రు. రాజ్యాంగ పరిషత్ సభ్యులు ఎంతో విద్యావంతులు గా, సంస్కారవంతులుగా, ఉదారంగా స్వేచ్ఛా సమానత్వం, సౌభ్రా తృత్వం, సామాజిక న్యాయం, సామాజిక మార్పు, అందరికీ ఓటుహ క్కు, సమాన అవకాశాలు, కులాతీతంగా, మతాతీతంగా అందరికీ సమాన హక్కులు రాజ్యాంగంలో పొందు పర్చిన్రని ఈ ఉదారత గ్రామీణ వ్యవస్థలో అసాధ్యమని కరుడుగట్టిన కులాధిపత్యం, సామాజిక ఆధిపత్యం మార్పును అంగీకరించదని అన్నడు. అందువల్ల గ్రామ స్వరాజ్యం గురించి అంబేద్కర్ రాజ్యాంగంలో చేర్చలేదు. తర్వాత రాజ్యాంగ సవరణల ద్వారా చేర్చుకోవడం జరిగింది.

### ఓటు హక్కు విలువ తెలుసుకున్న ప్రజలు


కాలక్రమంలో ప్రజలు ఓటు హక్కు విలువను తెలుసుకున్నరు. ముఖ్యంగా 1959–60 నుండి మొదలైన పంచాయితీరాజ్ గ్రామ పంచాయితీ, పంచాయితీ సమితి ఎన్నికల వల్ల అధికారం మారడం సాధ్యమే, తమ ఓటే ఎవరినైనా అధికారంలోకి తెచ్చుకోవడానికి సాధనం అని ప్రజలకు తెలిసిరావడం మొదలయింది. ఆ క్రమంలో వందలాది గ్రామాల్లో కాంగ్రెసు, సోషలిస్టు, కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలో వారి స్ఫూర్తితో ప్రజలు ఎక్కడికక్కడ భూస్వాములను, పట్వారీలను ఎదిరిస్తూ ఎన్నికల్లో సర్పంచ్‌లుగా, పంచాయితీ సమితి అధ్యక్షులుగా పోటీ చేసిన్రు.

### బహుజనుల నాయకత్వంలో సామాజిక పరిణామం

1952లో కరీంనగర్ జిల్లా మెట్‌పల్లినుండి పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన గంగుల భూమయ్య వెలమల పై పోటీచేసి ఎమ్మెల్యేగా గెలిచిండు. ఈ పరిణామాలను 'వారసత్వం' కథలో రికార్డు చేసిన. 1962లోనే ఒక పద్మశాలి మల్యాల తాలూకా ఆరవెల్లి గ్రామానికి చెందిన ఉప్పులంచ ఈశ్వరయ్య స్వతంత్ర అభ్యర్థిగా కరీంనగర్ పార్లమెంటుకు పోటీ చేసిండు. తిమ్మిని బమ్మిచేసి ఓట్ల లెక్కింపులో ఓడిపోయినట్టు చూపి, భూస్వామ్య కుటుంబం నుంచి వచ్చిన జె. చొక్కారావు గెలిసినట్టు ప్రకటించిన్రట. అయినా కేవలం 35 వేల ఓట్ల మెజారిటీ తక్కువైంది అని, పద్మశాలీలే ఈయనేం గెలుస్తడు అని ఓట్లు వేయలేదని ఆయన స్వయంగా నాతో చెప్పిండు. అదే సమయంలో జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో కస్తూరి లక్ష్మణ్ పోటీ చేసిండు. ఓడిపోవడంతో తమ కులంవాల్లయిన పద్మశాలీలే తనకు ఓట్లు వేయలేదని నిరాశ చెంది ఆత్మహత్య చేసుకున్నడు.

ఇలా బహుజనులు ఎక్కడికక్కడ ఓటుహక్కు విలువ తెలుసుకొని రాజకీయ, సామాజిక రంగాల్లో ముందుకు సాగిన్రు. తమ అస్తిత్వ గౌరవం కోసం ఆయా కులాలవాల్లు తమ దేవుళ్లను కుల దైవాలుగా కొత్తగా గుళ్లను కట్టుకోవడం ప్రారంభించిన్రు. ఇలా పద్మశాలీలు మార్కండేయ గుడులను, విశ్వబ్రాహ్మణులు పోతులూరి వీరబ్రహ్మం గుడులను, గౌండ్లు ఎల్లమ్మ, కాటమయ్య గుడులను స్వాతంత్ర్యానంతరం కట్టడం జరిగింది. కులవృత్తుల గిట్టుబాటుకోసం గుంటుక నర్సయ్య పంతులు, నిజాం రాజవైద్యుడైన హకీం వనమాల నారాయణదాసు, కొండా లక్ష్మణ్ బాపూజీ, ఎక్కలదేవి లక్ష్మణ మొదలైనవాల్లు చేనేత పద్మశాలీల సహకార సంఘాలను పెట్టి, సబ్సిడీ నూలును కోరి సాధించుకున్నరు. ఇతర కులాలు దీన్ని ఆదర్శంగా తీసుకొని సహకార సంఘాలు స్థాపించుకున్నరు. ఇలా ఆయా వృత్తుల్లో జీవన ప్రమాణాల పెరుగుదల కోసం, తమ పిల్లలు చదువుకోవడం కోసం వసతి గృహాలను నిర్మించిన్రు. అట్ల హైదరాబాదులో పద్మశాలి హాస్టల్, పెరిక హాస్టల్, మున్నూరుకాపు హాస్టల్, రెడ్డి హాస్టల్, వెలమ హాస్టల్, వైశ్య హాస్టల్, కమ్మ హాస్టల్, గౌడ హాస్టల్ మొదలైనవి ఎందరో కృషి చేసి నిర్మించిన్రు. ఆధునిక అభివృద్ధిలో తమ వాటా పొందడానికి ఇలా శాంతియుతంగా, నిర్మాణాత్మకంగా 1921 నుండి తెలంగాణలో ఉద్యమిస్తూ వస్తున్నరు. స్వాతంత్ర్యానంతరం ఈ కృషి మరింత వేగవంతమైంది.

ఇలా శాంతియుత పరివర్తన, అభివృద్ధి అందుకోవడం, రాజకీయాల్లో తమ స్థానం కోసం, శాంతియుత సంఘర్షణ వేగవంతమయింది.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# తెలంగాణ విద్యా కమిషన్

## మార్పుల దారిలో మల్లగుల్లాలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో దీర్ఘకాలిక, నిర్మాణాత్మక మార్పులు తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రముఖ మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అధ్యక్షతన ఒక విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో ప్రాథమికం నుంచి ఉన్నత విద్య వరకు పేరుకుపోయిన సమస్యలను సమగ్రంగా విశ్లేషించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విధాన సిఫార్సులు చేయడం ఈ కమిషన్ లక్ష్యంగా పేర్కొనబడింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గడం, ప్రైవేట్ విద్యాసంస్థల ఆధిపత్యం పెరగడం, ఉపాధ్యాయుల ఖాళీలు, డిజిటల్ అసమానతలు, గ్రామీణ, పట్టణ వ్యత్యాసాలు, మౌలిక వసతుల లోపం వంటి అంశాలు ఈ కమిషన్ ఏర్పాటుకు ప్రధాన కారణాలుగా ప్రభుత్వం వివరించింది.

కమిషన్ నివేదికలో ప్రభుత్వ పాఠశాలల పునరుజ్జీవనంపై దృష్టి సారించబడింది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న చిన్న పాఠశాలలను సమీపంలోని పెద్ద పాఠశాలల్లో విలీనం చేయడం ద్వారా వనరులను సమర్థంగా వినియోగించుకోవచ్చని సూచించింది. ఉపాధ్యాయుల బదిలీ విధానాన్ని పునర్వ్యవస్థీకరించి, అవసరానికి అనుగుణంగా నియామకాలు చేపట్టాలని సిఫార్సు చేసింది. పాఠ్య ప్రణాళికల్లో స్థానిక అవసరాలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి దిశగా ఉపయోగపడే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మాధ్యమ విస్తరణ, డిజిటల్ బోధన సదుపాయాల కల్పన, పాఠశాలల పనితీరును కొలిచే సమగ్ర మూల్యాంకన విధానం ప్రవేశపెట్టడం వంటి ప్రతిపాదనలు కూడా నివేదికలో ఉన్నాయి.

అయితే ఈ నివేదిక వెలువడిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విస్తృత చర్చ మొదలైంది. ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా వేదికలపై ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, రాజకీయ పార్టీలు, విద్యావేత్తలు తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాఠశాలల విలీన ప్రతిపాదనపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చిన్న పాఠశాలలు మూసివేస్తే చిన్నారులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని, ఇది బాలికల చదువుపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఉపాధ్యాయ సంఘాలు హెచ్చరించాయి. పాఠశాల గ్రామ సమాజానికి ఒక సాంఘిక కేంద్రంగా పనిచేస్తుందని, దాన్ని తొలగించడం గ్రామ జీవన నిర్మాణంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వారు పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సంఘాలు మరో కీలక అంశాన్ని ప్రస్తావించాయి. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా, పనితీరు ఆధారంగా ఒత్తిడి పెంచడం సరికాదని. ఫలితాల ఆధారిత మూల్యాంకన వ్యవస్థ బోధనను యాంత్రిక ప్రక్రియగా మార్చి, మార్కులకే ప్రాధాన్యం ఇచ్చే పరిస్థితిని తెచ్చిపెట్టవచ్చని వారు అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయులపై పరిపాలనా బాధ్యతలు పెరగడం వల్ల బోధన సమయం తగ్గే ప్రమాదం ఉందని కూడా పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఛ సేవ్ గవర్నమెంట్ స్కూల్స్, ఛ నో స్కూల్ మెర్జర్స్ వంటి ప్రచారాలు ఈ ఆందోళనకు బలం చేకూర్చాయి.

విద్యార్థి సంఘాలు ప్రధానంగా ప్రైవేటీకరణ ముప్పు, డిజిటల్ అసమానతలపై దృష్టి సారించాయి. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలంటే కేవలం విలీనాలు సరిపోవని, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయాలు, డిజిటల్ పరికరాలు సమానంగా అందుబాటులో లేవని వారు పేర్కొన్నారు. డిజిటల్ లెర్నింగ్ విస్తరణ సరైన మౌలిక సదుపాయాలు లేకుండా అమలు చేస్తే సామాజిక అసమానత మరింత పెరిగే అవకాశం ఉందని వారు హెచ్చరించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ నివేదికపై మిశ్రమ స్పందన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకులు విద్యా సంస్కరణలు ఖర్చు తగ్గింపు చర్యలా? లేక నాణ్యత పెంపు దిశగా ఉన్నాయా? అని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల మూసివేత రాజకీయంగా సున్నితమైన అంశమని వ్యాఖ్యానించారు. ప్రజాభిప్రాయం సేకరించి, దశలవారీగా అమలు చేయాలని సూచించారు.

విద్యావేత్తల విశ్లేషణలు సమతుల్య దృక్పథాన్ని ప్రతిబింబించాయి. విద్యార్థుల సంఖ్య అత్యల్పంగా ఉన్న పాఠశాలల్లో బోధన నాణ్యత మెరుగుపరచడం కష్టమని అంగీకరించినప్పటికీ, విలీన ప్రక్రియలో రవాణా, భద్రత, మౌలిక వసతులు ముందుగా కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇంగ్లీష్ మాధ్యమ విస్తరణపై కూడా వారు రెండు కోణాలను వివరించారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఇంగ్లీష్ అవసరమని ఒక వర్గం పేర్కొనగా, మాతృభాషలో బలమైన పునాది లేకుండా నేరుగా ఇంగ్లీష్ బోధన ప్రారంభిస్తే భావవ్యక్తీకరణ దెబ్బతినే ప్రమాదం ఉందని మరొక వర్గం అభిప్రాయపడింది.

ప్రైవేట్ విద్యాసంస్థల నియంత్రణపై నివేదిక స్పష్టత ఇవ్వలేదని విమర్శలు వినిపించాయి. ఫీజుల నియంత్రణ, నాణ్యత ప్రమాణాల అమలు, పారదర్శకత వంటి అంశాల్లో కఠిన చర్యలు అవసరమని విద్యా వర్గాలు సూచించాయి. ప్రభుత్వ పాఠశాలల బలోపేతంతో పాటు ప్రైవేట్ రంగంపై సముచిత నియంత్రణ ఉండాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

ఇదిలా ఉండగా, ప్రభుత్వం ఈ నివేదికను ఒక మార్గదర్శక పత్రంగా చూస్తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్ ఉపాధి అవకాశాలు, గ్లోబల్ పోటీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని విద్యా వ్యవస్థను పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొంటోంది. విద్యను కేవలం ఉద్యోగ సమస్యగా కాకుండా సమాజ భవిష్యత్తుతో ముడిపడిన అంశంగా చూడాలని వాదిస్తోంది.

సమగ్రంగా పరిశీలిస్తే, ఈ వివాదం ఒక మార్పు ప్రక్రియలో సహజంగా ఉద్భవించిన మల్లగుల్లాలుగా కనిపిస్తుంది. విద్యా వ్యవస్థలో ఉన్న అసమానతలు, వనరుల అసమాన పంపిణీ, ఉపాధ్యాయ నియామకాల్లో ఆలస్యం, గ్రామీణ–పట్టణ వ్యత్యాసాలు వంటి నిర్మాణాత్మక లోపాలను సరిదిద్దే ప్రయత్నమే ఈ కమిషన్ లక్ష్యం. అయితే అమలు దశలో సామాజిక వాస్తవాలు, భావోద్వేగ అనుబంధాలు, రాజకీయ అంశాలను పరిగణలోకి తీసుకోవడం అత్యవసరం.

విమర్శలు ప్రజాస్వామ్యానికి బలం. విద్య వంటి సున్నిత రంగంలో సంస్కరణలు అమలు చేయాలంటే ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, నిపుణులతో విస్తృత సంభాషణ అవసరం. నివేదికలోని సానుకూల అంశాలను స్వీకరించి, వివాదాస్పద ప్రతిపాదనలను సవరించి, దశలవారీగా అమలు చేస్తేనే ఈ సంస్కరణలు ఫలప్రదమవుతాయి.

మొత్తంగా, తెలంగాణ విద్యా కమిషన్ నివేదిక మార్పు అవసరాన్ని స్పష్టంగా చాటిచెప్పింది. అయితే ఆ మార్పు సమగ్రంగా, సమానత్వాన్ని కాపాడుతూ, గ్రామీణ–పట్టణ సమతుల్యతను దృష్టిలో ఉంచుకుని, ఉపాధ్యాయుల గౌరవాన్ని పరిరక్షిస్తూ అమలు చేయబడితేనే విద్యా పునరుద్ధరణ సార్థకమవుతుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# 'వందేమాతర గీతం వరస మారుతుంది!'

'మొదట దేశాన్ని చీల్చారు. ఆ తరువాత గీతాన్ని చీల్చారు' అంటూ వందేమాతరం 150వ వార్షిక చర్చను ప్రారంభిస్తూ, 'వందేమాతరం గేయం' విషయంలో నెహ్రూని ఉద్దేశిస్తూ; పార్లమెంట్‌లో ప్రధాని మోడీ మాట్లాడారు. అలా మాట్లాడిన కొద్ది రోజుల్లోనే అంటే జనవరి 28 నాటికే పాటలోని ఆరు స్టాంజుల (stanzas)తో పాటను పాడాలని, కేంద్ర హోంశాఖ ఆదేశాల్ని కూడా జారీచేసేసింది. ఆ వెంటనే ఫిబ్రవరి 11న మార్గదర్శకాలను కూడా అధికారికంగా ప్రకటించింది.

బంకిమ్ చంద్ర చట్టోపాధ్యాయ 1870 లో రాసిన 'ఆనంద్ మఠం' నవలలోని ఒక గీతం అది. మాతృభూమిని దేవతగా భావిస్తూ మతపరమైన భాషతో ఆ రూపకాలతో రాసిన గీతం అది. బ్రిటిష్ వ్యతిరేక జాతీయోద్యమంలో ఇది ఒక 'స్వాతంత్ర్య పోరాట నినాదం'గా మారింది.

మొత్తం 'ఐదు పద్యాలు'గా వుండే ఆ పాటలో మొదటి రెండు పద్యాలలో ప్రకృతి గురించి, భూమి గురించి, దేశభక్తి గురించి వర్ణన వుంటుంది. ఆ తరువాత ఒచ్చే మూడింటిలోనూ భూమిని తల్లితో పోలుస్తూ, ఆ తల్లిని కాళికతో, సరస్వతితో, లక్ష్మితో పోలుస్తూ ఉంటుంది. ఆంగ్ల విద్య పొందిన మొదటి తరం బెంగాలీ మేధావుల్లో చటర్జీ ఒకరు. ఆయనపై 'బ్రాహ్మ సమాజం' వంటి సంస్కరణ ఉద్యమాల ప్రభావం ఉన్నా, ఆ తర్వాత కాలంలో 'సంప్రదాయ హిందూ దృక్పథం' వైపే ఎక్కువగా మొగ్గు చూపారు. కాలక్రమేణా ఆయన రచనల్లో హిందూ ఆధ్యాత్మికతా, దేశభక్తి రెండూ కలగలసి కలిసిపోయాయి. ముఖ్యంగా 'ఆనంద మఠం' నవలలో భారత మాత భావనా, దేవీ ఆరాధనా బలంగా కనిపిస్తాయి. కొందరు విమర్శకులు ఆయనను "మతరంగంలో అతిశయోక్తి" చేశాడని అంటారు. దేశాన్ని దేవీ రూపంలో చూడడం, ధార్మిక ప్రతీకలను రాజకీయంగా ఉపయోగించడం వంటి వాటిపైన ఆ రోజుల్లోనే కొన్ని విమర్శలు ఉన్నాయి.

1757 ప్లాసీ యుద్ధం, 1764 బక్సార్ యుద్ధం తర్వాత, 1765లో మొఘల్ చక్రవర్తి 'షా ఆలం II' ఈస్ట్ ఇండియా కంపెనీకి బెంగాల్, బీహార్, ఒడిశా ప్రాంతాల్లోని 'దివాని హక్కులు' (భూ ఆదాయాన్ని, పన్నుల్ని వసూలుచేసే హక్కులు) ఇచ్చేశాడు. 1769లో బెంగాల్‌లో భయంకరమైన కరవు వొచ్చింది. పంటలు లేవు. జీవనాధారం కోల్పోయారు. అయినప్పటికీ ఈస్టిండియా కంపెనీ పన్నులు తగ్గించలేదు. తగ్గించక పోగా ఇంకొంచం పెంచింది.

హిందూ మతంలోని సన్యాసులకీ, ముస్లిం మతంలోని ఫకీర్ల కీ వేరే వృత్తులు ఉండేవి కాదు. కాయకష్టం చేసుకొని బ్రతికే అలవాటు వీళ్లకు లేదు. ప్రజల్లో తిరుగుతూ వాళ్ల వాళ్ల మతాల్లోని 'సూక్తులు' చెబుతూ యాత్రలు చేస్తూ, జీవిస్తూ వుండే వాళ్ళు. యాత్రల సమయంలో గ్రామాల నుంచి దానం (చరితార్థం) తీసుకునే సంప్రదాయం వీళ్లకు ఉండేది. (ఇచ్చే సంప్రదాయం కూడా ప్రజలకు వుంటేనే ఇది కుదురుతుంది) ఈస్టిండియా కంపెనీ ఆ చలనం పైనా, ఆ దానాలపైనా నియంత్రణలు పెట్టింది. దీంతో వారి ఆర్థిక ఆధారం దెబ్బతినిపోయింది. రాజకీయంగా చూస్తే నవాబుల పాత వ్యవస్థ క్షీణించి, ఆ స్థానంలో కంపెనీ పాలన మొదలయ్యింది. సైనిక నియంత్రణ పెరిగింది. దాంతో స్థానిక ప్రజల్లో అసంతృప్తి విపరీతంగా పెరిగింది. ఆ పరిస్థితుల్లో నించీ వొచ్చిందే 'సన్యాసుల తిరుగుబాటు.' మొదట్లో ఇది 'మత పరమైన తిరుగుబాటు' గా కనిపించినప్పటికీ అంతిమంగా దాన్ని 'వలస ఆర్థిక దోపిడీకి వ్యతిరేక ప్రారంభ రైతు–ప్రజా ఉద్యమం"గా నే చూశారు. 'సన్యాసుల వంటి ప్రారంభ తిరుగుబాట్లు వలస పాలనపై పెరుగుతున్న అసంతృప్తి సంకేతాలు' అని బిపిన్ చంద్ర కూడా వ్యాఖ్యానించారు.



మజ్ను షా (ప్రముఖ ఫకీర్ నాయకుడు) భవాని పాఠక్ (హిందూ సన్యాసి నాయకుడు) దేవీ చౌధురాణి (ఈమె బంకింగ్ చంద్ర చటర్జీ రచనల్లోని ఒక పాత్రగా వున్నారో నిజంగా వున్నారో తెలియదు) వీళ్ళ నాయకత్వాల్లో అంటే దాదాపు 30 సంవత్సరాలపాటు బ్రిటిష్ కంపెనీ దళాలతో అనేకసార్లు పోరాడారు.

'హిందూ సన్యాసులు మాత్రమే పోరాడారు' అనే చరిత్ర గనుక ఉండి ఉంటే; అది మన ప్రధాని మోడీకి చాలా ఇష్టప్రాయంగా వుండేది. తాను లిఖించబోయే 'హైందవ భారత్' కి దగ్గరగా వుండేది. ' ముస్లిం ఫకీర్లు కూడా ఆ పోరాటంలో భాగస్వామ్యం అయ్యారు' అనే మాట ఆయనకి పెద్దగా ఇష్టం వుండదు. కానీ ఏం చేస్తాం? చరిత్రను ఎరైజర్ తో తుడవలేము. భారత చరిత్ర నిండా ముస్లిం ప్రజల పోరాటాలూ, వారు చేసిన త్యాగాలూ ఎన్నో వున్నాయి. 'మనకు ఝాన్సీ రాణి గురించి తెలిసినట్లుగా, అవధ్ రాణి గురించి పెద్దగా తెలియదు' అని బాలగోపాల్ గారు ఒక చోట అన్నారు.

ఈ ఇతివృత్తాన్ని (అయన నవలలో సన్యాసులు, ఫకీర్లే కాకుండా రైతులు, సామాన్య ప్రజలు కూడా ఉంటారు. వాళ్ళు ఉన్నప్పటికీ నాయకత్వ స్థానంలో మాత్రం సన్యాసులు, ఫకీర్లే వుంటారు. ఈ విషయంలో ఆయన మీద ఒక విమర్శ కూడా వుంది) తీసుకొని బంకిం చంద్ర ఛటోపాధ్యాయ 1882 లో 'ఆనంద్ మఠం' అనే నవలను రాశారు. (రాసింది 1870 లో. ప్రింట్ అయ్యింది 1882 లో) 1896 కలకత్తా కాంగ్రెస్ సమావేశంలో 'రవీంద్రనాథ్ ఠాగూర్' ఈ గేయాన్ని మొదటగా ఆలపించారు. (అప్పటికి ఆయన ఇంకా 'జనగణమన' గీతాన్ని రాయలేదు. 1911 లో దాన్ని రాశారు.) అంతకు ముందు సాహిత్యకారుల లో మాత్రమే ఉన్న ఆ పాటకు జాతీయ వేదికపైన మొట్ట మొదటిసారిగా గుర్తింపు వొచ్చింది.

ఆ తర్వాత, 1905 లో 'లార్డ్ కర్జన్' బెంగాల్‌ను విభజించాక, అదొక 'ఉద్యమ నినాదం'గా మారింది. 1906–1910లలో బ్రిటిష్ ప్రభుత్వం కొన్ని ప్రాంతాల్లో 'వందే మాతరం' అనే నినాదాన్ని నిషేధించింది. నిషేధం కారణంగా ఇది మరింత ప్రజాదరణ పొందింది. రాను రాను స్వాతంత్ర్య ఉద్యమంలో ఇది భావోద్వేగ గీతంగా కూడా నిలిచింది.

బాల గంగాధర్ తిలక్, బిపిన్ చంద్ర పాల్, అరవింద ఘోష్ మొదలైనవారు దీన్ని దేశీయ గీతంగా భావించారు. ప్రజల్లో ఇది 'ప్రతీకాత్మక జాతీయ గీతం' గా మారిపోయింది. 1930లలో కాంగ్రెస్ వర్గాల్లో దీన్ని 'జాతీయ గీతం' గా స్వీకరించాలనే చర్చలు జరిగాయి.

కానీ 'ముస్లిం లీగ్ నాయకులు' మాత్రం దీనికి అభ్యంతరాన్ని తెలిపారు. ఇలా తెలిపిన వాళ్ళల్లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ (కాంగ్రెస్ అధ్యక్షుడు, తొలి విద్యాశాఖ మంత్రి) ప్రథములు. 'వందే మాతరానికి స్వాతంత్ర్య ఉద్యమంలో చారిత్రక పాత్ర ఉంది. కానీ 'ఆనంద మఠం' నవలలోని హిందూ దేవతారాధన భావనలతో కూడిన వ్యాఖ్యలు ముస్లింలకు అసౌకర్యాన్ని కలిగిస్తాయి. మొదటి రెండు శ్లోకాలు మాత్రమే దేశభక్తిని సూచిస్తాయి' అని, ఆయన తన అభిప్రాయాన్ని ప్రకటించారు. మౌలానా మహ్మద్ అలీ జౌహర్ (ఖిలాఫత్ నాయకుడు) 'వందే మాతరాన్ని నినాదంగా వాడటానికి నేను వ్యతిరేకం కాదు; కానీ దాన్ని మతసంబంధమైన ప్రతీకగా మార్చకూడదు' అన్నారు. మహ్మద్ అలీ జిన్నా, అలాగే ఇంకా కొందరు గీతంలోని హిందూ దేవతారాధన భావాలకు తమ తమ అభ్యంతరాలను చెప్పారు. ఎప్పుడైతే ముస్లిం సమూహం నించీ ఒక వ్యతిరేకత వొచ్చిందో, ఇంక హిందూ సమూహంలోని వాళ్ళు కూడా ఒక్కొక్కరూ మాట్లాడడం మొదలు పెట్టారు.

రాజ్యాంగ సభ అధ్యక్షుడు డా. రాజేంద్ర ప్రసాద్ మొదటి అడుగులు వేశారు. "వందే మాతరం పట్ల గౌరవం ఉండాలి. కానీ ఎవ్వరి మనస్సాక్షికీ వ్యతిరేకంగా బలవంతం చేయకూడదు" అని అన్నారు.

మన ప్రధాని మోడీ అన్నట్లుగా గీతాన్ని చీల్చింది నెహ్రూ ఒక్కరే కాదు. 1937లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (జఔజ) తీసుకున్న సామూహిక నిర్ణయం అది. దానిలో నెహ్రూ వున్నాడు. సుభాష్ చంద్ర బోస్ వున్నాడు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ వున్నాడు. అన్నిటికీ మించి గుజరాత్ రాష్ట్రంలో నర్మదా నది దగ్గర, ఏక్తా నగర్ లో 787 అడుగుల ఎత్తులో 3000 కోట్ల ఖర్చుతో కట్టిన విగ్రహ మూర్తి 'వల్లభాయ్ పటేల్' కూడా ఉన్నారు. '(ఈ దేశానికి మొదటి ప్రధాని పటేల్ అయ్యుంటే ఈ దేశ చరిత్ర ఇంకోరకంగా ఉండేది' అని పటేల్ గురించి మోడీ ఒకసారి అన్నారు. ఆయన ప్రధానిగా లేక పోవచ్చు. ఉపప్రధానిగా ఉన్నారు. హోమ్ మినిస్టర్‌గా కూడా ఉన్నారు. )

అంతే కాదు; జనగణమన ను 'జాతీయ గీతం'గా చేస్తూ, 'వందే మాతరం' కు సమాన గౌరవం ఇస్తూ (మొదటి రెండు పద్యాలకే పరిమితం చేస్తూ) 1950 జనవరి 24న రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనను చేశారు. అప్పటికి పటేల్ 'ఉప ప్రధాని'గా కూడా ఉన్నారు.

(ఇలాంటి చర్చా, ఇలాంటి వివాదం 'వందే మాతరం' అప్పుడే కాకుండా 'జనగణమన' గీతం అప్పుడు కూడా జరిగింది. 1911 డిసెంబర్ 27 న కలకత్తాలో జరిగిన 'ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సమావేశంలో రవీంద్రనాథ్ టాగూర్ రాసిన "జనగణమన" మొదటి పాదాన్ని పాడారు. ఆ నెలలోనే 5వ జార్జి, అతని భార్య క్వీన్ మేరీ కూడా ఇండియాకి వొచ్చారు. 'జార్జికి స్వాగతం' గా ఈ పాటను 'ఠాగూర్' రాసారనే ఒక విమర్శ చెలరేగింది. 'జనగణమన అధినాయక జయహే! భారత భాగ్య విధాతా!' అనే పాదంలో ఉన్న 'అధినాయకుడెవరు' అనే ప్రశ్న వొచ్చింది. 'జనగణమన' లో చెప్పిన 'అధినాయకుడు' ఏ మానవ రాజు కాదు; అది భారతదేశ ప్రజల భాగ్యాన్ని నడిపించే శాశ్వత సత్యం, దైవసూత్రం' అని స్వయంగా ఠాగూరే వివరించుకోవలసిన పరిస్థితి వొచ్చింది.) వీళ్ళందరూ కాకుండా దీని మీద గాంధీ గారు ఏమన్నారు? అని, మనందరికీ తెలుసుకోవాలని వుంటుంది. ఆయన కూడా అందరిలాగే అన్నారు. 'వందే మాతరం దేశభక్తి గీతం. మత భావనతో ఎవరికైనా ఇబ్బంది అయితే బలవంతం చేయరాదు. దేశభక్తి అనేది స్వచ్ఛందం గా ఉండాలి. బలవంతం చేస్తే అది హింసతో సమానం' అన్నారు. అలా అనడమే కాకుండా దాన్ని 'రెండు శ్లోకాల' కే పరిమితం చేసింది మొదటగా ఆయనే. మోడీ భాషలో మొదటగా చీల్చింది ఆయనే!

ఆ గేయాన్ని ఎవరు చీల్చినా, చరణాల్ని ఎవరు తగ్గించినా భిన్న మతాల ప్రజలు జీవిస్తున్న ఈ దేశంలో 'లౌకిక సహజీవనా' నికి ఆది ఆటంకం కాకూడదనే భావించారు. వందేమాతరం అనేది 'గుడి' లో పాడేది కాదు; 'బడి' లో పాడేది! గుడిలో, మసీదులో, చర్చిలో ఎవరి గీతాలాపన వాళ్ళకి వుండవొచ్చు. కానీ బడిలో పాడే పాట అందరికీ ఆమోదయోగ్యంగా వుండాలి!

నన్నూరి వేణుగోపాల్
మానవ హక్కుల కార్యకర్త
98494 49012

# ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ టెర్రరిస్ట్ దాడులను ఖండించండి




**ముషీరాబాద్, మార్చి 1 (జనం సాక్షి) :** ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ టెర్రరిస్ట్ దాడులను ఆపాలని, ఇరాన్ అధ్యక్షుడు అయితుల్లా ఖమేనిను హత్య చేయడాన్ని నిరసిస్తూ సిపిఐ (ఎం--ఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి హైదరాబాద్ - రంగారెడ్డి జిల్లాల కమిటీ డిమాండ్ చేస్తుంది. ఈ మేరకు కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ రాంనగర్ చౌరస్తా లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ జెవి చలపతిరావు మాట్లాడుతూ... ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ మిస్సైల్స్, బాంబులతో దాడులు చేసి ఇరానీ ప్రజలను, చిన్నపిల్లలను హత్య చేశారన్నారు. ఇరాన్ అధ్యక్షుడు అయితుల్లా ఖమేని ను, ఆ దేశ ఆర్మీ చీఫ్ అమీర్ హతామీ లను హత్య చేయడాన్ని సిపిఐ (ఎం--ఎల్) న్యూడెమోక్రసీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అమెరికా ఇజ్రాయిల్ చేసిన ఈ దాడి ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధమైనదన్నారు. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండానే ట్రంప్ అహంకారంతో ఏకపక్షంగా ఇరాన్ దేశంపై యుద్ధానికి పూనుకున్నాడనీ, ఇరాన్ దేశంలో ఉన్న చమురు నిల్వలను కొల్లగొట్టేందుకు అనేక విధాలుగా అమెరికా ఆ దేశంపై ఒత్తిడి తీసుకొచ్చినా దానికి లొంగకుండా ఉన్న ఫలితంగానే అమెరికా ఇజ్రాయిల్ రెండు దేశాలు కుట్రలు చేసి దాడులు చేస్తున్నాయన్నారు. అయితుల్లా ఖమేని ప్రభుత్వాన్ని మార్చడానికే చేసే యుద్ధం చేస్తున్నానని ట్రంప్ బహాటంగా ప్రకటిస్తున్నాడు. కానీ ఆ దేశ అధ్యక్షుడిని మార్చడం పూర్తిగా ఆ దేశ ప్రజలదే అని ట్రంపుకు అధికారం ఎంత మాత్రం లేదన్నాడు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయిల్ అధ్యక్షుడు బెంజిమెన్ నేతన్యాహు నరహంతకుల వలె టెర్రరిస్ట్ దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. పాలస్తీనా దేశంపైనా ఇదేరకంగా దాడులు చేసి లక్షలాదిమంది ఆ దేశ ప్రజలను చంపివేశారన్నారు. ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ అంతర్జాతీయ న్యాయ సూత్రాలను ఉల్లంఘించి పాఠశాలలు, కళాశాలలు, హాస్పిటల్స్ ప్రార్థనా మందిరాల మీద సైతం బాంబుల వర్షాన్ని కురిపిస్తున్నాయన్నారు. మరోవైపు పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్ యుద్ధం, రష్యా యుక్రేయన్ యుద్ధం వల్ల ప్రపంచ దేశాల్లో అశాంతి నెలకొని ఉన్నదని సామ్రాజ్యవాద దేశాల మాయలో ఆయా దేశాలు యుద్ధాలకు దిగడం మంచిది కాదన్నారు. యుద్ధాల వల్ల పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు నిత్యవసర సరుకుల ధరలు పెరుగుతాయన్నారు. సామాజిక రాజకీయ సంస్కృతిక ఆర్థిక అంతరాలు మరింత పెరిగి ప్రజల జీవన ప్రమాణాలు, స్థితిగతులు తగ్గుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా ఇజ్రాయిల్ టెర్రరిస్టు దాడులను ఖండించాల్సిన మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఇజ్రాయిల్ కు మద్దతు తెలియజేయడం సిగ్గుచేటన్నారు. ఇజ్రాయిల్ దేశంలో పర్యటిస్తున్న నరేంద్ర మోడీ ఆ దేశాన్ని ఫాదర్ ల్యాండ్ గా అభివర్ణించడం సరికాదన్నారు. గతంలో ఏ ప్రధాని గాని భారత కేంద్ర ప్రభుత్వం గానీ ఇలా ఏకపక్షంగా అమెరికా, ఇజ్రాయిల్ దేశాలకు మద్దతు ఇచ్చింది లేదన్నారు. ఇది నరేంద్ర మోడీ అవలంబిస్తున్న సామ్రాజ్యవాద, పెట్టుబడిదారి, మతోన్మాద, ఫాసిస్టు విధానంలో భాగమన్నారు. ఇరాన్ పై అమెరికన్ సామ్రాజ్యవాదం, ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ఆపాలని ప్రపంచ శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం--ఎల్)న్యూడెమోక్రసీ ఉమ్మడి హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల కమిటీ కార్యదర్శి జి.ఝాన్సీ, ఐ ఎఫ్ టి యు జాతీయ ఉపాధ్యక్షులు బి.ప్రదీప్, పి ఓ డబ్ల్యు జాతీయ నాయకులు వి.సంధ్య, ఐఎఫ్టియు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు అరుణ, ప్రధాన కార్యదర్శి అనురాధ, ఉపాధ్యక్షుడు శివబాబు, పివైయల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడికాయల పరుశురామ్ వీడియోస్ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్, ప్రధాన కార్యదర్శి పోడపంగి నాగరాజు, పిఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు జి.అనసూయ, జిల్లా అధ్యక్షులు ప్రేమలత, ప్రధాన కార్యదర్శి భారతి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సాధికారతే దేశ అభివృద్ధికి మూలాధారం



**హయత్‌నగర్, మార్చి 1 (జనం సాక్షి) :** మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీజేపీ తాజా మాజీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహా రెడ్డి, చింతల అరుణా సురేందర్ యాదవ్ లు ముఖ్య అతిథులుగా హాజరై మహిళలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు కుటుంబానికే కాదు సమాజానికి కూడా బలమైన ఆధారస్తంభాలని వారు అన్నారు. మహిళల సాధికారతే దేశ అభివృద్ధికి మూలాధారం, ప్రతి రంగంలో మహిళలు ముందుకు సాగుతున్న తీరు గర్వకారణమని వారు తెలిపారు. మహిళల విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల పెంపు కోసం అందరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. మహిళల హక్కుల పరిరక్షణ, భద్రత, సమాన అవకాశాల కల్పన కోసం బిజెపి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని వారు తెలియజేశారు. కార్యక్రమం లో మహిళలకు సన్మానాలు నిర్వహించి, వారి సేవలను కొనియాడారు.

## యువత స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలి



**చేవెళ్ల, మార్చి 1 (జనంసాక్షి) :** యువత ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురుచూడకుండా స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించి ఆర్థికంగా ఎదగాలని గ్రేహౌండ్స్ ఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. చేవెళ్లలో యువకులు మల్లేష్ యాదవ్, రమేష్ గుప్తా నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీరామ కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్ స్టోర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...ప్రస్తుత కాలంలో యువత వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్ వంటి సహజ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు. నాణ్యమైన ఉత్పత్తులు అందిస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదిస్తే వ్యాపారంలో విజయాన్ని సాధించవచ్చని తెలిపారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగే విధంగా యువ పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాజపా చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి, చన్వెల్లి సర్పంచి గుండన్నగారి ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శివానంద తదితరులు పాల్గొన్నారు.

## పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రఘువీర్ రెడ్డి



**హయత్‌నగర్, మార్చి 1 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ప్రగతి నగర్ కాలనీలో ఆదర్శ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనం లో జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జక్కిడి రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో "కంటి వెలుగు" కార్యక్రమం విజయవంతంగా నిర్వహించి, కంటి పరీక్షల్లో పాల్గొన్న సుమారు 250 మంది సీనియర్ సిటిజన్స్, స్థానికులకు నాణ్యమైన కళ్ళ అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, వారికి మెరుగైన చూపు, సౌకర్యవంతమైన జీవన విధానాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జక్కిడి రఘువీర్ రెడ్డి తెలిపారు. సమాజ సేవలో భాగంగా నిరంతరం ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహిస్తూ ముందుకు సాగుతున్న జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ సేవలను స్థానికులు అభినందించారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపుతూ, సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఈ కార్యక్రమం వారికి ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణా రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి సత్యనారాయణ రావు, కార్యవర్గ సభ్యులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శనగర్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక



**కాప్రా, మార్చి 1 (జనం సాక్షి) :** చర్లపల్లి డివిజన్ ఆదర్శనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కాలనీలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడుగా శ్యామల స్వామి, గౌరవ అధ్యక్షుడుగా బండారి యాదగిరి, ఉపాధ్యాక్షులుగా చిందం నర్సింహ్మా, పొల్కం శ్రీరామ్, ప్రధాన కార్యదర్శిగా గుడిపెల్లి యాదగిరి, సంయుక్త కార్యదర్శిలుగా శ్యామల రాము, బండారి ఉపేందర్, కార్యనిర్వహక కార్యదర్శిగా శ్యామల లింగుస్వామి, మీడియా కార్యదర్శిగా కంచుకట్ల రాంమూర్తి, కోషాధికారిగా అక్కెల్లి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా శ్యామల యాదమ్మ, జీ.రమేష్, శ్యామల భాస్కర్, కె.అనిత, ఏ అశోక్ కుమార్, ముఖ్య సలహదారులు సిహెచ్ మల్లేష్, కె. మల్లేష్, కె, ముత్తు, బి.మచ్చగిరి, కొమ్ము ఉపేందర్లను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షకార్యదర్శిలు స్వామి యాదగిరీలు మాట్లాడుతూ అధికారులు, ప్రజ ప్రతినిదుల సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. తమపై నమ్మకంతో తమను ఎన్నుకున్న కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## సమ సమాజ స్థాపనకు నాలుగో మూలస్తంభం పాత్రికేయులే..

- విశ్వకర్మ ట్రస్ట్ చైర్మన్ కలకొండ భిక్షపతి



**కాప్రా, మార్చి 1 (జనం సాక్షి) :** సమాజంలో సమ సమాజ స్థాపనకు నాలుగు స్తంభాలలో నాలుగవ కీలకమైన పాత్ర పాత్రికేయులదేనని కాప్రా విశ్వకర్మ ట్రస్ట్ చైర్మన్ కలకొండ బిక్షపతి పేర్కొన్నారు. జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ సీనియర్ జర్నలిస్టు ప్రింట్ మీడియా నూతనంగా ఏర్పడిన కార్యవర్గాన్ని కాప్రా విశ్వకర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో పీడిత బాధితులకు న్యాయం జరిగే విధంగా నాలుగవ స్తంభంగా పేర్కొనబడే పాత్రికేయులదే కీలక పాత్ర అని అన్నారు. పాత్రికేయ వృత్తిని అత్యంత ఆదర్శంగా నిర్వహించే విధంగా కృషి చేయాలని ఆయన పాత్రికేయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ సబ్ ఇన్స్పెక్టర్ వెంకన్న ప్రసంగిస్తూ అత్యంత విలువగల పాత్రికేయ వృత్తికి వన్నె తెచ్చే విధంగా నూతన కార్యవర్గం వ్యవహరించాలని సూచించారు. విశ్వకర్మ ట్రస్ట్ సభ్యులు చీఫ్ అడ్వైజర్, కాప్రా ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులు లయన్ వడ్లోజు జ్యోతిర్మయ చారి, విశ్వకర్మ ట్రస్ట్ గౌరవ చైర్మన్ మా రోజు నరసింహ చారి, ప్రధాన కార్యదర్శి మహంకాళి నరసింహ చారి, కోశాధికారి ఆందోజు రామాచారి, సభ్యులు పురోహితరత్న డాక్టర్ లంకేశ్వర చారి, కలకొండ మధుసూదనాచారి , మునిగంటి కృష్ణమాచారి, విష్ణు సాయి ప్రసాద్, మిట్టపల్లి విజయ్ గౌడ్, గోదా అంజిబాబు, బోదాస్ రవి, వరికుప్పల ఆనంద్, వేణు, కలకొండ కృష్ణమాచారి, నాగారం మోహన్రావు, హనుమయ్య గట్టోజు రాము లు నూతన కార్యవర్గం అధ్యక్షులు లయన్ వడ్లు జ్యోతిర్మయ ఆచారి, ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శ్రీనివాస్, కోశాధికారి వట్టిపల్లి సురేష్, ఉపాధ్యక్షులు లక్కిడి బాల్రెడ్డి, పలుగుల పవన్ కుమార్,, కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డమీద బాల్రాజ్, క్లబ్బు సలహాదారులు కీసరి సహదేవా చారి చంద్రమౌళి లను ఘనంగా సన్మానించారు.

## మాదిగ అమరవీరుల త్యాగ ఫలితమే ఎస్సీ వర్గీకరణ అమలు



**పెద్దేముల్, మార్చి 1 (జనం సాక్షి) :** మాదిగ అమరవీరుల త్యాగ ఫలితమే ఎస్సీ వర్గీకరణ, అమలని ఎం.ఎస్.పి.జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్ మాదిగ అన్నారు. ఆదివారం మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దేముల్ మండల కేంద్రంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలోఎం ఎస్ పి జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్ మాదిగ ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటాలకు పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్వామిదాస్ మాదిగ మాట్లాడారు. మూడు దశాబ్దాల ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రస్థానంలో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం జరిగిన అనేక ఉద్యమ ఘట్టాలలో వీరోచితమైన పాత్రను పోషించి, జాతి లక్ష్యాన్ని సాధించడం కోసం తృణప్రాయంగా తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించి నేలరాలిన మాదిగ అమరవీరులకు సామాజిక ఉద్యమ జోహార్లు, కన్నీటి నివాళులు అని అన్నారు. త్యాగాలు లేకుండా ఏ పోరాటం గమ్యాన్ని ముద్దాడలేదని పోరాటాలు లేకుండా విజయం ఏనాడు దరి చేరలేదని అన్నారు. జాతి మీద చీకట్లు కమ్ముకున్నప్పుడు దండోరా అనే ఒక వేగుచుక్క మాదిగ వాడల్లో అగ్గి పుట్టించిందని చెప్పారు. అది తరతరాల జాతిని చీకటిని పారదోలుతూ జాతికి వెలుగులు తీసుకొచ్చిందన్నారు. ఈ వెలుగులు సాధించడం కోసం నడిచిన పోరుబాటలో అనేకమంది బిడ్డలు అసువులు బాసారని గుర్తు చేశారు. నాడు వారి అమరత్వం సాక్షిగా వర్గీకరణను సాధిస్తామని ప్రమాణం చేశామని నేడు ఆ ప్రమాణం సాక్షిగా ఎస్సీ వర్గీకరణ సాధించి అమరుల ఆశయాలను నెరవేర్చామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ ఫలితాలు మాదిగ సమాజం పొందుతున్న వేళ మాదిగ అమరులను మది నిండా తలచుకొని ఘనమైన నివాళులు అర్పించామని తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు.జోగు అనంతయ్య ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఉమా శంకర్,కే బాలరాజ్, డివై నర్సింలు పీ నర్సింలు దావీదు, ధర్మేది శ్రీనివాస్,నక్క సుందరప్ప, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు అభినందనలు



**షాబాద్, మార్చి 1 (జనం సాక్షి) :** గ్రామానికి గుర్తింపు దిశగా క్రీడా పోటీల్లో రాణించారని కొమరబండ మాజీ సర్పంచ్ ఏశాల చంద్రశేఖర్, ఆవంచ దేవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గత వారం రోజులపాటు నుండి నిర్వహిస్తున్న పట్నం రాజేందర్ రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ గ్రామానికి చెందిన క్రీడాకారులు విజేతలుగా నిలిచి మొదటి బహుమతి సాధించి గ్రామానికి మరింత వన్నెతెచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... అలుపెరుగకుండా ప్రతినిత్యం క్రికెట్ పై దృష్టి సారించి విజయాలు సాధించే దిశగా ఎదిగారు అని అన్నారు. ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని కోరుతూ ఎప్పటికీ వారిని వెన్ను తట్టి నడిపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజేతల తల్లిదండ్రులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య స్కూల్‌లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



**బోడుప్పల్, మార్చి 1 (జనంసాక్షి) :** ఉప్పల్ - 2 శాంతి నగర్ బ్రాంచ్ శ్రీ చైతన్య స్కూల్ లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ జియాలజీ విభాగాధిపతి అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సి.హెచ్.వెంకటేశ్వర్లు హాజరై విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు శాస్త్ర సాంకేతిక రంగాల్లోనూ ప్రతిభ కనబరచి ప్రతి రంగంలో రాణించాలని ఆకాంక్షించారు.విద్యార్థులు తయారు చేసిన వర్కింగ్ మోడల్స్‌ను ప్రశంసిస్తూ, సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం స్కూల్ ఏజీఎం వెంకట్ రెడ్డి,ఆర్ఐ రవితేజలు విచ్చేసి విద్యార్థులను అభినందించారు. ఫిజిక్స్,కెమిస్ట్రీ,బయాలజీ విభాగాలకు చెందిన ప్రాజెక్టులు అద్భుతంగా ప్రదర్శించబడ్డాయి.ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాధిక మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే శాస్త్ర సాంకేతిక రంగంలో నైపుణ్యం సాధించేలా వారిని తీర్చిదిద్దడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఏఓ యోగి,డీన్ రాజు,ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ శ్రీజ,ప్రైమరీ ఇంచార్జ్ విష్ణుప్రియ, ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**ఉప్పల్, మార్చి 1 (జనం సాక్షి) :** రామంతపూర్ పాలిటెక్నిక్ స్థలం లో జాన్స్ పాఠశాలలు ఆధ్వర్యంలో నిర్వహించిన ఛాంపియన్ లీగ్ కార్యక్రమంలో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి గారు మరియు మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంలో, బండారి లక్ష్మారెడ్డి విద్యాభివృద్ధి సమాజ ప్రగతికి మూలాధారం అని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే ఏ రంగంలోనైనా విజయం సాధించగలరని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలకమని ఆయన తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులు భవిష్యత్తులో మరిన్ని విద్యా, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటిస్తూ ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాన్ని అభివృద్ధిలో ముందు వరుసలో నిలపాలి

- కేంద్ర మంత్రి బండి సంజయ్



**కోహెడ, మార్చి 1 (జనంసాక్షి) :** కేంద్రమంత్రి బండి సంజయ్ సర్పంచ్ ఎన్నికల సందర్భంగా బిజెపి పార్టీకి చెందినవారిని ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకొంటే గ్రామాభివృద్ధి కోసం పది లక్షల నిధులు ఇస్తానని చెప్పిన మాట ప్రకారం ఆదివారం మండలంలోని విజయ్ నగర్ కాలని గ్రామంలో గ్రామస్తుల సమక్షంలో సర్పంచ్ కాతం (సాదుల) అమూల్య-రాజశేఖర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నిక చేసుకొన్న సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయన్న విజయ్ నగర్ కాలని గ్రామానికి విచ్చేసి గ్రామస్థుల సమక్షంలో 10 లక్షల రూపాయల ఎంపీ నిధుల కాపీని సర్పంచ్, పాలకవర్గ సభ్యులకు అందజేశారు. గ్రామాన్ని అభివృద్ధి పథం లో ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 40.కోట్లకు పైగా వివిధ అభివృద్ధి పనులు ఇప్పటివరకు నిధులు ఇచ్చానని అన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే తత్వం కలిగిన వ్యక్తే మీ పార్లమెంట్ సభ్యుడని కొంతమంది పనిగట్టుకుని బండి సంజయన్న ఏమి తెచ్చిండు అనేవాళ్లకు నా పనితీరే సమాధానం అని అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో సైతం మెజారిటీ 30 సీట్లలో బిజెపి కార్పొరేటర్లు గెలిచిన కొంతమంది కుటిల ప్రయత్నాలు బెడిసికొట్టి అమ్మవారి ఆశీర్వాదంతో ప్రజల దీవెనలతో మొదటిసారిగా మేయర్ సిటు సాధించామని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ వ్యాప్తంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే అన్ని గ్రామాల అభివృద్ధికి సహకరిస్తూనే బిజెపి సర్పంచ్ లు గెలిచిన గ్రామాలకు పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూర్చేందుకు సహకరిస్తానని తెలిపారు. విజయ్ నగర్ కాలని గ్రామానికి ఏకగ్రీవంగా బిజెపి సర్పంచ్ ఇచ్చినందుకు ఇచ్చిన 10.లక్షల నిధులతో పాటుగా మరో 15 లక్షల సిసిరోడ్లకు నిధులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోమటి రెడ్డి రాంగోపాల్ రెడ్డి, జిల్లా నాయకులు ఖమ్మం వెంకటేశం, సర్పంచ్ లు మ్యాకల స్వర్ణ లత - సురేందర్ రెడ్డి, పకిడె సంపత్, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, వార్డు సభ్యులు, నాయకులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 64 చెరువులను సుందర శోభిత వనాలుగా తీర్చిదిద్దుతాం

**శేరిలింగంపల్లి, మార్చి 1 (జనంసాక్షి) :** భవిష్యత్తు తరాలకు ఆస్తులు కాదు మంచి ఆరోగ్యం, ప్రశాంతమైన జీవితం ఇవ్వాల్సిన బాధ్యత మనందరి పైనా ఉందని, ఆ దిశగా ప్రతి ఒక్కరి అడుగు ముందుకు సాగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధి మసీదు బండ లోగల కుడికుంట చెరువును సహే స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కల్పనారమేష్ అద్వర్యంలో ఇన్ఫోసిస్ ఐటి సంస్థ సౌజన్యంతో చేపడుతున్న సుందరీకరణ మరియు అభివృద్ధి పనులు పూర్తిఅయిన శుభసందర్భంగా ఆదివారం కుడికుంట చెరువును సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్ తోకలిసి ప్రారంభోత్సవ కార్యక్రమంలో అరికపూడి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరెకపూడి గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని 64 చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, చెరువుల సుందరికరణతో స్వచ్ఛమైన వర్షపు జల సిరులను ఒడిసి పట్టుకుందామని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. చెరువుల జలకళతో మహానగరం అయినాసరే గ్రామీణ వాతావరణం నెలకొల్పడమే తన లక్ష్యంగా ముందుకు సాగుతానని, ఎందుకోసం అభ్యుదయ వాదులంతా కలిసి ముందుకు రావాలని అరికపూడి పిలుపునిచ్చారు. చెరువులను ప్రజలు కాపాడితే అవి మనల్ని కాపాడుతాయని, జీవ వైవిధ్యం అభివృద్ధి చెంది పక్షులు



వలసలు మొదలు అవుతాయని, చెరువుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా అరికపూడి వివరించారు. చెరువులను దత్తత తీసుకొని అభివృద్ధి చేసేవారు ముందుకు వస్తే, అది ఒక ఆహ్వానించదగ్గ పరిణామంగా ఆయన అభివర్ణించారు. ఈ క్రమంలో సహే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్పనను మరియు ఇన్ఫోసిస్ సంస్థ ను అరికెపూడి గాంధీ ప్రత్యేకంగా అభినందించారు. కల్పనారమేష్ నేతృత్వంలో ఇన్ఫోసిస్ ఐటి సంస్థ కృషితో కుడికుంట చెరువు కు దశదిశ మారిందని, ఎన్నో ఏండ్ల సమస్య నేటితో తీరినట్లేనని ఆయన భరోసాను వ్యక్తంచేశారు. శాశ్వత పరిష్కారందిశగా చెరువు అభివృద్ధిని చేపట్టడం జరిగిందని, మురికి కూపంలాంటి కుడికుంట చెరువు ప్రస్తుతం స్వచ్ఛమైన జలసిరితో కలకలలాడుతుందని, ఎంతో స్ఫూర్తిదాయకమైన ప్రక్రియగా అరికపూడి చెప్పుకొచ్చారు. చెరువును పునరుద్ధరణ చేసిన శుభసందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చేపట్టి చెరువును ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని, ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు వాకింగ్ చేసుకోవడానికి వీలుగా వాకింగ్ ట్రాక్ ను సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పిల్లలకోసం ఆటవిడుపు, ఇతర ఆహ్లాదకర ప్రక్రియలను చేపట్టడంద్వారా కుడి కుంట చెరువు, దాని పరిసరాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయని గాంధీ తెలియజేశారు. ప్రజలకు ఉపయోగపడే మొక్కలు నాటడం జరిగిందని, ఔషద గుణాలు గల మొక్కలు, పండ్ల జాతుల మొక్కలు నాటి ప్రజలకు ఉపయోగపడే విధంగా వాటిని అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. మానవాళి మనుగడకు మొక్కే శ్రీరామ రక్ష అని, సమస్త జీవ కోటికి ప్రాణధారం మొక్కలు కాబట్టి కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ఆక్సిజన్ అవసరం అందరికీ అర్థమైనందున మొక్కలు, చెట్ల విలువలు గుర్తెరిగి వాటి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవరావు, ప్రసాద్, మల్లేష్ యాదవ్, కొడిచెర్ల రాములు, మల్లేష్, పవన్, మహేష్ మరియు కార్యకర్తలు, కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ మల్లికార్జున స్వామి వారి కల్యాణ మహోత్సవం



**కోహెడ, మార్చి 1 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి వారి కల్యాణం ఆలయం కమిటీ చైర్మన్ శ్రీ సూరు రాములు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న స్థానిక సర్పంచ్ బందెల సుజాత – బాలకిషన్, కోహెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద ధర్మయ్య లు పాల్గొని భక్తి శ్రద్దలతో పూజలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు అందరు సుభిక్షంగా ఉండి, పాడి, పంటలు సమృద్ధిగా పండాలని వారు కోరుకున్నట్లు తెలిపారు. ఈ కళ్యాణ ఉత్సవ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ చుక్క అశోక్, ఆలయ కార్యదర్శి చుక్క శంకర్, మాజీ సర్పంచ్ గోరిట్యాల లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధానకార్యదర్శి వేల్పుల వెంకటస్వామి, ఉప సర్పంచ్ కందాల వెంకటేష్, కోహెడ వార్డ్ మెంబర్ కిష్టయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి మంద శ్రీనాథ్ మహర్షి అలాగే భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సిద్దేశ్వరాలయంలో 108 హోమగుండాలతో సర్వ సౌభాగ్య దేవిత్రయ గీత జ్ఞాన యజ్ఞం



యాచారం, మార్చి 1 (జనం సాక్షి) : నందివనపర్తి సిద్దేశ్వరాలయంలో మే, జూన్ నెలలో 108 హోమ గుండాలచే శ్రీ సర్వ సౌభాగ్య దేవిత్రయ గీత జ్ఞాన యజ్ఞం కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులచే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర బ్రాహ్మణ సంఘం చైర్మన్ మురుగుంట్ల రాజేశ్వర శర్మ పాల్గొని మాట్లాడుతూ అతి పురాతనమైన సిద్దేశ్వర ఆలయాన్ని ఆధీనంలోకి తీసుకొచ్చి పునర్నిర్మాణం చేయడం కోసం ముందుకొచ్చిన గ్రామ ప్రజలకు అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. నంది వనపర్తికి గొప్ప చారిత్రాత్మక నేపథ్యం ఉందని ఈ క్రమంలో సిద్దేశ్వరాలయ పునర్నిర్మాణానికి 108 హోమ గుండాలచే శ్రీ సర్వ సౌభాగ్య దేవిత్రయ గీత జ్ఞాన యజ్ఞం చేయాలని సూచించారు. ఆలయ అభివృద్ధి చెందుతే గ్రామం కూడా రోజురోజుకు అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశ అనంతరం 108 హోమగుండాలచే నిర్వహించే శ్రీ సర్వ సౌభాగ్య దేవిత్రయ గీత జ్ఞాన యజ్ఞము విజయవంతం చేయడం కోసం ప్రత్యేక కమిటీ వేశారు. మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు,బి ఎన్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్ రెడ్డి, ఉపసర్పంచ్ జెనిగే శ్రీశైలం, మాజీ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు కొంగళ్ళ జోగి రెడ్డి, వీహెచ్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య, మాజీ ఎంపిటిసి, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కొంగరి యాదగిరి, మాజీ ఉపసర్పంచ్ మూడెడ్ల గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హ్యూమన్ వెల్ఫర్ ఫౌండేషన్ ఐదో వార్షికోత్సవం




**నాగర్‌కర్నూల్, మార్చి 1 (జనంసాక్షి) :** ఐదవ వార్షికోత్సవ సందర్భంగా తాడూరు మండలంలో జరిగినటువంటి ఈ కార్యక్రమంలో పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్స్ సంబంధించిన మెటీరియల్స్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాడూరు గ్రామ సర్పంచ్ సంద సంద మల్లయ్య, ఉప సర్పంచ్ శ్రీదేవి, కవి కళాకారులు దేవదానం రిటైర్డ్ ఎంప్లాయ్ నర్సింగ్ రావు, మార్కెట్ డైరెక్టర్ వెంకటయ్య, మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గోవర్ధన్, పీఈటి రమేష్, వీజుబొ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు గాజుల శ్రీను, పిటి యాదయ్య, తాడూరు మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు మల్లేష్ ఫౌండేషన్ చైర్మన్ చింతపల్లి శివశంకర్, జెట్టి చంద్రయ్య, కోశాధికారి చింతపల్లి కురుమయ్య, జాయింట్ సెక్రెటరీ చింతల అశోక్, పార్లమెంట్ సోషల్ మీడియా ఇంచార్జ్ మద్దెల చంటి సభ్యులు గోరేటి సూర్యనారాయణ, ఎనుపోతుల లక్ష్మణ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# గోల్డ్ చైన్ దొంగతనం కేసులో ఇద్దరు నిందితుల రిమాండ్

**శేరిలింగంపల్లి, మార్చి 1 (జనంసాక్షి) :** ఓ వ్యక్తి మెడలో చైన్, ఐఫోన్లు దొంగిలించిన కేసులో మియాపూర్ పోలీస్ అధికారులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్ తరలించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈ మేరకు మియాపూర్ సిఐ వెల్లడించిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా కు చెందిన అందుకూరి యోగి(20) బ్రతుకుతెరువు నిమిత్తం నగరానికి వచ్చి ఐడిఏ బొల్లారంలో నివాసం ఉంటూ ఆటో డ్రైవర్ గా జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఐడియా బొల్లారం ప్రాంతానికి చెందిన సమద్, సంపంగి మణికంత, ప్రస్తుతం బా బాచుపల్లి జైలులో ఉన్న చింతల బాలరాజు, మియాపూర్ జైలులో ఉన్న ప్రబిన్ కుమార్ తో కూడా పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరి 12 న మియాపూర్



పోలీస్ స్టేషన్ పరిధి నడిగడ్డ తండా కు చెందిన అంబటి వినయ్ రాజు మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేస్తూ తాను ఇంటికి వెళ్లడానికి ఆ రోజు 12 గంటల సమయంలో అందుకూరి యోగి కి సంబంధించిన ఆటోలో ప్రయాణం చేస్తున్న సమయంలో తన మెడలోని చైను, సెల్ఫోన్ చోరీకి గురైనట్లు పేర్కొన్నాడు. ఈ క్రమంలో వారిపై నిఘా పెట్టి పోలీసు అధికారులు కేసును దర్యాప్తు చేసే క్రమంలో శనివారం యోగి, సంపంగి మణికంతను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం కేసును అంగీకరించడం జరిగిందని, దీంతో వారిని న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టి రిమాండ్ కు తరలించడం జరిగిందని కాగా వీరి ముఠా సభ్యుడైన సమద్ పరారీలో ఉన్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. కేసులు మరింత లోతుగా దర్యాప్తు చేసి నిజాలను నిగ్గు తేలుస్తామని అధికారులు మీడియాకు వివరించారు.

## ఇందిరమ్మ రాజ్యంలోనే పేదింటి కల నెరవేరింది



శంకర్‌పల్లి, మార్చి 1 (జనంసాక్షి) : శంకర్‌పల్లి మండల పరిధిలో మహాలింగాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ఆదివారం ఘనంగా చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన ఉంటుందని పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని మేనిఫెస్టో లో ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లను మంజూరు చేస్తూ పేదల పక్షాన దేవునిలా నిలబడి పేదల కోసం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాఘవేందర్ రెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, కాడిగారి రాజశేఖర్ రెడ్డి,సుశీల శంకర్, ఉప సర్పంచ్ అంతారం శ్రీనివాస్ మరియు కొనింటి శశికాంత్, ఎం రామ్ రెడ్డి బి విట్టల్ రహీంపాషా ఇసుఫ్ సేవాలాల్ అధ్యక్షులు నసీరొద్దీన్, వెంకట్ రెడ్డి,పలుగుట్ట నర్సింలు, లక్ష్మారెడ్డి మాజీ ఎంపిటిసి ఏజాజ్ , కౌన్సిలర్ సమీ, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, శివ, యాదవ్, భరత్, వెంకటయ్య, కావలి గోపాల్, సాయి,రఘుపతి రెడ్డి, శంకర్,లక్ష్మారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హఫీజ్‌పేట డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి

**శేరిలింగంపల్లి, మార్చి 1 (జనంసాక్షి) :** హఫీజ్పేట్ డివిజన్ పరిధిలో నెలకొన్న ప్రజల ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డివిజన్ భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం డివిజన్ పరిధి హుడా కాలనీ, గంగారంలో స్థానిక సమస్యలు, భూగర్భ డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం తదితర పెండింగ్ సమస్యల పరిష్కారంకోసం స్థానిక భాజపా నాయకులతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఇందులో భాగంగా గంగారాం బస్తీ దవాఖానలోని మౌలిక సదుపాయాలను పరిశీలించి అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ డివిజన్ పరిధిలో మౌలిక సదుపాయాల కొరత ఉన్న మాట నిజమని, గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం డివిజన్ లో పూర్తిగా విస్మరించి రాబడి మీదనే ప్రత్యేక దృష్టిని సారించాయని



విమర్శించారు. బిజెపి హయాంలోనే తెలంగాణ రాష్ట్రం నిజమైన అభివృద్ధిని సాధిస్తుందని, పార్టీ అధికారం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావలసిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హఫీజ్ పేట్ డివిజన్ బిజెపి అధ్యక్షులు కైతాపురం జితేందర్, బిజెపి జిల్లా మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ అజిత్ సేనాపతి, బిజెపి సీనియర్ నాయకులు దేవాల్ యాదవ్, మోహన్ ముదిరాజ్, డివిజన్ కార్యదర్శి రాజు యాదవ్, హఫీజ్ పేట్ డివిజన్ బిజెవైఎం ప్రధాన కార్యదర్శి బాలరాజు, నాయకులు పవన్ కుమార్, రామకృష్ణ, మునిస్వామి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞాన సరస్వతి దేవాలయం ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య అవగాహన సదస్సు



**యాచారం, మార్చి 1 (జనం సాక్షి) :** సమాజ సేవే లక్ష్యంగా ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నినాదంతో జ్ఞాన సరస్వతి దేవాలయం ద్వారా వైద్య సేవల అవసరార్థమై ఆరోగ్య సదస్సును నిర్వహించినట్లు ఆలయ వైద్య విభాగ సమన్వయకర్తలు చెప్పారు. నందివనపర్తిలో జ్ఞానసరస్వతి దేవాలయం ఆధ్వర్యంలో ఉచిత సేవలు అందించాలనే సంకల్పంతో నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సును ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డా. రామచంద్ర పాల్గొని ప్రారంభించారు. నిత్యం ఎదురయ్యే అనేక వ్యాధులకు ప్రకృతిలో లభించే నిత్యావసర వస్తువులతో తగ్గించుకునే చిట్కాలను వివరించారు. కాళ్లలో ఆనలు, తిమ్మిర్లు, మధుమేహ నియంత్రణ, ఇతర సాధారణ వ్యాధులకు సహజ చికిత్సా సూచనలు చేశారు. పాల్గొన్న వారి వ్యాధుల వివరాలు సేకరించి, ప్రతి నెల ఒకటి లేదా రెండు పర్యాయాలు ఆలయం ద్వారా ఉచిత సేవలు అందిస్తామని ఆలయ వైద్య విభాగ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన ఓ మహిళ మాట్లాడుతూ.. "నేను 6 నెలలుగా యూట్యూబ్ ద్వారా డా. రామచంద్ర చిట్కాలను అనుసరిస్తున్నాను. ముందు నేను నిలబడలేని స్థితిలో ఉన్నాను. ఇప్పుడు స్వయంగా నడవగలుగుతున్నాను" అని తన అనుభవాన్ని పంచుకోవడం కార్యక్రమానికి విశేష ప్రేరణ నిచ్చిందని సభ్యులు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రాయికంటి విజయ్ కుమార్, వైద్య విభాగ సమన్వయకర్తలు ఐలపురం జలంధర్ రెడ్డి, కొండూరు అంజయ్య ఇతరులతో పాటు గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మూసీ ప్రాజెక్టు పేరిట పేదల ఇళ్ల కూల్చివేతలు ఆపాలి

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**రాజేంద్రనగర్, మార్చి 1 (జనంసాక్షి) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్ రాజ్యం నడుపుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో లక్షలాది పేదలకు ఇళ్లు నిర్మించగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చివేస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల కూల్చివేతలు పెరిగాయని అన్నారు. మూసీ నది అభివృద్ధి పేరుతో లక్షా యాభై వేల పేదల ఇళ్లను కూల్చివేయడానికి ప్రభుత్వం సిద్ధమైందని కేటీఆర్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాజేంద్రనగర్ ప్రాంతంలోని హైదర్ షా కోట్, మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ బాధితులతో కలిసి 'మూసీ దండు మార్చ్' పేరుతో నిర్వహించిన సుమారు 3 కిలోమీటర్ల పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలుపుతూ, మరో రెండేళ్లు




తమ ఇళ్లు, భూములను కాపాడుకోవాలని, తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎవరి ఇళ్లూ ముట్టకుండా చూస్తామని హామీ ఇచ్చారు. మూసీ ప్రాజెక్టు పేరుతో ప్రభుత్వం భారీ స్కామ్‌కు తెరలేపిందని, రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసమే ఈ చర్యలు చేపడుతోందని కేటీఆర్ ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మూసీ సుందరీకరణకు సంబంధించిన డీపీఆర్‌ను ఇళ్లకు నష్టం లేకుండా సిద్ధం చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అనుమతులు ఇచ్చిన అపార్ట్‌మెంట్లపైనే ఇప్పుడు చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. మూసీ బాధితుల న్యాయపోరాటానికి బీఆర్ఎస్ పూర్తిస్థాయి అండగా ఉంటుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, నియోజకవర్గం టిఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం బెదిరింపులకు దిగకుండా ఇళ్ల కూల్చివేతలు తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు రావులకోళ్ళ నాగరాజ్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్ నేతలు , రవీందర్ రెడ్డి , మద్దెల లతా ప్రేమ్ గౌడ్, రాముడు యాదవ్, చంద్రశేఖర్, శ్యామల్ ఇంతియాజ్, చందర్ రావు, విష్ణుమూర్తి రమణ, శాంతి, మల్లేశ్వరి, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి సర్పంచులకు శిక్షణ తరగతులు

తలకొండపల్లి, మార్చి 1 (జనంసాక్షి) : మండలంలోని 32 గ్రామపంచాయతీలకు ఇటీవల నూతనంగా ఎన్నికైన సర్పంచులకు శిక్షణ తరగతులను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శంషాబాద్ మండలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ ముచ్చింతల్ లో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు




పేర్కొన్నారు. శిక్షణ తరగతుల ద్వారా సర్పంచులకు పాలనాపరమైన ఆర్థిక వ్యవహారాలు గ్రామ అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఆన్లైన్ పోర్టల్ 100 హాజరు శాతాన్ని నమోదు చేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మొదటి విడత,2 నుంచి 7 వరకు,రెండో విడత 9 నుంచి 13 వరకు,మూడో విడత 16 నుంచి 23 వరకు శంషాబాద్ మండలంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ ముచ్చింతల్ లో ప్రాథమిక శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. సర్పంచులు బయోడేటా వివరాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు.



# సరిపడా భోజనం పెట్టడం లేదు

**వార్డెన్‌కు వ్యతిరేకంగా హాస్టల్ గేటు ఎదుట విద్యార్థుల నిరసన**

**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 01 (జనంసాక్షి) :** సరిపడా భోజనం పెట్టకుండా ఇబ్బందుల గురిచేస్తున్న వార్డెన్ తీరును నిరసిస్తూ విద్యార్థులు హాస్టల్ గేటు ముందు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టిన ఘటన మంచిర్యాల జిల్లాలో చోటుచేసుకుంది. . ప్రభుత్వంపై నమ్మకంతో తల్లిదండ్రులు తమ పిల్లలను హాస్టల్లో ఉంచితే ఉన్నత అధికారుల పర్యవేక్షణ లోపం మూలంగా వార్డెన్ సరిపడా భోజనం పెట్టకుండా అప్పుడప్పుడు విద్యార్థులను పస్తులు ఉంచుతున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సాయికుంట బీసీ సమీకృత బాలుర వసతి గృహంలో విద్యార్థులకు సంబంధిత వార్డెన్ సరిపడా భోజనం పెట్టడం లేదని ఆదివారం ఉదయం హాస్టల్ గేటు ముందు విద్యార్థులు ధర్నాకు దిగారు.ప్రతిరోజు సాలీసాలని భోజనం పెడుతున్నారని పెట్టిన భోజనం రుచికరంగా ఉండడం లేదని మెన్ పాటించడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు .హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం లేదని తమతోనే పనులు చేయిస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంతో అనారోగ్యాల పాలవుతున్నామని విద్యార్థులు ఆరోపించారు . వార్డెన్ తమతోనే వంట కూడా చేయిస్తున్నారు తెలిపారు వార్డెన్ విద్యార్థులపై చూపించే నిర్లక్ష్య ధోరణి మూలంగా అప్పుడప్పుడు కొంతమంది విద్యార్థులు పస్తులు ఉంటున్నారని పేర్కొన్నారు. వార్డెన్‌పై చర్య తీసుకోవాలని అంతవరకు గేటు ముందు నుండి నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తానని పేర్కొన్నారు.

# ఆత్మ కమిటీ చైర్మన్‌గా కర్ల అరుణ ప్రమాణస్వీకారం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క**



**ఏటూరునాగారం, మార్చి 01(జనంసాక్షి) :** మండల కేంద్రానికి చెందిన కర్ల అరుణ ని ఆత్మ కమిటీ చైర్మన్ గా 22 మంది సభ్యులతో నూతన కమిటీ ఏర్పాటు చేయగా ఈ రోజు వారి ప్రమాణస్వీకారం కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొని కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వ్యవసాయ శాఖకి సంబంధించిన ఆత్మ కమిటీ నూతన పాలక వర్గానికి మంత్రి సీతక్క శు భాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు రైతుల సమస్యల పట్ల సమిష్టిగా నిర్ణయాలు తీసుకుని రైతులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి జిల్లా నాయకులు సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, చైర్మన్ లు, డైరెక్టర్ లు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



**హనుమకొండ ప్రతినిధి, మార్చి 1 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శనిగరం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. గ్రామానికి చెందిన నవీన్ కుమార్, నాగరాజు అనే యువకులు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా లక్ష్మీపూర్ గ్రామం సమీపంలో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ ఘటనతో శనిగరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబాలకు గ్రామస్తులు సంతాపం తెలిపారు.





# కార్మికుల సంక్షేమ పథకాలను మెరుగుపరచాలి

- భవన నిర్మాణాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య

**ఖానాపూర్ మార్చి 01 (జనం సాక్షి) :** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రభుత్వాలు మెరుగుపరచాలని భవన నిర్మాణాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని తాపీ మేస్త్రీల సంఘ భవనంలో సంఘం అధ్యక్షుడు కడకుంట్ల నరసింహులు అధ్యక్షతన భవన నిర్మాణ కార్మిక సంఘం మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల భవిష్యత్తు కోసం గతంలో ఏర్పాటుచేసిన సంక్షేమ చట్టం, సెస్ చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లలో చేర్చి అనేక కొర్రీలు విధిస్తూ క్రమంగా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ఎత్తి వేసే కుట్రకు పాల్పడుతుందన్నారు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమ బోర్డును ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పి భవన నిర్మాణ కార్మికులను విస్మరిస్తుశీదని ఆరోపించారు. ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లు సునారికారి రాజేష్, ఎం. హరిత, సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె. రాజు లతో పాటు సంఘం మండల కార్యదర్శి చిలుకూరి ఇస్తారి, సురపాక రాజన్న, బోదాసు చిన్న నరసయ్య, పోశెట్టి, జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం లింగన్న, డివిజన్ నాయకులు ఆడేపు గణేష్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఉపాలి, తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా ఏదీ?



- ఎదురుచూస్తున్న రైతన్నలు

**కౌటాల మార్చి 01 (జనంసాక్షి) :** రైతులు సంవత్సర కాలం కష్టపడి పండిస్తున్న పంటలకు దిగుబడి తగ్గి, పంట కోసం చేసిన అప్పులు తీరక తలలు పట్టుకుంటున్నారు. కౌటాల మండలంలో అర్హులైన రైతులకు జూన్ నెలలో కొంత మంది పెట్టుబడి సహాయం కింద రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా అందించింది. ప్రస్తుత యాసంగి సీజన్ పంటల సాగు మధ్య దశకు చేరుకున్నా పెట్టుబడి సాయంపై ప్రభుత్వం నుంచి ప్రకటన వెలువడకపోవడంపై రైతులు నిరాశ చెందుతున్నారు. తాజాగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో భరోసాపై నిర్ణయం తీసుకుంటారని రైతులు భావించారు. అయితే పెట్టుబడిసాయం విడుదలపై ఎలాంటి సమాచారం రాకపోవడంతో ఈసారి రైతు భరోసా లేనట్లేనా అనే సందేహం రైతుల్లో వ్యక్తమవుతోంది.

గడిచిన వానాకాలం సీజన్లో రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.326.03 కోట్లు జమ చేశారు. యాసంగి సీజన్ కోసం షెడ్యూల్ ప్రకారం గతేడాది డిసెంబర్ లోనే రైతుల ఖాతాల్లో ఎకరానికి రూ.6 వేల చొప్పున సాయం సొమ్ము జమ చేయాల్సి ఉంది. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిధుల విడుదల ఆలస్యమైందని రైతులు భావించారు. ఎన్నికల తంతు ముగియ డంతో పెట్టుబడి సాయం వస్తుందని నిరీక్షించినా నిరాశే మిగిలిందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి రైతు భరో నిధులు విడుదల చేస్తే లభిస్తుందని అంటున్నారు.

### రైతు భరోసాతో ఆదుకోవాలి



వేసిన పంటలకు వాత వరణంలో మార్పుల ఖర్చులు పెరిగిపోయాయి. అప్పులు చేసి వాటికి వడ్డీ కూడా కట్టలేక చాలా ఇబ్బంది పడుతున్నాం. పంట దిగుపడి అంతగా లేదు.ఇలాంటి సమయంలో రైతు భరోసా కల్పిస్తే కొన్ని అప్పులయిన తీరుతాయి. ప్రభుత్వం తొందరగా రైతు భరోసా సహాయం ఇవ్వాలి.

**- ఎల్క రవీందర్, రైతు, కౌటాల**

### పంటలు పండించడం కష్టం



పొలాల్లో ఎలాంటి పంటలు పండించిన కొత్త కొత్త రోగాలతో మందులు వేయాల్సి వస్తుంది. ఎరువులు కూడా వ్యవసాయ శాఖ నుండి దొరకడం లేదు. ఒకప్పుడు ఎకరానికి పరిమితం లేకుండా యూరియా ఇచ్చేవారు ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. బోర్ మోటార్ల ద్వారా పంటకు సరైన నీళ్లు అందడం లేదు. రాను రాను పంటలు పండించడం కష్టం అవుతుంది.

**- అల్లూరి సుధాకర్, తలోడి**

# ప్లాస్టిక్‌ను ఏరేద్దాం.. ప్రకృతిని కాపాడుదాం

- ఓసిటీలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు ముందడుగు
- ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించిన కాలనీవాసులు



**వరంగల్ బ్యూరో, మార్చి 01 (జనం సాక్షి) :** ప్లాస్టిక్ ను ఏరి వేద్దాం.. ప్రకృతి సమతుల్యతను కాపాడుదాం.. ఆరోగ్యవంతమైన సమాజమే అభివృద్ధి దాయకం అంటూ వరంగల్ నగరంలోని ఓసిటీ కాలనీవాసులు నినదించారు. వరంగల్ నగరంలోని కాలనీవాసులందరికీ ఆదర్శంగా నిలిచారు. ఓసిటి రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6:30 గంటలకు కాలనీవాసులు ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కోసం నడుం బిగించారు.దీనిలో భాగంగా ఓ సిటీ కమిటీ సభ్యులు మరియు కాలనీవాసుల ఆధ్వర్యంలో కాలనీలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను వీధి వీధికి తిరుగుతూ సుమారు 20 గోన సంచులలో వ్యర్థాలను సేకరించి మునిసిపాలిటీ వ్యాన్ లో వేయడం జరిగింది.ఈ సందర్భంగా అవగాహన ర్యాలీని కూడా నిర్వహించడం జరిగింది. శుభ్రమైన కాలనీగా మార్చుకుందాం - ఆరోగ్యంగా జీవించుదాం.. మన కాలనీని మనమే శుభ్రంగా ఉంచుకుందాం. మన ఆరోగ్యాలను మనమే కాపాడుకుందాం.. వంటి నినాదాలతో మరియు పాటలతో ప్రజలలో చైతన్యం కల్పించారు. కాలనీని క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచేందుకు ప్రతి ఒక్కరము బాధ్యత తీసుకుంటామని ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయ వస్తువులను వాడుతామని మరియు ఈ విధమైన కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులైన అధ్యక్షులు జోగు చంద్రశేఖర్ ,జనరల్ సెక్రెటరీ బొబ్బల శ్రీనివాసరెడ్డి,కోశాధికారి బజ్జురి వేణుగోపాల్ ,కాలనీవాసులు, ప్రముఖులు ,మహిళలు మరియు పిల్లలు అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

# మంత్రి కొండా సురేఖ శంకుస్థాపనలు



**వరంగల్ ప్రతినిధి, మార్చి 1 (జనం సాక్షి):** వరంగల్ నగర పరిధిలోని పలు డివిజన్లో అభివృద్ధి పనులకు ఆదివారం రాష్ట్ర దేవాదాయ శాఖ అటవీ పర్యావరణ మంత్రి కొండ సురేఖ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి అభివృద్ధి పనులను ప్రారంభించారు. 11 వ డివిజన్ లో మునిసిపల్ సాధారణ నిధులు కోటి రూపాయల వ్యయం తో మత్వాడ ఈద్గా పునరుద్దరణ పనులకు నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి లతో కలసి శంకుస్థాపన చేశారు వరంగల్ నగరంలోని ఎం జి ఎం జంక్షన్ వద్ద 35 లక్షల రూపాయల వ్యయం తో నిర్మించిన శిశు సంరక్షణ ప్రతిమను ప్రారంభించారు. 40 వ డివిజన్ లో స్టాంప్ డ్యూటీ నిధులు కోటి 40 లక్షల రూపాయల వ్యయం తో నిర్మించనున్న సిసి రోడ్డు, ఉర్స్ స్మశాన వాటిక, అసంపూర్తిగా ఉన్న గౌడ సంఘం, మైనార్టీ కమ్యూనిటీ హాల్ పనులకు, ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్నగర మేయర్ గుండు సుధారాణి,వరంగల్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలసి శంకుస్థాపన చేసిన రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ స్థానిక కార్పొరేటర్ మారుపల్ల రవి, పాల్గొన్నారు.వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని జిడబ్ల్యుఎంసి పరిధిలోని 12, 33వ డివిజన్లలో నూతన నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశానికి ఆదివారం నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద లతో కలసి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. దేశాయిపేట్ తుమ్మలకుంట లబ్ధిదారులైన ఆడెపు కల్పన ప్రవీణ్ కుమార్,దంపతులకు, పెరకవాడలోని నరహరిశెట్టి రమాదేవి కుటుంబ సభ్యులకు మంత్రి నూతన వస్త్రాలను అందజేసి అభినందించారు. పలు కార్యక్రమంలో వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చహత్ బాజ్ పాయి, స్థానిక కార్పొరేటర్ విజయలక్ష్మి సురేందర్, ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# చేపల వేటకు వెళ్లి వృద్ధుడు మృతి



**గూడూరు,మార్చి01(జనంసాక్షి):** చేపల వేటకు వెళ్లి వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం గూడూరు మండలంలో చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళ్లగా ఎస్ఐ గిరిధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం, రాములు తాండా గ్రామానికి చెందిన బానోతు తాండా నివాసి బానోతు నర్సింహ (67) తన గ్రామ శివారులో ఉన్న కుంకరాయి కుంట చెరువు వద్ద చేపలు పట్టేందుకు వలతో వెళ్లారు.చేపలు పట్టుతున్న క్రమంలో వల అతని కాళ్లకు చిక్కుకుని ప్రమాదవశాత్తు చెరువులో పడి మునిగి మృతి చెందినట్లు సమాచారం.ఈ ఘటనపై మృతుడి కొడుకు బానోతు స్వామి,తండ్రి నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గిరిధర్ రెడ్డి తెలిపారు.

## 25 వేల ఆర్థిక సాయం అందించిన స్నేహితులు



**పెద్దవంగర మర్చి 01(జనం సాక్షి) :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండలంలో గంట్ల కుంట్ల గ్రామానికి చెందిన, గుర్రం సంతోష్, వారి చిన్ననాటి స్నేహితులు 10 వ తరగతి మిత్రులు నవోదయ స్కూల్ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులకు 25వేల ఆర్థిక సాయం అందించారు వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని .బాల్య స్నేహితులు తదితరులు ఉన్నారు.

# సోషల్ వెల్ఫేర్ గురుకులంలో తాగునీటి కటకట



- తాగు నీటి కోసం తండ్లాడిన హాస్టల్ విద్యార్థులు
- పట్టించుకోని అధ్యాపకులు ప్రిన్సిపాల్
- జిల్లా అధికారులు హాస్టల్ ను సందర్శించకపోవడమే కారణమా?

**ఆత్మకూర్, మార్చి 1 (జనం సాక్షి):** హనుమకొండ జిల్లాలోని ఓగులాపూర్ సమీపంలో దర్గా దగ్గర ఉన్న సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల కళాశాల యందు త్రాగునీరు రాక విద్యార్థులు తాగునీటి కోసం తల్లాడిన విద్యార్థులు ఆదివారం రోజు కావటంతో విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్ కు వచ్చి పరిస్థితి చూసినప్పటికీ గురుకుల పాఠశాలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు తాగునీరు లేక పోవడంతో తల్లిదండ్రులు బయటికి వెళ్లి బాటిల్ ద్వారా నీటిని తీసుకువచ్చి విద్యార్థుల దాహం తీర్చారు. ఇంత తాగునీటి ఇబ్బంది ఉన్నా కూడా ప్రిన్సిపాల్ గాని ఉపాధ్యాయులు గాని త్రాగునీరు ఏర్పాటు చేయకపోవడంతో తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై మండిపడుతున్నారు. రోజు ఇలాగ నైతే హాస్టల్లో మా పిల్లల పరిస్థితి ఏంటి అని వారు వాపోతున్నారు. మేము వచ్చినప్పుడు మంచినీరు లేకుంటే రోజు ఎలా ఉంటాయో లేదో అని మాకు సందేహం కలుగుతుందని తల్లిదండ్రులు అంటున్నారు. ఎస్బిఐటి క్యాంపస్ లో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకులం ,ఎం జె పి గురుకులం మైనార్టీ గురుకులం ,ఈ మూడు ఉన్నప్పటికీ కేవలం ఒక సోషల్ వెల్ఫేర్ గురుకులంలోనే ఎప్పటికీ నీటి సమస్య వస్తుందని విద్యార్థులు అంటున్నారు. తీవ్రమైన నీటి సమస్యతో విద్యార్థులు దాహం అవడంతో అదే క్యాంపస్ లో ఉన్న ఎం జె పి గురుకుల పాఠశాలకు వెళితే అక్కడ ఉన్న అటెండర్స్ స్వీపర్సు విద్యార్థులను మా హాస్టల్ కు రావద్దు మా హాస్టల్లో ఉన్న నీరు మీరు తీసుకెళ్లద్దని విద్యార్థుల బెదిరిస్తున్నారు. వారి దగ్గర ఉన్న వాటర్ బాటిల్ సైతం గుంజుకుంటూ వెళ్లగొడుతున్నారు. ఇదేమి పరిస్థితి అని అక్కడే ఉన్న తల్లిదండ్రులు వారిని నిలదీస్తే ఆ విద్యార్థులు మా హాస్టల్ కు రావద్దు వచ్చి నీరు తీసుకెళ్లొద్దు అని వారు హెచ్చరిస్తున్నారు. ఇది ఈ విషయంపై సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయుని అడగగా అది మాకు తెలియదు వాచ్మెన్ అడగండి లేదంటే ప్రిన్సిపాల్ కు తెలియజేయండి ఆ డ్యూటీ మాది కాదని వారు తెలిపారు. ఒక్కరోజు విద్యార్థులు మినరల్ వాటర్ తాగకుంటే ఏమవుతుందని బోరు నీళ్లు తాగితే ఏమైతది అని ఆయన బదులిచ్చాడు. అక్కడే ఉన్నా హాస్టల్ వాచ్మెన్ అజయ్ ని అడగ్గ నేనొక్కడిని ఏం చేయను నాకు ఎవరు సహకరిస్తే లేరు కొందరు విద్యార్థులు పైపులు పగలగొట్టడంతో ఈ సమస్య ఏర్పడిందని దీనికి నేనేం చేయాలి అని ఆయన బదులిచ్చారు. ఏది ఏమైనా విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించకపోతే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని జిల్లా అధికారులు ఒకసారైనా సోషల్ వెల్ఫేర్ హాస్టల్ ను సందర్శించాలని విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కోరుతున్నారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు భూమి పూజ

**మర్రిగూడ, మార్చి 1 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా మునుగోడులోని దుబ్బ కాలువ రోడ్డులో 200 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, టీజీ ఈ డబ్ల్యు ఐ డి సి ఎండి గణపతి రెడ్డి తో కలిసి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిశిలాఫలకాన్ని ఆవిష్కరించారు.... ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో 2500 మంది విద్యార్థుల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మాణం చేసుకోవడం శుభపరిణామం అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ఆధ్వర్యంలో 79 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ప్రారంభమవుతున్నాయి అని వీటిలో సుమారు రెండు లక్షల మంది విద్యార్థులు చదువుకోబోతున్నారు.మేము చిన్ననాటి చదువుకునేటప్పుడు కులాల గురించి తెలియదు...అన్ని కులాల అన్ని మతాలవారు ఒకే ప్రాంగణంలో చదువుకునేవాళ్లం అని ఇప్పుడు ఇవి కూడా అలాంటి పాఠశాలే ఈ పాఠశాలలో అన్ని కులాల వారు అన్ని మతాలవారు కలిసిమెలిసి చదువుకోవచ్చు అని అన్నారు. గత ప్రభుత్వం విద్యను గాలికి వదిలేసింది.కొందరికి బర్లిచ్చారు కొందరికి గొర్లిచ్చారు కొందరికి చేప పిల్లలు ఇచ్చారు.. కానీ నాణ్యమైన విద్యను అందించలేదు విద్య వైద్యాన్ని గత ప్రభుత్వం గాలికి వదిలేసింది అని కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని అన్నారు.దేశంలో ఏ రాష్ట్రంలో చేయలేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్ పథకాన్ని తీసుకొచ్చింది ఈ స్కూళ్లు పూర్తయిన తర్వాత దేశంలోని ప్రతి రాష్ట్రం తెలంగాణ వైపే చూసేలా చేస్తామని అన్నారు.

## డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మాడుగులపల్లి, మార్చి 01 (జనం సాక్షి) :** మండలంలోని చర్లగూడెం గ్రామంలో అంబేద్కర్ యూత్ కమిటీ సభ్యులు గడ్డం మారయ్య, సిఆర్పిఎఫ్ కానిస్టేబుల్ మీసాల రమేష్, దాతల సహకారంతో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి చేతుల మీదుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, యువకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం కలగడం తనకు గొప్ప గౌరవమని అన్నారు. అంబేద్కర్ ఆలోచనలు సమాజానికి దిశానిర్దేశం చేస్తాయని, సమానత్వం, న్యాయం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. యువత ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజాభివృద్ధికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్లపల్లి రవి, సామాజికవేత్త అంబేద్కర్ వాది డాక్టర్ జాడీ రాజు, షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు మాడుగుల శ్రీనివాస్, మాల మహానాడు నల్గొండ జిల్లా అధ్యక్షులు బొప్పని నగేష్, సర్పంచ్ కొండేటి జలంధర్, ఆదిమళ్ళ జానకిరాములు, కొండ్ర మహేష్, సాలయ్య, కట్ట సాలయ్య, బొప్పని మధు, అశోక్, రవి, మీసాల రాంబాబు, వార్డ్ మెంబర్ బొంత రాము, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కలిసొచ్చిన లక్కీ నెంబర్లు

- వాహనాల నెంబర్‌ప్లేట్‌తో కలిసొచ్చిన అవకాశం




**తాండూరు, మార్చి 1 (జనంసాక్షి) :** శాస్త్రీయ ప్రకారం వాహనాలకు లక్కీ నెంబర్ ఉంటే కలిసి వస్తుందని నమ్మకంతో నాయకులు, వ్యాపారవేత్తలు తమతమ వాహనాలకు ఎంతో కష్టపడి అనుకున్న లక్కీ నంబర్‌లు సొంతం చేసుకుంటున్నారు. ఇందులో బాగంగానే తాండూర్ పట్టణం బివిజి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సంపత్ కుమార్ తన వాహనాలు సుమారు 6 ఉన్నాయి. ప్రతివాహనానికి( 3737) లక్కీ నెంబర్ ఏర్పాటు చేసి కోనసాగిస్తున్నారు. అదేవిధంగా పట్టణంలో మరోవైపు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్‌కు నాలుగు వాహనాలు ఉన్నాయి. అయనకు నాలుగు సంఖ్యతో కలిసి వచ్చింది. దీంతో తన వాహనాల నంబర్లు (9444)గా ఏర్పాటు చేసుకున్నారు.అదేవిధంగా మరికొందరు కూడా లక్కీ నెంబర్లతో తమ తమ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. డాక్టర్ సంపత్ కుమార్ కు వివరణ కోరగా.. తన కుటుంబంలో ఆరు వాహనాలు ఉన్నాయని ప్రతి వాహనానికి 3737 నంబర్ ఉందని తెలిపారు.మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వార్త్యవిటల్ నాయక్ ను వివరణ కోరగా తన దగ్గర నాలుగు వాహనాలు ఉన్నాయని ప్రతి వాహనానికి 9444 నెంబర్ ఉందని తెలిపారు. తాను కోనుగోలు చేస్తే కారు అయినా బంగ్లా అయినా ఎదైనా సరే నాలుగు కోనుగోలు చేస్తామని చెప్పారు. తనకు ఈ నెంబరు ద్వారా కలిసి వచ్చిందని వెల్లడించారు .అదేవిధంగా తన మొబైల్ నెంబర్ కూడా చివరగా 9444 ఉందన్నారు. తనకు నాలుగు నంబర్ కలిసి వచ్చిందని అందుకోసమే ఇలా ప్రతి వాహనానికి లక్కీ నెంబర్ తో కొనసాగుతున్నట్లు తెలిపారు. పట్టణంలో ప్రముఖులు కూడా తమ తమ వాహనాలకు లక్కీ నంబర్లతో సెంటిమెంట్ గా ఫీల్ అవుతూ ఉన్నారు. వాహనాల లక్కీ నంబర్ (న్యూమరాలజీ ప్రకారం) యజమానికి అదృష్టం, భద్రత, మరియు మానసిక ప్రశాంతతను కలిగిస్తుందని నమ్ముతారు. ఇది ప్రమాదాలను తగ్గించి, ప్రయాణాలను సురక్షితంగా మార్చడంలో, ఆర్థిక వృద్ధిని పెంపొందించడంలో మరియు వాహనం యొక్క మొత్తం పనితీరును (తక్కువ బ్రేక్‌డౌన్‌లు) మెరుగుపరచడంలో సహాయపడుతుందని వెల్లడించారు.

## బీసీ మహాధర్నాను విజయవంతం చేయాలి

**సూర్యాపేట, మార్చి 1 (జనంసాక్షి) :** నేడు హైదరాబాదులో జరిగే బిసి మహాధర్నాను విజయవంతం చేయాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం నల్గొండ జిల్లా ఇంచార్జ్ దేగల జనార్ధన్ అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో కలిసి పాల్గొని మాట్లాడారు.బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పార్టీలు మాటలు మాత్రమే మాట్లాడుతున్నాయని అన్నారు.వారి అభ్యున్నతి కోసం ప్రత్యేకమైన బడ్జెట్ ఇవ్వాలని, అందుకోసం బీసీ సబ్ ప్లాన్ అమలుపరచాలని డిమాండ్ చేశారు.బీసీలను నిందించే సందర్భంలో వారిని చట్టబద్ధంగా కాపాడేందుకు బీసీ అట్రాసిటీస్ చట్టం రాబోయే శాసనసభ సమావేశాల్లో రూపొందించాలని అన్నారు. ఈ రెండు డిమాండ్లతో పాటుగా అనేక ఇతర అంశాలను చర్చించేందుకు బడుగు బలహీన వర్గాల ఐక్యతను మరింత పెంపొందించేందుకు పోరాట రూపాలు దోహదం చేస్తాయని అన్నారు.మార్చి 2న హైదరాబాదులో జరిగే మహాధర్నాకు విస్తృతంగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. బీసీల ఐక్యత వల్ల ఇప్పటికే ఎన్నో విజయాలు సాధించామని రాజ్యాధికారమే పరమావధిగా తమ కార్యక్రమాలు ఉంటాయని తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు



తీన్మార్ మల్లన్న అన్నారు.ఈ కార్యక్రమంలో టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్చార్జి వట్టె జానయ్య యాదవ్,రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ నీరజ గౌడ్,పార్టీ జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్,జిల్లా మహిళా అధ్యక్షురాలు కొన్నె మంజుల గౌడ్, ప్రధాన కార్యదర్శి నారాయణదాసు కవిత, పట్టణ అధ్యక్షులు కుంభం నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఏశబోయిన మల్లేష్ యాదవ్, పెన్ పహాడ్ మండల అధ్యక్షులు ఆవుల అంజయ్య యాదవ్, ఆత్మకూరు ఎస్ మండల అధ్యక్షులు బొల్లె సైదులు, యగ్గడి మురళి, వట్టె లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండ చౌరస్తా వద్ద ప్రమాదకర గుంతలకు చెక్


**భువనగిరి పట్టణం, మార్చి 1 (జనం సాక్షి) :** భువనగిరి పట్టణం మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులో నల్లగొండ చౌరస్తా – న్యూ రాంనగర్ ప్రాంతంలో ఏడాది కాలంగా ప్రమాదాలకు కారణమవుతున్న రహదారి గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చివేయించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మార్గదర్శకత్వం వహించగా, 22వ వార్డు కౌన్సిలర్ జాలిగం విగ్నేష్ చొరవ తీసుకుని రోడ్లు భవనాల శాఖ అధికారులతో సమన్వయం చేసి పనులు పూర్తి చేయించారు. జాతీయ రహదారిపై ఏర్పడిన భారీ గుంత వల్ల అనేక మంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వార్డు ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించి తక్షణ చర్యలు చేపట్టేలా చేశారు. అధికారులతో సమన్వయం చేసి సమస్యను పరిష్కరించడం ద్వారా ప్రజలకు ఉపశమనం కలిగిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ జాలిగం విగ్నేష్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను



ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే స్పందించి పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ప్రజల భద్రతే తమకు ప్రధాన ప్రాధాన్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, 8వ వార్డు కౌన్సిలర్ తాహెరా మజర్ పాషా, బట్టు మహేందర్, వరుణ్, సాదిక్, సాయి రత్నాకర్, శివతేజ తదితరులు పాల్గొన్నారు.

## ముకుందాపురం గ్రామంలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ లైన్

- సమస్య విన్నవించినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడంలేదని ఫిర్యాదు



నేరేడుచర్ల, మార్చి 1 (జనంసాక్షి) : మండలంలోని ముకుందాపురం గ్రామంలో ఒకటో వార్డులో మెయిన్ రోడ్డులో విద్యుత్ లైన్ ప్రమాదకరంగా మారిందని,సమస్య గురించి పలుమార్లు విన్నవించినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామానికి చెందిన ఒకటో వార్డ్ సభ్యులు పగిడపల్లి సైదులు, అలియాస్ చంటి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రహదారి నేరేడుచర్ల నుంచి వయా దాచారం, అన్నారం మీదుగా సూర్యాపేటకు ప్రధాన రోడ్డు. ఈ రోడ్డుపై ఆర్టీసీ బస్సుతో పాటు ఇతర వాహనాలు నిత్యం వెళ్తుంటాయని, ధాన్యం ఇతర లోడ్లతో ట్రాక్టర్లు, లారీలు వెళు ‌ంటాయని,మనిషి ఎత్తుకంటే తక్కువ ఎత్తులో ఉన్న ఆ వైర్లతో నివాసితులు, వాహనదారులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారని,ఈ విషయాన్ని ట్రాన్స్కో, లైన్మెన్, ఇతర అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని, విద్యుత్ వైర్లను సరి చేసి ఎత్తు పెంచాలని పలుమార్లు వేడుకున్నా నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఆ విద్యుత్ లైన్ వైర్లను సరిచేసి, ఎత్తును పెంచాల్సిందిగా గ్రామ ప్రజల తరుపున కోరుతున్నామన్నారు.

## షూటింగ్ బాల్ క్రీడాకారులకు జెర్సీలు అందజేత



**రామన్నపేట, మార్చి 1 (జనంసాక్షి) :** మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో ఫిబ్రవరి 28 నుండి మార్చి 2 వరకు నిర్వహిస్తున్న 45వ తెలంగాణా స్టేట్ లెవెల్ సబ్ జూనియర్ బాయ్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ షూటింగ్ బాల్ క్రీడాకారులకు గ్రామ సర్పంచ్ గర్దాసు విక్రమ్ సొంత నిధులతో జెర్సీలు అందజేశారు. అనంతరం మ్యాచ్ లను ప్రారంభించారు. క్రీడాకారులకు సొంత ఖర్చులుతో బిజెపి రాష్ట్ర నాయకులు చినపాక శ్రీనివాస్ భోజనాల ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమం లో వార్డ్ మెంబెర్ లు,షూటింగ్ బాల్ క్రీడాకారులు నిర్వాహకులు గ్రామ సీనియర్ నాయకులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి యువకుడి గల్లంతు



**అమీన్పూర్, మార్చి 1 (జనం సాక్షి) :** చెరువులో పడి ఓ యువకుడు గల్లంతైన ఘటన అమిన్పూర్ లో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. అమీన్పూర్ ఇన్స్పెక్టర్ నరేష్ తెలిపిన వివరాలు ప్రకారం బొమ్మనుకుంటకు చెందిన యాకరి రవి (36) మరో వ్యక్తితో కలిసి చేపల వల వేసేందుకు గ్రామం పక్కన ఉన్న కుంటలో దిగారు. త్వరలో ఇరుక్కుని రవి నీటిలో గల్లంతయ్యాడు. ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం కుంటల గాలింపు చర్యలు చేపట్టింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రభాకర్ చేస్తున్నారు.

## సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది

**సూర్యాపేట, మార్చి 1 (జనంసాక్షి) :** ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆత్మకూర్(ఎస్)మండలం ఏవీకే తండా పాఠశాల ఉపాధ్యాయురాలు తంగేళ్ళ పద్మ పదవీ విరమణ సన్మాన




కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డితో కలిసి పాల్గొని ఆమెను ఘనంగా సన్మానించారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం, ఉన్నతాధికారులతో మాట్లాడి జిల్లా కేంద్రంలో పిఆర్టియు భవనం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించేందుకు కృషి చేస్తామన్నారు.ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న అందుబాటులో ఉండి పరిష్కరిస్తామని అన్నారు.గత 26 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన తంగేళ్ల పద్మ సేవలు అభినందనీయమన్నారు. తాను పని చేసిన ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు, ఉత్తమ విద్య అందించేందుకు విశేష కృషి చేశారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్థిక కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సోమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పిఆర్టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జితేందర్ రెడ్డి, నరేష్, ఆత్మకూరు ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసుదేవరెడ్డి, చౌదరి రెడ్డి, పలువురు ప్రముఖులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సేవలో రాష్ట్రంలో ముందుండాలి



**భువనగిరి, మార్చి 1 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రజలకు స్వచ్ఛంద సేవలు అందించడంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ రాష్ట్రంలోనే ముందుండాలని నూతన జిల్లా కలెక్టర్ అనురాగ జయంతి అన్నారు. శనివారం సాయంత్రం జిల్లా రెడ్క్రాస్ బృందం నూతన కలెక్టర్ ను కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెడ్ క్రాస్ నిర్వహించే స్వచ్ఛంద కార్యక్రమాలలో తను భాగస్వామ్యం అవుతానని తెలిపారు. త్వరలో నిర్వహించనున్న రెడ్క్రాస్ జిల్లా సర్వసభ్య సమావేశంలోనూ తను పాల్గొంటానని తెలిపారు. కలెక్టర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి లక్ష్మీనరసింహారెడ్డి, వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ ,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్ మహేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సద్ది వెంకటరెడ్డి, జిల్లా డైరెక్టర్లు ,జంపాల అంజయ్య, ఎస్.ఎన్. చారి, డివిజన్ ప్రతినిధులు చంద్రశేఖర్, లావణ్య, యూత్ వింగ్ జిల్లా అధ్యక్షుడు బి సుమచ్చగిరి,కార్యాలయ కార్యదర్శి క్రిస్టోఫర్, తదితరులు ఉన్నారు.

# విద్యుత్ మీటర్ రీడర్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**సూర్యాపేట, మార్చి 1 (జనంసాక్షి) :** సూర్యాపేట డివిజన్ కు చెందిన విద్యుత్ మీటర్ రీడర్ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం విద్యుత్ సర్కిల్ ఆఫీసు ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ నాగేశ్వర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మీటర్ రీడర్స్ గత 20 సంవత్సరాలుగా విద్యుత్ శాఖలో సేవలందిస్తున్నారని తెలిపారు.మీటర్ రీడింగ్ మాత్రమే కాకుండా లైన్మెన్ల పనులు కూడా నిర్వర్తిస్తూ ప్రాణాలను పణంగా పెట్టి విద్యుత్ స్తంభాలు ఎక్కి బాధ్యతతో విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు.నెలలో కొద్ది రోజులు మాత్రమే పని దొరకడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మిగతా రోజులకు ఉపాధి లేక కుటుంబాలు కష్టాల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు విద్యుత్ యాజమాన్యం వెంటనే స్పందించి పీసు రేటు



విధానంను రద్దు చేసి నెలలో పూర్తి 30 రోజుల పని దినాలు కల్పించి జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు.ఖాళీగా ఉన్నటువంటి సబ్ స్టేషన్ లలో ఆపరేటర్ గా తీసుకొని ఆర్టిజన్ లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.మీటర్ రీడర్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం అయ్యేవరకు విధులకు హాజరుకాబోమని తెలిపారు.అధికారులకు, ప్రజాప్రతినిధులకు, నాయకులకు అనేక సార్లు వినతి పత్రాలు ఇచ్చిన వారి నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో మీటర్ రీడింగ్ పనులను నిలిపివేసినట్లు తెలిపారు.నేడు హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద జరగబోయే ధర్నా విజయవంతం చేయాలని విద్యుత్ మీటర్ రీడర్ కార్మికులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షులు బోయిల్లా విద్యాసాగర్, మహేష్, ప్రవీణ్, మద్దెల సాయి, చిలుక శ్యామ్, అభినవ్, విష్ణు, మహమ్మద్, షఫీ, శ్రీకాంత్, పాల్వాయి సతీష్, నవీన్, సురేందర్, వెంకటేశ్వర్లు, భార్గవ్, గణేష్, శివాజీ, పృథ్వీ, శరత్, సందీప్, ఆంజనేయులు, మహేష్, గిరి, తదితరులు పాల్గొన్నారు.




# ఈవీ రయ్..రయ్..

### ఈ రంగంలోకి రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు

### గత ఐదేళ్లపై ఐఈఈఎఫ్ఏ నివేదిక

దిల్లీ: గత ఐదేళ్లలో భారత విద్యుత్ వాహన (ఈవీ) రంగం రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించిందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎనర్జీ ఎకనామిక్స్ అండ్ ఫైనాన్షియల్ అనాలసిస్ (ఐఈఈఎఫ్ఏ) నివేదిక తెలిపింది. అయితే 2030కి భారత్ నిర్దేశించుకున్న లక్ష్యం సాకారం కావాలంటే.. మరిన్ని పెట్టుబడులు అవసరం అవుతాయని పేర్కొంది. 2030 కల్లా దేశంలో మొత్తం కార్ల విక్రయాల్లో 30%, వాణిజ్య వాహన విక్రయాల్లో 70%, బస్సుల అమ్మకాల్లో 40%, ద్వి-త్రిచక్ర వాహనాల అమ్మకాల్లో 80 శాతం మేర ఈవీలే ఉండాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. 2020-2025 మధ్య కాలంలో అన్ని రూపాల్లో ఈవీ రంగంలోకి వచ్చిన పెట్టుబడులపై ఈ నివేదికను ఐఈఈఎఫ్ఏ రూపొందించింది. అలాగే దేశీయ ఈవీ రంగ మలివిడత వృద్ధికి అవసరమయ్యే పెట్టుబడులను సమీకరించే మార్గాలనూ ఇందులో ప్రస్తావించింది. 2020-2025 మధ్య వచ్చినట్లు చెబుతున్న రూ.2.23 లక్షల కోట్లలో అధిక భాగం తయారీ సామర్థ్యాల అభివృద్ధి కోసం రాగా.. ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాల రూపేణా, ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతుల కోసం మిగతావి వచ్చినట్లు నివేదిక వివరించింది. 'కేవలం ఐదేళ్లలోనే రూ.2.23 లక్షల కోట్ల మూలధన నిధుల సమీకరణ జరిగింది. అయితే 2030 నాటికి కావాల్సిన రూ.12,50,000 కోట్లలో ఇది 18 శాతమే'నని ఐఈఈఎఫ్ఏలో క్లైమేట్ ఫైనాన్స్ విశ్లేషకులు శుభమ్ శ్రీవాస్తవ తెలిపారు. మిగతా రూ.10.2 లక్షల కోట్లను సమీకరించాలంటే రుణ సంస్కరణలు అవసరం అవుతాయని పేర్కొన్నారు. 2020-25 మధ్య ఎలక్ట్రిక్ త్రిచక్ర విభాగంలోకి అత్యధికంగా (78%) పెట్టుబడులు వచ్చాయని నివేదిక తెలిపింది. విద్యుత్ కార్లకు గిరాకీ పెరుగుతుండటంతో 2024, 2025లో ఈ విభాగంలోకి కూడా పెట్టుబడుల రాక పెరగడం ప్రారంభమైందని వివరించింది.



# ఈ ఏడాది వేతనాల వృద్ధి పైపైకి

### ఏఓఎన్ సర్వే వెల్లడి




ముంబయి: ప్రస్తుత సంవత్సరం(2026)లో వేతనాలు సగటున 9.1 శాతం పెరిగే అవకాశం ఉందని ఓ సర్వేలో వెల్లడైంది. గత సంవత్సరంలో నమోదైన 8.9% వేతన పెంపు కంటే ఇది ఎక్కువే. వార్షిక వేతన పెంపు అంశంపై అంతర్జాతీయ వృత్తి నిపుణుల సేవల సంస్థ ఏఓఎన్ ఈ సర్వేను నిర్వహించింది. ఇందులో దేశంలోని 45 రంగాలకు చెందిన 1,400కి పైగా సంస్థలు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశాయి. దీని ప్రకారం..వేతన పెంపు అంచనాలు ఒక్కో రంగానికి ఒక్కోలా ఉండనున్నాయి. అత్యధికంగా స్థిరాస్తి, మౌలిక రంగాల్లోని ఉద్యోగులకు సగటున 10.2% పెరిగే అవకాశం ఉంది. ఆ తర్వాతి స్థానంలో బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) ఉండనున్నాయి. ఈ సంస్థల్లో పనిచేసే వారికి వేతనాలు 10.1 శాతం పెరగొచ్చు. ఆటోమోటివ్, వాహన తయారీ రంగాల్లోని ఉద్యోగులకు 9.9 శాతం వేతన పెంపు ఉండొచ్చు. ఇంజినీరింగ్ డిజైన్ సేవల్లోని సిబ్బందికి కూడా ఇదే స్థాయిలో వేతనాలు పెరిగే అవకాశం ఉంది. ఇంజినీరింగ్, తయారీ, రిటైల్ రంగంలో పని చేసే సిబ్బందికి సగటున 9.5 శాతం ఇంక్రిమెంట్ లభించొచ్చు. సాంకేతికత, ఇంజినీరింగ్, వినియోగదారు ఆధారిత విభాగాల సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నాయని సర్వే తెలిపింది. పోటీతో కూడిన పరిస్థితులు నెలకొన్నందున ప్రత్యేక నైపుణ్యం ఉన్న వారిని ఆకర్షించేందుకు అవి ప్రయత్నిస్తున్నాయని వివరించింది. 'పటిష్ఠ సూక్ష్మ ఆర్థిక మూలాల అండతో భారత్ తదుపరి వృద్ధి దశలో పయనిస్తోంది. దేశీయంగా బలమైన గిరాకీ పరిస్థితులు, ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం, కొత్త వాణిజ్య ఒప్పందాల వల్ల మధ్యకాలంలో వేతనాల పెంపునకు సానుకూల పరిస్థితులే కనిపిస్తున్నాయ'ని ఏఓఎన్ పార్ట్‌నర్, రివార్డ్స్ కన్సల్టింగ్ లీడర్ రూపాంక్ చౌధ్రి తెలిపారు. వలసల రేటు కిందకు..: గత మూడేళ్లుగా వలసల రేటు తగ్గుతూ వస్తోందని సర్వే తెలిపింది. 2023లో వలసల రేటు 18.7 శాతం కాగా.. 2024లో 17.7 శాతానికి పరిమితమైంది. 2025లో మరింత తగ్గి 16.2 శాతానికి దిగివచ్చిందని వెల్లడించింది. దీంతో ఇంచుమించుగా కొవిడ్-19 పరిణామాలకు ముందున్న స్థాయికి చేరిందని పేర్కొంది. కంపెనీలు తమ ఉద్యోగులను అట్టేపెట్టుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాయనడానికి వలసల రేటు క్రమేపి తగ్గుతుండటమే నిదర్శమని సర్వే అభిప్రాయపడింది. కొత్త కార్మిక చట్టాల అమలు.. కొన్ని దశాబ్దాల కాలంలోనే కంపెనీలు ఎదుర్కొంటున్న అతిపెద్ద నియంత్రణపరమైన మార్పుల్లో ఒకటని ఏఓఎన్ ఇండియా అసోసియేట్ పార్ట్‌నర్ అమిత్ తెలిపారు.

## వజ్రపుటుంగరం కొనేద్దాం

### యువతలో పెరుగుతున్న ఆసక్తి

### కలిసొస్తున్న 30% ధర క్షీణత

**న్యూఢిల్లీ:** అసలే పెళ్లిళ్ల సీజను. ఆభరణాలు కొనకుండా ఉండలేని పరిస్థితి. అయితే బంగారం ఉంగరం బదులుగా వజ్రపుటుంగరం వైపు దృష్టి పెట్టేందుకు వజ్రాల ధరలు వీలు కల్పిస్తున్నాయి. ముఖ్యంగా 1 క్యారట్ ఎంగేజ్‌మెంట్ ఉంగరం ధర గత ఆర్థిక సంవత్సరంలో రూ.7-8 లక్షల వరకు ఉండగా, ఇపుడు రూ.5-5.5 లక్షలకు దిగివచ్చిందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నారు. భారత వజ్రాల మార్కెట్ రూ.80,000-90,000 కోట్లుగా ఉండొచ్చని అంచనా.తగ్గిన ధర.. పెరిగిన గిరాకీ: 28-40 ఏళ్ల వయసు వినియోగదార్లలో సొలిటైర్స్‌పై ఆసక్తి పెరిగిందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ధరలు దిగిరావడంతో గత ఏడాదితో పోలిస్తే విక్రయాలు సైతం 25-35% శాతం మేర పెరిగాయంటున్నారు. పసిడి ధర భారీగా పెరిగిన నేపథ్యంలో రూ.2 లక్షలకు అటూ ఇటూగా ధర ఉన్న సొలిటైర్స్‌కు భారీ గిరాకీ కనిపిస్తోంది. ఇవీ కారణాలు..: ఎగుమతులకు గిరాకీ తగ్గడంతో సహజ వజ్రాల ధరలు కిందకు వచ్చాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అధిక టారిఫ్‌లు కూడా ఇందుకు దోహదం చేశాయి. భారత్ నుంచి అధికంగా కట్, పాలిష్డ్ వజ్రాలను తీసుకునే చైనా కూడా వాటి పరిమాణాన్ని తగ్గించుకోవడం దేశీయ ధరలపై ఒత్తిడిని పెంచింది. 20 గ్రాముల పసిడి ఉంగరం లేదా చెయిన్‌తో పోలిస్తే రూ.2 లక్షల విలువైన సొలిటైర్స్‌ను కొనుగోలు చేయడం చౌక కావడంతో మిలేనియల్స్‌లో ఎక్కువ మంది తమ ఎంగేజ్‌మెంట్, వార్షికోత్సవాలకు వీటివైపే మొగ్గుచూపుతున్నారు.

## వివో బాటలో రెడ్‌మీ, పోకో.. స్మార్ట్‌ఫోన్ ధరల పెంపు!


స్మార్ట్‌ఫోన్ కొనాలనుకునేవారికి బ్యాడ్‌న్యూస్. చైనాకు చెందిన రెడ్‌మీ, పోకో కూడా స్మార్ట్‌ఫోన్ల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. పెరిగిన ధరలు రేపటి నుంచి (మార్చి 1 నుంచి) అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే శాంసంగ్, వివో, ఐకూ సంస్థలు ధరల పెంపు చేపట్టగా.. తాజాగా ఈ రెండు బ్రాండ్లూ అదే బాటపట్టాయి. ధరల పెంపు వల్ల ఆయా స్మార్ట్‌ఫోన్ ధరలు కనిష్ఠంగా రూ.1000 నుంచి గరిష్ఠంగా రూ.2,500 వరకు పెరగనున్నాయి.టెక్ టిప్‌స్టర్ అభిషేక్ యాదవ్ పేర్కొన్న వివరాల ప్రకారం.. పోకో ఎంట్రీలెవల్ మోడల్ సీ75 ప్రస్తుత ధర 4జీబీ+64జీబీ వేరియంట్ ధర రూ.8,499 కాగా.. ఇకపై రూ.10,999కు విక్రయించన్నారు. 4+128జీబీ మోడల్ ధర రూ.2000 పెరగనుంది. ఇదే రీతిన పోకో ఎం7, సీ85 5జీ, పోకో ఎం7 ప్లస్ 5జీ, పోకో ఎఫ్7 5జీ మోడళ్లపై వేరియంట్‌ను బట్టి రూ.1000-రూ.2000 వేలు పెంచుతున్నట్లు పోకో పేర్కొంది.




రెడ్‌మీ కూడా ఇదే స్థాయిలో ధరలు పెంచనుందని సమాచారం. సవరించిన ధరలు మార్చి ఒకటి నుంచే అమల్లోకి రానున్నాయి.ఎందుకీ పెరుగుదల?: స్మార్ట్‌ఫోన్ ధరల పెరుగుదలకు ప్రధాన కారణం మెమొరీ చిప్‌ల కొరత. ఏఐ డేటా సెంటర్ల నుంచి విపరీతమైన డిమాండ్ కారణంగా అంతర్జాతీయంగా మెమొరీ చిప్‌ల కొరత ఏర్పడింది. దీంతో మొబైల్ తయారీ ఖర్చు పెరుగుతోంది. దీంతో మార్చి 1 నుంచి చైనాకు చెందిన వివో, దాని అనుబంధ ఐకూ స్మార్ట్‌ఫోన్ ధరలు పెంచాయి. వివో టీ4, ఐకూ జడ్10 సిరీస్ ఫోన్లపై గరిష్ఠంగా రూ.2,500 వరకు పెంచుతున్నట్లు ప్రకటించాయి. శాంసంగ్ సైతం ఎఫ్17, ఏ36, ఏ56 స్మార్ట్‌ఫోన్ ధరలను రూ.2వేలు వరకు పెంచేసింది.

## స్కైరూట్ నుంచి ధావన్-3 క్రయోజెనిక్ ఇంజిన్

**హైదరాబాద్:** అంతరిక్ష రంగంలోని స్కైరూట్ ఏరోస్పేస్ అత్యంత ఆధునిక 'ధావన్-3' క్రయోజెనిక్ రాకెట్ ఇంజిన్ పరీక్షను విజయవంతంగా పూర్తి చేసింది. దాదాపు 145 సెకన్లపాటు నిర్వహించిన సామర్థ్య పరీక్ష.. సత్ఫలితాలను ఇచ్చిందని సంస్థ వెల్లడించింది. పునర్వినియోగ సామర్థ్యం, పర్యావరణ అనుకూల సాంకేతికతలకు ప్రాధాన్యం ఇస్తూ ధావన్-3 ఇంజిన్‌ను అభివృద్ధి చేసినట్లు పేర్కొంది.






# మన ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందేనా?

### అమెరికా ఇరాన్ ఉద్రిక్తతలు మన దేశవ్యవస్థకు పెనువిఘాతం

**న్యూఢిల్లీ:** ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన మెరుపు దాడులు పశ్చిమాసియాలో భద్రతాపరమైన ఆందోళనలను మరింత తీవ్రతరం చేశాయి. ఈ భౌగోళిక రాజకీయ పరిణామాలు కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా, ప్రపంచ ఇంధన మార్కెట్లతో పాటు భారత చమురు భద్రత, ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం చూపనున్నాయి.ఇజ్రాయెల్-అమెరికా దాడులతో ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి వద్ద యుద్ధ వాతావరణం నెలకొంది. భారత్ తన ముడి చమురు దిగుమతుల్లో సగానికి పైగా ఈ మార్గంలోనే చేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్న అంశం. ఇక్కడ రవాణాకు ఏమాత్రం ఆటంకం ఏర్పడినా ఇంధన, సరకు రవాణా వ్యయాలు పెరుగుతాయి. భారత ఆర్థిక వ్యవస్థపై ఇది పెను భారం మోపడం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఇరాన్‌ను ఒమన్, యూఏఈల నుంచి వేరు చేసే ఈ హోర్ముజ్ జలసంధి నుంచే ప్రపంచ చమురు వాణిజ్యంలో 20 శాతం సాగుతోంది. కేప్లర్ నివేదిక ప్రకారం, 2025 చివరి నాటికి 40 శాతంగా ఉన్న భారత చమురు దిగుమతులు, 2026 జనవరి-ఫిబ్రవరి నాటికి 50 శాతానికి పెరిగాయి. పాశ్చాత్య దేశాల ఆంక్షల నేపథ్యంలో రష్యన్ చమురు కొనుగోళ్లను తగ్గించి, మధ్యప్రాచ్య దేశాలపై ఆధారపడటం పెరగడం దీనికి ప్రధాన కారణం. ప్రస్తుతం భారత్ రోజుకు 26 లక్షల బ్యారెళ్ల ముడి చమురును ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ నుంచి ఈ మార్గం నుంచే దిగుమతి చేసుకుంటోంది. సగటున రోజుకు 74,000 బ్యారెళ్ల శుద్ధి చేసిన చమురు ఉత్పత్తులనూ భారత్ ఈ జలసంధి నుంచే ఎగుమతి చేస్తోంది.

చమురు ధర పైపైకి..

అమెరికా బలగాల మోహరింపుతోనే ముడిచమురు ధరలు సుమారు 10 శాతం మేర పెరిగాయి. ఈక్విరస్ సెక్యూరిటీస్ నివేదిక ప్రకారం, ఒకవేళ రోజుకు 33 లక్షల బ్యారెళ్ల ఇరాన్ చమురు ఉత్పత్తికి అంతరాయం కలిగితే బ్యారెల్ ధర 9-15 శాతం పెరిగి, 76-81 డాలర్లకు చేరుకోవచ్చు. హోర్ముజ్ జలసంధికి పాక్షిక ఆటంకం ఏర్పడితే అదనంగా 20-40 శాతం పెరిగి, ఏకంగా 95-110 డాలర్లకు చేరుకునే ముప్పు ఉందని ఆ నివేదిక స్పష్టం చేసింది.



మనకు ప్రతికూల అంశాలివీ..

తాజా పరిణామంతో భారత్‌పై పలు అంశాల్లో ప్రతికూలతలు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. అవేంటంటే..కరెంటు ఖాతా లోటు: మనం వినియోగించే చమురులో 85 శాతం ఇతర దేశాల నుంచే కొనుగోలు చేస్తున్నాం. కాబట్టి, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు కొద్దిగా పెరిగినా, దేశం చెల్లించాల్సిన మొత్తం దిగుమతి బిల్లు అమాంతం పెరుగుతుంది. యుద్ధ భయాలతో మార్కెట్లో ముడి చమురు బ్యారెల్ ధర 90 డాలర్లు దాటితే.. మనకు ఇబ్బందే. చమురు ధరలు స్థిరంగా పెరిగితే, దిగుమతి బిల్లు భారీగా పెరిగి, కరెంట్ ఖాతా లోటు మరింత తీవ్రమవుతుంది.

రూపాయి పతనం: మనం విదేశాల నుంచి చమురు కొనుగోలు చేసినప్పుడు, దానికి చెల్లింపులు అమెరికన్ డాలర్లలో చేయాల్సి ఉంటుంది. చమురు ధరలు పెరిగినప్పుడు, ఎక్కువ డాలర్లను వెచ్చించాల్సి వస్తుంది. దీనివల్ల డాలర్లకు గిరాకీ పెరుగుతుంది. రూపాయిపై ఒత్తిడి పడి విలువ పతనం అవుతుంది.

ఎగుమతులపైనా ప్రభావం: భారత్ నుంచి ఇరాన్‌కు ఎగుమతి అయ్యే బాస్మతీ బియ్యం, ఫార్మా, టీ, సుగంధద్రవ్యాలు తదితరాలపై ప్రభావం పడొచ్చు.

వీటి ధరలు పెరగొచ్చు: చమురు ధరలు పెరిగితే, దేశీయంగా పెట్రోలు, డీజిల్ ధరలపై ఆ ప్రభావం ఉంటుంది. దీనివల్ల దేశవ్యాప్తంగా సరకు రవాణా ఖర్చులు అధికం అయ్యే అవకాశం ఉంది. ఎర్ర సముద్రంలో భద్రత లేకపోతే, నౌకలు ఆఫ్రికా మీదుగా ప్రయాణించాల్సి వస్తుంది. దీనివల్ల సరకు రవాణా సమయం 15-20 రోజులు, ఖర్చులు 40-50 శాతం పెరుగుతాయి. ఇవన్నీ అంతిమ వినియోగదారుడిపై భారం మోపుతాయి. ఇదేకాకుండా ఇరాన్, ఇజ్రాయెల్, కువైట్ తదితర దేశాల గగనతలాలు పాక్షికంగా మూతపడటంతో ఎయిరిండియా, ఇండిగో విమానయాన సంస్థలు అమెరికా, ఐరోపా రూట్లను మళ్లించాయి. దీంతో ఇంధన ఖర్చులపై ప్రభావం పడుతుంది. ఫలితంగా విమాన టిక్కెట్ల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది.

స్టాక్‌మార్కెట్‌పైనా: ఇప్పటికే టారిఫ్ అనిశ్చితుల మధ్య డీలా పడ్డ మార్కెట్లకు తాజా పరిణామాలు రుచించకపోవచ్చు. ఈ ఉద్రిక్తతలు ఎంత కాలం కొనసాగితే అంతకాలం మార్కెట్‌పై ప్రభావం ఉండొచ్చు. ఈ నేపథ్యంలో ఎంత త్వరగా యుద్ధ మేఘాలు వీడితే మార్కెట్లకు అంత మేలు. యుద్ధ భయాల నుంచి రక్షణ పొందేందుకు భారత్ ఇప్పటికే పలు చర్యలు తీసుకుంటున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు.

## ప్రయాణాల్లో మార్పులకు సిద్ధపడాల్సిందే

### అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో గగనతలంపై ఆంక్షల నేపథ్యం

దిల్లీ: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో గగనతల ఆంక్షలు, మార్గ మళ్లింపుల వల్ల విమాన కార్యకలాపాలకు అంతరాయాలు చోటుచేసుకోనున్నాయి. అందుకు తగ్గట్లుగా ప్రయాణ ప్రణాళికల్లో మార్పులకు ప్రయాణికులు సిద్ధంగా ఉండాలని ఈజ్‌మై ట్రిప్ సహవ్యవస్థాపకుడు రికాంత్ పిట్టీ తెలిపారు. విమానయాన సంస్థలు అందించే సమాచారాన్ని ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. 'అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రం కావడంతో ఇరు దేశాలు పౌర విమాన కార్యకలాపాలకు గగనతలాన్ని మూసివేశాయి. ఈ దేశాల ద్వారా, వాటి చుట్టుపక్కల నుంచి ప్రయాణాలు సాగించాల్సిన విమాన ప్రయాణికులకు ఈ పరిణామాల వల్ల ప్రయాణ సమయం మరింత పెరిగే అవకాశం ఉంది. విమాన రాకపోకల సమయాల్లోనూ మార్పులు చోటుచేసుకోవచ్చ'ని తెలిపారు. అంతర్జాతీయ పరిణామాలు వేగంగా మారుతుండటంతో.. విమానయాన సంస్థల అధికారిక వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు సమాచారాన్ని అంతర్జాతీయ ప్రయాణికులు తెలుసుకుంటూ ఉండాలని చెప్పారు. పరిస్థితులను బట్టి తిరుగు ప్రయాణ ప్రణాళికల్లో మార్పులకు సన్నద్ధమవ్వాలని అన్నారు. 'ఈజ్‌మై ట్రిప్‌లో మా బృందం కూడా ఈ పరిణామాలను సునిశితంగా గమనిస్తోంది. ప్రయాణికులకు ఏమైనా సహకారం కావాల్సి వస్తే.. అందించేందుకూ సిద్ధంగా ఉన్నామ'ని పిట్టీ వివరించారు.





## 'ఆ 11 గగనతలాలకు దూరంగా ఉండండి'..

### ఎయిర్‌లైన్స్‌కు డీజీసీఏ సూచన


**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో విమానయాన సంస్థలకు కేంద్రం కీలక సూచనలు చేసింది. మార్చి 2 వరకు ఆ ప్రాంతంలోని 11 దేశాల గగనతలాలను ఉపయోగించొద్దని డీజీసీఏ తెలిపింది. ఇరాన్, ఇజ్రాయెల్, లెబనాన్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఒమన్, ఇరాక్, జోర్డాన్, కువైట్, ఖతర్‌లు ఈ జాబితాలో ఉన్నాయి. ఎయిరిండియా, ఇండిగో, ఆకాశ ఎయిర్, స్పైస్‌జెట్ తదితర భారత విమానయాన సంస్థలు ఇప్పటికే పశ్చిమాసియా దేశాలకు తమ విమాన సర్వీసులను నిలిపివేశాయి.పశ్చిమాసియాకు విమానాల రద్దు కారణంగా వేలాది మంది ప్రయాణికులపై ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు విమానయాన సంస్థల ప్రతినిధులు, ఎయిర్‌పోర్టుల నిర్వాహకులు తదితరులతో సమావేశం నిర్వహించారు. ప్రయాణికుల భద్రత, కార్యకలాపాల కొనసాగింపు తదితర అంశాలపై చర్చించారు. నిబంధనలు పాటిస్తూ.. అవసరమైన చోట విమానాలను దారి మళ్లించడం వంటివి చేయాలని కేంద్రమంత్రి ఆదేశించినట్లు పౌర విమానయాన శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

## హార్డ్‌వేర్‌లోనూ బలమైన శక్తిగా భారత్

**సనంద్:** గుజరాత్‌లోని సనంద్‌లో మైక్రాన్ టెక్నాలజీకి చెందిన సెమీ కండక్టర్ ప్లాంట్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. సాఫ్ట్‌వేర్‌లో బలమైన శక్తిగా ఎదిగిన తర్వాత, హార్డ్‌వేర్ రంగంలో కూడా దేశం తన గుర్తింపును దృఢంగా నిర్మిస్తోందని ఆయన తెలిపారు. అమెరికాకు చెందిన ఈ కంపెనీ ఏటీఎంపీ (అసెంబ్లీ, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్) ప్లాంట్ మన దేశంలో ప్రారంభం కావడం రెండు దేశాల మధ్య లోతైన భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తోందని మోదీ పేర్కొన్నారు. మన దేశం సమర్థవంతంగా, పోటీతత్వంతో ఉందనే సందేశం ప్రపంచానికి స్పష్టంగా చేరిందని తెలిపారు. గత శతాబ్దానికి చమురు కీలకంగా వ్యవహరిస్తే, ఈ శతాబ్దంలో ఆ పనిని మైక్రోచిప్‌లు చేస్తున్నాయని వెల్లడించారు. మన దేశం వేగంగా ప్రపంచ సెమీ కండక్టర్ వాల్యూ చైన్‌లో అంతర్భాగంగా మారుతోందని వివరించారు. ఈ ప్లాంట్ ఎస్ఎస్‌డీ (సాలిడ్ స్టేట్ డ్రైవ్) నిల్వ పరికరాలతో పాటు ఆర్ఏఎం రకం డీఆర్ఏఎం, ఎన్ఏఎన్‌డీ ఉత్పత్తులను తయారు చేస్తుందని ప్రభుత్వం తెలిపింది. ఈ ప్లాంట్‌లో మైక్రాన్ టెక్నాలజీ రూ.22,516 కోట్ల పెట్టుబడి పెట్టిందని పేర్కొంది.

## నాగ్‌పూర్‌లో భారీ పేలుడు..

పైగా ఉద్యోగులు వివిధ యూనిట్లలో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రమాదంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌ గ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని.. అధికారులతో తాను నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని పేర్కొన్నారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు.



## జనవరిలో విమాన ప్రయాణికులు 1.52 కోట్లు

**ముంబయి:** 2026 జనవరిలో దేశీయ విమాన ప్రయాణికులు 2025 జనవరితో పోలిస్తే 4.36 శాతం పెరిగి 1.529 కోట్లకు చేరారని పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) వెల్లడించింది. ఇండిగో, ఎయిరిండియా గ్రూప్, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్ విమానాల్లో దేశీయ మార్గాల్లో 2025 జనవరిలో మొత్తం 1.461 కోట్ల మంది ప్రయాణించారని డీజీసీఏ తెలిపింది. గత డిసెంబరులో ఇండిగోలో తలెత్తిన సంక్షోభంతో మార్కెట్ వాటా 4 శాతం కోల్పోయినా జనవరిలో మళ్లీ మార్కెట్ వాటా 63.6 శాతానికి చేరింది. 97.04 లక్షల మంది దేశీయ ప్రయాణికులు ఈ కంపెనీ విమానాల్లో ప్రయాణించారు. ఎయిరిండియా గ్రూప్ 3 శాతం మార్కెట్ వాటా కోల్పోయి 26.5 శాతానికి (40.34 లక్షల మంది) పరిమితమైంది. ప్రయాణికుల భర్తీ సామర్థ్యంలో ఆకాశ ఎయిర్ 93.2 శాతంతో అగ్ర స్థానంలో నిలిచింది. ఇండిగో 87.7 శాతంతో రెండో స్థానం దక్కించుకుంది. సమయ పాలనలో ఇండిగో 70.9 శాతం పని తీరుతో ప్రథమ స్థానంలో నిలిచింది. దిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రో విమానాశ్రయాలను పరిగణనలోకి తీసుకుని డీజీసీఏ ఈ గణాంకాలు విడుదల చేసింది.

# లిస్టులో పేరున్నదని సంతృప్తి తప్ప పేదల సొంతింటి కల నెరవేరలేదు

- అద్దె ఇళ్లలో నివాసం ఉండే పేదలకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలి
- సిపిఐ (ఎం) సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం దశరథ్



**ముషీరాబాద్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని పేదలకు ఇందిరమ్మ ఇల్లు కేటాయిం చాలని, గత ప్రభుత్వం నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే ఇవ్వాలని సిపిఐ (ఎం) సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం దశరథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ముషీరాబాద్ నియోజకవర్గం కవాడిగూడ డివిజన్ లోని తాళ్లబస్తీ లో సిపిఐ (ఎం) ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాని కి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ (ఎం) సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం దశరథ్ హాజరై మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలందరి కీ ఇల్లు ఇస్తామని ప్రజా పాలన దరఖాస్తులు తీసుకొని రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు నగరంలో ఒక్కరికి కూడా ఇల్లు కట్టించి ఇవ్వలేదని విమర్శించారు. ప్రజా పాలనలో దరఖాస్తులను శ్రీ1 శ్రీ2 శ్రీ3 కేటగిరీలలో విభజించి ఆన్లైన్లో ఉంచరు. దీని ద్వారా ప్రభుత్వ లిస్టులో తమ పేరు ఉన్నదని సంతృప్తి తప్ప పేదల సొంతింటి కల నెరవేరలేదు అన్నారు.

గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నగరం చుట్టుముట్టు నిర్మించిన 35వేల డబల్ బెడ్ రూమ్ ఇల్లు అసంపూర్తిగా నిర్మాణం చేసి ఉన్నాయి వాటిని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఇల్ల నిర్మాణం పూర్తి చేసి పేదల కేటాయించాలని డిమాండ్ చేశారు. నగరంలో అనేక ప్రభుత్వ స్థలాలు ఖాళీగా ఉన్నాయని వాటిలో పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం) ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఆర్. వెంకటేష్, జోన్ కార్యదర్శి వర్గ సభ్యులు విమల, బాబు, జోన్ నాయకులు చారి, రోజా పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి మహిళలకు ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

- బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష
- రాజయ్య ఎడ్యుకేషనల్ సొసైటీ అండ్ ఫిట్ అండ్ ఫ్యూచర్ క్లబ్ ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్



**పెద్దపల్లి, మార్చి 01(జనంసాక్షి) :** నియోజకవర్గంలోని యువతకు మరియు మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడమే ధ్యేయంగా అడుగులు వేయాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో రీసెట్ సంస్థకు చెందిన ప్రీతి,ఉదయ్ తమ తండ్రి పీఈటి రాజయ్య గౌరవార్థం నూతనంగా నెలకొల్పిన రాజయ్య ఎడ్యుకేషనల్ సొసైటీ ఫర్ ఎగ్జామినేషన్ ట్రైనింగ్ సెంటర్ అండ్ ఫిట్ అండ్ ఫ్యూచర్ క్లబ్ ను ఆదివారం పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య,బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష,ఫిట్ అండ్ ఫ్యూచర్ క్లబ్ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మల్లయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు డిఫెన్స్, బ్యాంకింగ్,రైల్వే రిక్రూట్మెంట్ వంటి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు ఇటువంటి సంస్థలు ఎంతో దోహదపడతాయని,నిర్వాహకుల కృషిని అభినందించారు. అనంతరం బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా నియోజకవర్గంలోని ప్రతి ఇంటిని సందర్శించి క్షేత్రస్థాయి సమస్యలను తెలుసుకున్నానని పేర్కొన్నారు. పెద్దపల్లిలో నిజమైన మార్పు రావాలంటే మహిళలకు ఉపాధి కల్పించడం మరియు యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచడం అత్యంత కీలకమని ఆమె స్పష్టం చేశారు. కేవలం ప్రభుత్వాలపైనే ఆధారపడకుండా,యువతలో కూడా ఒక తపన,యూనిటీ ఉండాలని ఆమె ఆకాంక్షించారు. గతంలో తాము చేపట్టిన డేటా సైన్స్ ప్రోగ్రామ్ ద్వారా సాధించిన విజయాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. హైదరాబాద్ నుండి ప్రత్యేక నిపుణులను పిలిపించి శిక్షణ ఇవ్వడం ద్వారా,నెలకు 500 ట్యూషన్లు చెప్పుకునే ఒక సాధారణ ముస్లిం విద్యార్థిని నేడు ఏడాదికి రూ.5 లక్షల ప్యాకేజీ పొందే స్థాయికి ఎదిగిందని ఆమె వివరించారు. శిక్షణ పొందిన 120 మంది విద్యార్థులు నేడు ఎంఎన్‌సి కంపెనీలలో ఐటీ ఉద్యోగాలు సాధించడం గర్వకారణమని అన్నారు. యువత అవసరాలను బట్టి మూడు విభాగాల్లో శిక్షణ అందించాల్సిన అవసరం ఉందని ఆమె గుర్తించారు. ప్రభుత్వ ఉద్యోగాలు,ఐటీ రంగాలు,మరియు నాన్-ఐటీ,వ్యాపార రంగాలలో శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని వివరించారు. పెద్దపల్లిలోనే నిరంతరం ఇటువంటి శిక్షణలు అందేలా వివిధ ఎన్జీవోలు మరియు కంపెనీ సీఈఓలతో చర్చిస్తున్నామని,యువతను బిజినెస్ ఓనర్లుగా మార్చడమే తమ లక్ష్యమని ఉష వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫిట్ అండ్ ఫ్యూచర్ అధ్యక్షుడు మచ్చా రాహుల్, ఉపాధ్యక్షుడు కల్వల చరణ్,స్వచ్ఛంద సంస్థ రక్షణ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి సుజిత,ది లైబ్రరీ కంపెనీ సీఈఓ చంద్ర,సుల్తానాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్-ఇన్స్పెక్టర్ చిరంజీవి, ఆర్ఎఫ్ సీఎల్ హెచ్.ఆర్.సోమనాథ్, డాక్టర్ సురేందర్, మున్సిపల్ కౌన్సిలర్ కమల్, తోట ప్రణీత భూపతి, డేటా సైన్స్ పూర్వ విద్యార్థి రవికిరణ్, బీసీ జేఏసీ నాయకులు, యువకులు, పాల్గొన్నారు.

# ఉద్యమకారుల కృతజ్ఞత సభ విజయవంతం

- 600 మంది ఉద్యమకారుల భారీ ర్యాలీ
- ప్రభుత్వం వెంటనే 250 గజాల స్థలం ఇవ్వాలి
- భూమి ఇస్తామని పొన్నం ప్రభాకర్ హామీ



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమకారుల కృతజ్ఞత సభ విజయవంతమైంది. అమరవీరుల స్థూపం నుంచి కలెక్టరేట్ సమీపంలోని ఫిలిం భవన్ వరకు 600 మంది ఉద్యమకారులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫిలిం భవన్‌లో నగర అధ్యక్షుడు గోడిసెల రమేష్ గౌడ్ అధ్యక్షతన సభ జరిగింది.

రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నిజామాబాద్ సభలో బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉద్యమకారులకు 250 గజాల భూమి ఇస్తామని చెప్పడం ఉద్యమకారులకు ఎంతో ఆనందం కలిగించిందన్నారు. హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై ప్రభుత్వానికి ఎనిమిది వారాల్లో కమిటీ వేసి భూమి ఇవ్వాలని తెలపడం శుభసూచికమని పేర్కొన్నారు. ఉద్యమకారులందరికీ గుర్తింపు కార్డులు, పెన్షన్లు రూ.25 వేలు, హెల్త్ కార్డులు, ఫ్రీ బస్సు సౌకర్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ఎనిమిది సంవత్సరాలుగా తెలంగాణ జిల్లాలన్నీ తిరిగి ఉద్యమకారులను ఏకం చేశామని, ప్రభుత్వం వెంటనే 250 గజాల స్థలం ఇవ్వాలని కోరారు. నగర అధ్యక్షుడు గోడిసెల రమేష్ గౌడ్ మాట్లాడుతూ సభను విజయవంతం చేసిన ఉద్యమకారులందరికీ ఉద్యమాభివందనాలు తెలిపారు. కలిసికట్టుగా ఉంటే ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన హామీలు అమలవుతాయని, ఆ దిశగా ముందుకు సాగుతామని అన్నారు.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షులు రామరాజు రామారావు, రాష్ట్ర కార్యదర్శి దయ్యాల ఓం ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం లింగమూర్తి, ఊకంటి ఓంకార్, నగర కార్యదర్శి పెద్దపల్లి మధుసూదన్, నగర ఉపాధ్యక్షులు లింగంపల్లి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కేంసారం సమ్మయ్య, నగర ఉపాధ్యక్షులు కోరెపు సుధాకర్, జిల్లా కార్యదర్శి ఈసంపల్లి మదనయ్య, నగర సహాయక కార్యదర్శి పల్లె నారాయణ గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి మంద వెంకన్న గౌడ్, నగర ప్రచార కార్యదర్శి వడ్నాల రాజు, జిల్లా కార్యదర్శి గడపల కోటేష్, జిల్లా కార్యదర్శి కానవేని సతీష్ కుమార్, నగర ఉపాధ్యక్షులు వంగ వెంకటేశ్వర్లు, జిల్లా వైస్ చైర్మన్ కలర్ సత్తన్న, జిల్లా ఉపాధ్యక్షులు గడప నాగరాజు, జిల్లా వైస్ చైర్మన్ కోల అన్నా రెడ్డి, నగర మహిళా అధ్యక్షురాలు కొమ్మిడి తిరుమల రెడ్డి, నగర మహిళా ఉపాధ్యక్షురాలు గుజ్జుల పద్మా రెడ్డి, పెద్దపల్లి జిల్లా మహిళా వైస్ ప్రెసిడెంట్ జ్యోతి తాకూర్, దూలం రాధికా గౌడ్ తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.

# 48 గంటల దాటుతున్న నేటికీ నిందితులను అరెస్ట్ చెయ్యలేదు

- ఎస్సీ ఎస్టీ, బీసీ జెఎస్సి చైర్మన్ విశారదన్ మహరాజ్
- ప్రజా పాలనలో మానవీయత లోపించింది
- గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ జివి సూర్య కిరణ్



**ముషీరాబాద్, మార్చ్ 01 (జనం సాక్షి):** డీజీపీకి అన్ని వివరాలను చెప్పి 48 గంటలు దాటుతున్న నేటికీ నిందితులను అరెస్ట్ చెయ్యలేదని ఎస్సీ ఎస్టీ, బీసీ జె ఎస్ సి చైర్మన్ విశారదన్ మహరాజ్ అన్నారు. నాగర్ కర్నూల్ కుమ్మెర బాధితులపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలపై సమాధానంగా బాగ్లింగంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో విశారదన్ మహరాజ్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ జివి సూర్య కిరణ్, డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్, పాలమూరు యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర అధిపతి ప్రొఫెసర్ కుమారస్వామి, ప్రొఫెసర్ రాజు నాయక్, రజక సంఘం నాయకులు అభయ్ దుర్గయ్య, బాధితులు మౌనిక గణేష్ చంద్రకళ కీర్తి, మహేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా విశారధన్ మహరాజ్ మాట్లాడుతూ. బాధిత కుటుంబం అంతా కులాంతర్యాలు చేస్తుకన్నారని వివరించారు. పసిపాప తల్లి మౌనిక వంశధార బీసీ గ్రూపులో పుట్టినప్పటికీ మాదిగా కులంలో పెరిగినందున తను మాదిగ అని ప్రకటించుకుంటుందని అందువల్ల ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు వర్తిస్తుందని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాలు సైతం ఉన్నాయని గుర్తు చేశారు. అదేవిధంగా బాధిత కుటుంబంలో పెద్ద కోడలు మహేశ్వరి మాల అబ్బాయిని కులాంతర వివాహం చేస్తుందని వివరించారు. బాధితురాలు కీర్తి సైతం ఎస్సీ అబ్బాయిని వివాహం చేసుకుందన్నారు. కుటుంబం చేయని విధంగా ఈ కుటుంబంలో కులాంతర వివాహాలు చేసుకోవడమే క్యారెక్టర్ లేకపోవడం అని ప్రశ్నించారు. చాకలి కులానికి చెందిన ఎమ్మెల్యే వీర్నపల్లి శంకర్ రెడ్డి గా మారిపోయి నిందితుల పక్షాన చేరడం సిగ్గుచేటు అన్నారు. డీజీపీకి అన్ని వివరాలను చెప్పి 48 గంటల దాటుతున్న నేటికీ నిందితులను అరెస్ట్ చేయలేదని వారిపై హత్య నేరం కింద కేసు నమోదు చేయలేదని విమర్శించారు. ఖమ్మంలో పేదల ఇండ్లను కూల్చడం తగదన్నారు. గద్దర్ ఫౌండేషన్‌కు స్థలం ఇస్తా అని చెప్పి ముఖ్యమంత్రి మాట తప్పడం తగదన్నారు. దళితుడు డిప్యూటీ సీఎం ఉన్నప్పటికీ దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మీ ఇంట్లో పెళ్లి, బాధితుల ఇంట్లో చావు అవుతుందన్నారు. బాధితులను పరామర్శించి మీ ఇంటి పెళ్ళికి ఆహ్వానించాలని బట్టి విక్రమార్కకు విశారదన్ సూచించారు. గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాప కార్యదర్శి సూర్య కిరణ్ మాట్లాడుతూ. ప్రజా పాలనలో మానవీయత లోపించిందని ఆరోపించారు. చిన్న పాపను నిందితులు హత్య చేయగా కుటుంబాన్ని ప్రభుత్వము క్యారెక్టర్ లెస్ అని మరోసారి హత్య చేసిందని విమర్శించారు. డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ మాట్లాడుతూ. రాజ్యాంగాన్ని రక్షిస్తామని దేశమంతా తిరుగుతున్న రాహుల్ గాంధీ తెలంగాణకు వస్తున్నందున ముందుగా ఈ బాధిత కుటుంబాన్ని పరామర్శించాలని డిమాండ్ చేశారు కుటుంబానికి రక్షణ కల్పించాలని ఎస్సీ ఎస్టీ కమిషన్ ఆదేశించినప్పటికీ రక్షణ కల్పించకపోవడం సిగ్గుచేటు

*హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ దగ్గర గచ్చిబౌలి పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. నానక్‌రామ్‌గూడలోని యూఎస్ కాన్సులేట్ వద్ద భారీగా బలగాలను మోహరించారు. ఖమేనీ మృతిని నిరసిస్తూ నిరసన ర్యాలీలు జరిగే అవకాశం ఉందన్న నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యగా కాన్సులేట్ పరిసరాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు.*

### గ్రామ పంచాయతీ కార్మికులకు

# జీతం తక్కువ.. పని ఎక్కువ

- దుద్యాల మండలంలో 5 నెలలుగా వేతనాలు రాక
- అప్పులు చేసి కుటుంబాలు నడిపిస్తున్న వైనం
- ప్రభుత్వం వెంటనే స్పందించాలి: కార్మికుల ఆవేదన



**దుద్యాల, మార్చి 01(జనంసాక్షి):** మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థలో తొలి మెట్టు అయిన గ్రామ పంచాయతీ లకు నిధుల కొరత వేధిస్తోంది. దుద్యాల మండలంలో గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఏకంగా 5 నెలలుగా జీతాలు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నామని వాపోతున్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్రామాల్లో రోడ్లు ఊడ్చడం, మురుగు కాలువలు శుభ్రం చేయడం, పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. ఐదు నెలలుగా జీతాలు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను నడిపిస్తున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "ప్రభుత్వం వెంటనే స్పందించి మా జీతాలు చెల్లించాలి" అంటూ కావలి శ్రీనివాస్ (లగచర్ల) మాట్లాడారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికులు ఎలా జీవిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే జీతాల చెల్లింపు చేపట్టాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

# బహిరంగ మద్యపానంపై నిషేధాజ్ఞలు కొనసాగింపు

- డ్రోన్లు, డీజే సౌండ్స్‌పై కఠిన చర్యలు
- రామగుండం కమిషనరేట్‌లో సిటీ పోలీస్ యాక్ట్ అమలు
- ప్రజల భద్రతకు ప్రాధాన్యం: కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**గోదావరిఖని, మార్చి 01(జనంసాక్షి):** సాధారణ పౌరులు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి కొందరు వ్యక్తులు అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నారనే పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మద్యం మత్తులో వీధులు, రోడ్లపై అసభ్య పదజాలంతో ప్రవర్తించడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని, ప్రజల భద్రత దృష్ట్యా ఈ నిషేధాజ్ఞలు విధించినట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు మార్చి 1 నుంచి ఏప్రిల్ 1 వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 223, హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**డీజే, డ్రోన్లపై నిషేధాజ్ఞల పొడిగింపు**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో డీజే సౌండ్స్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగించినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా మరియు శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు భారీ శబ్దంతో కూడిన డీజే సౌండ్స్ వినియోగంపై నిషేధం విధించినట్లు పేర్కొన్నారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ కోసం డీజే సౌండ్స్ వినియోగిస్తున్నట్లు గమనించామని తెలిపారు. అయితే కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ అవసరమైతే సంబంధిత డివిజన్ ఏసీపీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ నిషేధాజ్ఞలు కూడా మార్చి 1 నుంచి ఏప్రిల్ 1 వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 223, హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సిటీ పోలీస్ యాక్ట్ అమలు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో రామగుండం పోలీస్ కమిషనరేట్ యాక్ట్ 2016లోని సెక్షన్ 7(1), సెక్షన్ 22(1)(ఏ) నుండి (ఎఫ్), సెక్షన్ 22(2)(ఏ), (బీ), సెక్షన్ 22(3), సిటీ పోలీస్ యాక్ట్ 1348 నం. 11 ఫసలీ, సెక్షన్ 30, పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం మార్చి 1 ఉదయం 6 గంటల నుంచి ఏప్రిల్ 1 ఉదయం 6 గంట ల వరకు అమల్లో ఉంటుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కాలంలో ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీస్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. బండ్‌ల పేరిట సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయించేందుకు ఒత్తిడి చేయడం లేదా బెదిరింపులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు.



## విజయవంతంగా ముగిసిన ప్రొడక్షన్ -డే

**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి ఆర్జి.వన్ ఏరియా జీడికే-1వ గనిలో నిర్వహించిన ప్రొడక్షన్ డే విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఉద్యోగులందరూ అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తూ 806 టన్నుల ఉత్పత్తి, 736 టన్నుల డిస్పాచ్ సాధించి, 1.2 ఓఎంఎస్ సాధించారు. ఇటీవల సంవత్సరాల్లో ఇదే అత్యధిక రికార్డుగా నిలిచింది. ఒకరోజు నిర్దేశించిన లక్ష్యం 656 టన్నులు కాగా, లక్ష్యాన్ని మించి ఈ విజయాన్ని సాధించడం గని సిబ్బంది సమిష్టి కృషికి నిదర్శనంగా నిలిచింది. ఈ గొప్ప విజయానికి జనరల్ మేనేజర్ ఆర్జీవన్ డి. లలిత్ కుమార్ ప్రత్యేకంగా ఏజెంట్ యల్. రమేష్, మేనేజర్ జప్లవార్ సుధీర్, గని అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు, యూనియన్ ప్రతినిధులను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో మరింత ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు.



## మున్సిపల్ అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరపాలి

**ఆర్మూర్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** ఆర్మూర్ మున్సిపల్ లో 500 కోట్ల అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించాలంటూ బిజెపి ఫోరం కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ పాలకవర్గం సాధారణ సర్వసభ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బిజెపి ఏడవ వార్డు కౌన్సిలర్ కాందేశ్ ప్రశాంత్ మాట్లాడుతూ గత పాలకవర్గంలో మున్సిపల్ అవినీతి అక్రమాలకు తెరలేపిందన్నారు. సోషల్ మీడియాలో 500 కోట్ల అవినీతి అక్రమాలు జరగాయంటూ విస్తృత ప్రచారం జరుగుతుందన్నారుఈ విషయమే విజిలెన్స్ అధికారులు లోతుగా విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో 8 కౌన్సిలర్ల వార్డులలో కోతులు, కుక్కల బెడద తీర్చాలని మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చామన్నారు. ఈ విషయాలపై మున్సిపల్ చైర్మన్ గోనె లహరి రఘు, సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారన్నారు.

# బావిలో పడి వివాహిత మృతి



**తలకొండపల్లి మార్చి 01(జనంసాక్షి):** మండల పరిధిలోని హర్య నాయక్ తాండ గ్రామానికి చెందిన ఇస్లావత్ లలిత(34) అనుమానాస్పదం గా మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. గత మూడు రోజుల క్రితం ఆసుపత్రికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన ఆమె ఆదివారం బావిలో శవమై తేలింది. తలకొండపల్లి ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..హర్యా నాయక్ తాండకు చెందిన ఇస్లావత్ లలిత(34)కి జాన్య తో 20 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి సంతానం కలగలేదు. లలిత కి గత కొన్ని సంవత్సరాలు నుంచి ఆరోగ్యం బాగోలేదని,అప్పుడప్పుడు భార్య భర్తలు ఇద్దరూ గొడవ పడుతుండేవారని తెలిపారు. శుక్రవారం ఆసుపత్రికి వెళుతున్నానని చెప్పి సాయంత్రం వరకు ఇంటికి రాక పోవడంతో ఊరిలో చుట్టుపక్కల వెతికారు. బంధువులకు సమాచారం ఇచ్చి వెతకగా ఎక్కడ కనిపించలేదని తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో గ్రామ పరిధిలోని వ్యవసాయ పొలంలో వెతుకుతుండగా జగతయ్య పొలం నందు గల బావిలో లలిత శవమై కనిపించిందని సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. మృతురాలి తల్లి బిచాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ తెలిపారు.




## మల్లోజుల వేణుగోపాలరావు స్వగ్రామానికి చేరుకున్నారు

### 45 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ బాట తర్వాత ఇంటికి తిరిగి రాక

**పెద్దపల్లి, మార్చి 01 (జనంసాక్షి):** నాలుగు దశాబ్దాల తర్వాత మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు మల్లోజుల వేణుగోపాలరావు తన సొంత ఊరు, సొంత గూటికి చేరుకున్నారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తన ఇంటికి భార్య తారతో కలిసి వచ్చారు. సోదరుడు అంజయ్యతో పాటు కుటుంబ సభ్యులు మల్లోజులను ఆప్యాయంగా పలకరించి ఆలింగనం చేసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పెద్దపల్లిలో విద్యాభ్యాసం చేస్తూ అప్పటి ఆర్ఎస్ఎస్ విద్యార్థి సంఘంలో క్రియాశీలక పాత్ర పోషించిన మల్లోజుల వేణుగోపాలరావు విద్యార్థి దశలోనే ఉద్యమాల్లో చేరారు. 1980లో సొంత ఊరు, కుటుంబ సభ్యులను విడిచి ఉద్యమ బాట పట్టారు. గత నాలుగేళ్ల క్రితం మాతృమూర్తి మల్లోజుల మధురమ్మ మరణ వార్త విని "అమ్మా నేను రాలేను.. క్షమించు" అని ఉత్తరం రాసి పంపారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులు అడవి బాట వీడి జనజీవనంలోకి రావాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో మల్లోజుల వేణుగోపాలరావు ఆయుధాలు వదిలి లొంగిపోయారు. సుదీర్ఘ విరామం తర్వాత స్వగ్రామానికి రావడంతో పెద్దపల్లి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

# పట్నం రాజేందర్ రెడ్డి 38 వర్ధంతి



**షాబాద్, మార్చి 01(జనం సాక్షి):** దివంగత నేత పట్నం రాజేందర్ రెడ్డి 38వ వర్ధంతి సందర్భంగా షాబాద్ పిఆర్ఆర్ఎం కళాశాలలో, గొల్లూరు గూడ స్వగ్రామంలో, ముదేశీ గూడా చౌరస్తాలో, షాబాద్ పిఆర్ఆర్ఎం స్టేడియంలో గల ఆయన విగ్రహాలకు ప్రభుత్వ చీఫ్ వీపు పట్నం మహేందర్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, షాబాద్ మాజీ జెడ్పిటిసి సభ్యులు పట్నం అవినాష్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... రాజేందర్ రెడ్డి పేద ప్రజల అభ్యున్నతకు పాటుపడేవాడని వారి ఆశయ సాధనకు కృషి చేస్తామని అన్నారు. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... షాబాద్ కు రోడ్లు, కరెంటు లాంటి వసతుల కల్పనకు రాజేందర్ రెడ్డి కృషి ఎంతో గొప్పదని అన్నారు. పట్నం అవినాష్ రెడ్డి మాట్లాడుతూ... మా నాన్నగారు చూపిన బాటలో నేను నడుస్తానని తెలుపుతూ ప్రతి నిత్యం ప్రజా సంక్షేమ కోసం పాటుపడతానని అన్నారు. అనంతరం గత వారం రోజులపాటు నిర్వహించిన పట్నం రాజేందర్ రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో 8 జట్లు తెలపడగా ఫైనల్లో విజేతగా నిలిచిన షాబాద్ జట్టుకు 2 లక్షల రూపాయల నగదు బహుమతి, రెండవ స్థానంలో నిలిచిన చేవెళ్ల జట్టుకు లక్ష రూపాయల నగదు బహుమతి ట్రోఫీలను అందించారు. వాలీబాల్ లో 14 జట్లు తెలపడగా మొదటి బహుమతిగా మొయినాబాద్ జట్టు కు 50,000 నగదు బహుమతి, రెండవ బహుమతి సాధించిన షాబాద్ పిఆర్ఆర్ఎం జట్టుకు 25 వేల నగదు బహుమతి ట్రోఫీలను, ప్రభుత్వ చీఫ్ వి పట్నం మహేందర్ రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో నూతన సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రాజేందర్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.



## మల్లికార్జునస్వామి ఆశీస్సులు రామగుండం ప్రజలపై ఉండాలి

**రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**

గోదావరిఖని, జనంసాక్షి : మల్లికార్జునస్వామి ఆశీస్సులు రామగుండం ప్రజలపై ఉండాలనీ రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీ.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. అదివారం అంతర్గాం మండలం మట ర్మార్ కోమురన్న జాతర శ్రీ మల్లికార్జున స్వామి వారి విగ్రహాల ప్రతిష్టాపన లో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఎటా ఎంతో ఘనంగా నిర్వహించే మట్టర్మార్ కోమురన్న జాతరకు ఒక ప్రత్యేకత ఉందన్నారు. మల్లికార్జున స్వామి వారి దేవాలయం నిర్మాణం చేయడం సంతోషకరమన్నారు.

## ఆకట్టుకున్నపారమిత ఎక్స్‌ప్లోరికా "కిడ్, ఎడ్‌టాక్"

- పారమిత పాఠశాలల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాద రావు

**కరీంనగర్, మార్చి 01 (జనంసాక్షి) :** స్థానిక నగరంలోని మహాలక్ష్మి కన్వెన్షన్ హాల్ లో "కిడ్,ఎడ్ టాక్" కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, పారమిత పాఠశాలల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాద రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కరీంనగర్‌లో యువ మనసులను ప్రేరేపించే, ఆలోచనాత్మక మైన కార్యక్రమం "కిడ్, ఎడ్ టాక్" ఎక్స్‌ప్లోరికా సంస్థ ఆధ్వర్యంలో విజయవ ంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం సమగ్రవిద్య ప్రాముఖ్యత, నైపుణ్యాభివృద్ధి, చిన్ననాటి నుంచే పిల్లల ప్రతిభను పెంపొందించే అవసరం పై అవగాహన కల్పించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.

కార్యక్రమాన్ని ఉద్దేశించి కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడు తూ... విద్యార్థుల్లో సృజనాత్మకత, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసా న్ని ప్రోత్సహించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు విద్యార్థులను సిద్ధం చేయాలంటే విద్య అకాడమిక్ పరిమితు ల్లోనే కాకుండా వ్యక్తిత్వ వికాసంపై కూడా దృష్టి పెట్టాలని ఆయన సూచించా రు. "కిడ్, ఎడ్ టాక్" కార్యక్రమం ద్వారా విద్యార్థులు తమ ఆలోచనలను ధైర్యంగా వ్యక్తపరచడానికి, తమ ప్రతిభను ప్రదర్శించడానికి, విద్య, ఆవిష్కరణలు, వ్యక్తిగత అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించడానికి



మంచి వేదికను అవుతుందని ఆశాభావం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా పారమిత పాఠశాలల అధినేత డా.ఇనుగంటి ప్రసాదరావు మాట్లాడుతూ... పారమిత ఎక్స్‌ప్లోరికా సంస్థ భవిష్యత్తులో ఇలాంటి అద్భుత కార్యక్రమాలను నిర్వహిస్తూ, తదుపరి తరం విద్యార్థులను ప్రేరేపించి, విద్యాబోధనతో పాటు శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉందని సంతోషం వ్యక్తం చేస్తూ "కిడ్, ఎడ్ టాక్" కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారు లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, రాకేశ్, ప్రాచీ, వి.యు.ఎం. ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, కవిత ప్రసాద్, శ్రీకర్, శర్మిష్ట, గోపీకృష్ణ, సమన్వయ కర్తలు, ఉపాధ్యాయిని, ఉ పాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## కామారెడ్డి మున్సిపాలిటీ ఉద్యోగి కంటతడి

### అవమానపరిచిన చైర్మన్ భర్తపై ఆగ్రహం

- ఏకగ్రీవంగా క్షమాపణ చెప్పాలి.. లేకపోతే ఆందోళన
- సీఎం, రాష్ట్ర మున్సిపల్ కమిషనర్‌కు లేఖలు
- కార్మికుల బకాయిలు, పని భారం తగ్గించాలని సిపీఐ, ఏఐటీయూసీ డిమాండ్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 01 (జనంసాక్షి) :** కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఒక మహిళా ఉద్యోగిని కంటతడి పెట్టించి, అందరి ముందు అవమానపరిచిన మున్సిపల్ చైర్మన్ భర్త ఇప్ప శ్రీనివాస్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపీఐ), ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆయన బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరించారు. సిపీఐ జిల్లా కార్యదర్శి ఎల్. దశరథ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి. బాలరాజ్, జిల్లా అధ్యక్షులు గౌర్రె బాలరాజ్, శ్రీనివాస్, ఆనంద్ తదితరులు సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మున్సిపల్ కమిషనర్‌కు లేఖలు రాశారు. అదే విధంగా అసెంబ్లీ ప్రతిపక్ష నేత, సిపీఐ ఎమ్మెల్యే సాంబశివరావుకు కూడా ఉత్తరం పంపారు. రాత్రి 7:30 నుంచి 8 గంటల వరకు మహిళను చూడకుండా పనిచేయాలని బలవంతం చేయడం, అందరి ముందు అవమానించడం తీవ్రంగా ఖండించారు. మున్సిపల్‌లో భార్య చైర్మన్‌గా ఉంటే భర్తల ఆధిపత్యం తరతరాలుగా కొనసాగుతోందని, కౌన్సిలర్ల భర్తలకు రాజ్యాంగ ప్రకారం ఎలాంటి హక్కు లేదని, ఇప్ప శ్రీనివాస్ తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. కమీషనర్ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఉద్యోగులను బెదిరించడానికి ఆయనకు ఎలాంటి అర్హత లేదని విమర్శించారు. జనవరి, ఫిబ్రవరి వేతనాల బకాయిలు వెంటనే చెల్లిం చాలి, కార్మికుల వార్డుల్లో పని భారం తగ్గించాలని కూడా డిమాండ్ చేశారు. ఇప్పటికైనా చర్య తీసుకోక పోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని సిపీఐ, ఏఐటీయూసీ జిల్లా నాయకత్వం హెచ్చరించింది.

## బీసీ యువజన సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులుగా వడ్డే వరుణ్



**ముషీరాబాద్,మార్చ్ 01 (జనం సాక్షి):** బీసీ యువజన సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులుగా వడ్డే వరుణ్ ను ఎంపీ ఆర్ కృష్ణయ్య నియమించారు. ఈ మేరకు విద్యానగర్ బిసి భవన్ లో ఆర్ కృష్ణయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రాగ అరుణ్ కుమార్ చేతుల మీదగా నియామక పత్రాన్ని వాడ్డే వరుణ్ అందుకున్నారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో యువజ న సంఘం గ్రేట్ హైదరాబాద్ అధ్యక్షులుగా నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ ప్రజాపతి పాల్గొన్నారు.



## పాలకులు మరిచారా లేక అధికారుల నిర్లక్ష్యమా?

- ఇండ్ల మధ్యన పారుతున్న మురుగు నీరు
- మురుగు నీటి దుర్గంధంతో ప్రజల ఇబ్బందులు

**యాచారం, మార్చి 1 (జనం సాక్షి) :** అధికారులు చూడటం లేదో,లేక ప్రజాప్రతినిధులు ఎన్నికల్లో ఇచ్చిన మాటలను మరిచారో ఏమో గానీ ఏటోచ్చి గ్రామాలలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా రనే దాంట్లో ఎలాంటి సందేహం లేదు.యాచారం మండలం పరిధిలోని నందివనపర్తి గ్రామంలో మేడిపల్లి వెళ్లే రహదారిలో ఇండ్ల మధ్యలో మురుగు నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతుంది.ఈ డ్రైనేజీ కాలువలో మురుగునీరు ప్రవహించే మార్గం లేక డ్రైనేజీ కాలువ నుంచి వెదజల్లే దుర్గంధం కారణంగా ఎప్పుడు ఎలాంటి రోగాల బారిన పడాల్సి వస్తుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.గ్రామంలో నివసించే ప్రజలు ఇళ్ల ముందు కాలువల్లో మురుగు నీరు ఉన్నప్పటికీ తమ తలరాత ఇంతేనని గడుపుతూ వస్తున్నారు.గత ఎన్నికల్లో ఎన్నికైనా ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలను పరిష్కారం చూపడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మురుగు నీరు నిల్వ ఉండకుండా వెళ్లే మార్గం దిశగా చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు, ప్రజలు కోరుతున్నారు.

## చిరస్మరణీయుడు.. శ్రీపాద రావు!

- మంథని ప్రజల గుండెల్లో చెరగని ముద్ర
- శిల్పకళా వేదికలో ఈరోజు 89వ జయంతి వేడుకలు
- సీఎం రేవంత్, కేంద్ర మంత్రులు కుమార స్వామి, కిషన్ రెడ్డి హాజరు

**మంథని, మార్చి 01 (జనం సాక్షి) :**

అడవుల్లో నడకదారి కూడా కష్టంగా ఉన్న సమయంలో రోడ్లు నిర్మించి, ప్రభుత్వ భూము లు పేదలకు పంచి, ప్రజల గుండెల్లో గూడు తెచ్చిన మహానాయ కుడు... ప్రత్యర్థులు సైతం నమస్కరించేంత అభిమానం సంపాదించుకున్న మంచి మనిషి -- మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు. రేపు (మార్చి 2) ఆయన 89వ జయంతి వేడుకలను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహి స్తోంది. సీఎం ఎ. రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రు లు డి. కుమార స్వామి, జి. కిషన్ రెడ్డి తదితర ముఖ్య నేతలు, రాష్ట్ర మంత్రులు, శ్రీపాదరావు కుటుంబ సభ్యులు పాల్గొననున్నారు. 1935 మార్చి 2న ధన్వాడలో జన్మించిన శ్రీపాదరావు సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, మంథని నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా, స్పీకర్‌గా ప్రజల మనసు గెలిచారు. 1999 ఏప్రిల్ 13న నక్సలైట్ల తూటాలకు బలయ్యారు. ఆయన కుమారుడు శ్రీధర్ బాబు ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా, మరో కుమారుడు శ్రీనుబాబు టీపీ సీసీ ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్నారు.

## శేరిలింగంపల్లి చెరువుల పునరుజ్జీవనం





- స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమల సహకారం అభినందనీయం
- 64 చెరువుల అభివృద్ధికి అరికెపూడి గాంధీ భరోసా
- నాయనమ్మ కుంట చెరువు సుందరీకరణ ప్రారంభం
- పర్యావరణ పురోగతికి భాగస్వామ్య ప్రయత్నాలు
- మల్లిగవాడ్ ఫౌండేషన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు కృతజ్ఞత

**శేరిలింగంపల్లి, మార్చి 01 (జనం సాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చెరువులను సుందర శోభిత మంచినీటి వనరులుగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ స్పష్టం చేశారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని గురునాథం చెరువు, పటేల్ చెరువు, మక్త మహబూబ్ పేట్ పెద్ద కుడి చెరువు, రామసముద్రం కుంట చెరువు, నాయనమ్మ కుంట చెరువులతో పాటు మొత్తం 64 చెరువులను అన్ని రంగాల్లో ఘనంగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

మియాపూర్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని నాయనమ్మ కుంట చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పథకం కింద మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందం గా చేపట్టిన చెరువు పునరుజ్జీవన కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రతినిధులతో కలిసి అరికెపూడి గాంధీ చెరువును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అరికెపూడి గాంధీ చెరువుల సుందరీకరణతో స్వచ్ఛమైన వర్షపు జల సిరులను ఒడిసి పడతామ ని, చెరువుల జలకళతో గ్రామీణ వాతావరణం నెలకొల్పడమే తన ధ్యేయమని తెలిపారు. చెరువుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, చెరువులను దత్తత తీసుకుని అభివృద్ధి చేసేవారు దైవంతో సమానమని వివరించారు. చెరువులలో నీరు నిల్వ ఉండటం వల్ల జీవ వైవిధ్యం పెరుగుతుందని, పక్షుల వలసలు పెరిగి ప్రకృతి సంపద మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

నాయనమ్మ కుంట చెరువు పునరుద్ధరణ ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం మధ్య భాగస్వామ్య ప్రయత్నాలకు ఉదాహరణ అని అభివర్ణించారు. చెరువు అభివృద్ధి తర్వాత పరిసర ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన ఆహ్లాదకర వాతావరణం లభిస్తుందని, సుజల జలంతో అపురూప దృశ్య కావ్యంగా గోచరిస్తుందన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సిఎస్ఆర్ నిధులతో మల్లిగవాడ్ ఫౌండేషన్ చేపట్టిన సుందరీకరణ పనులు దిగ్విజయంగా పూర్తి చేయడం హర్షణీయమని, సమాజ హితం కోసం స్వచ్ఛందంగా ముందుకు రావడం ఆహ్వానించదగ్గ పరిణామమని అన్నారు. లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్‌ను, ఆయన బృందాన్ని హృదయపూర్వకంగా అభినందించారు.

నాయనమ్మ కుంట చెరువు పునరుద్ధరణలో చెరువుకట్ట పటిష్టీకరణ, మురుగునీరు కలవకుండా కాల్వ నిర్మాణం, అలుగు మరమ్మతులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులను సమగ్రంగా చేపడతామని తెలిపారు. అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా సంస్థ సీఐ బాలగోపాల్, హెచ్‌డీఎఫ్ సీ బ్యాంకు ప్రతినిధులు చటర్జీ, రవివర్మ, సిఎస్ఆర్ ఐటీ సంస్థ ప్రతినిధులు చైతన్య, రాము, నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ 2026 జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఆల్ఫోర్స్ విద్యార్థినులు

**ఆల్ఫోర్స్ మహిళ డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ వి. రవీందర్ రెడ్డి**



**కరీంనగర్ బ్యూరో, మార్చి 01 (జనంసాక్షి) :** శనివారం రోజున కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కాలేజీ ఆధ్వర్యంలో 50 సంవత్సరాల అత్యవసర పరిస్థితి నేర్చుకోవాల్సిన పాఠాలు అనే అంశంపై నిర్వహించి న వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2026 జిల్లా స్థాయి ఉ పన్యాస పోటీలలో అల్ఫోర్స్ మహిళ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు విశిష్ట ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ఆల్ఫోర్స్ డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ రవీందర్ రెడ్డి తెలిపారు. శనివారం రోజు కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆల్ఫోర్స్ మహిళ డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ వి. రవీందర్ రెడ్డి రాష్ట్ర స్థాయికి ఎంపికై న విద్యార్థినులను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ వి. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... జిల్లా స్థాయిలో ఎంపికైన ఐదుగురు లో ఇద్దరు మా కళాశాల విద్యార్థి నులే కావడం గర్వకారణమని, ఈ విజయంతో ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ , పీజీ కళాశాల మరోసారి తన ప్రతిష్ఠను నిలబెట్టుకుందని, రాష్ట్ర స్థాయి ఫైనల్ పోటీలలో కూడా విజయం సాధించి కళాశాలకు మరింత గౌరవం తీసుకురావాలని ఆకాంక్షిస్తూ తన శుభాకాంక్షలు తెలిపారు. ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల తమ విద్యార్థినుల ప్రతిభను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూ, దేశభక్తి, జాతీయ చైతన్యం, సామాజిక సేవా స్ఫూర్తిని పెంపొందించడంలో ముందంజలో ఉంటుందని పేర్కొన్నారు. ఇలాంటి వేదికలు విద్యార్థినులలో నాయకత్వ లక్షణాలు, వాక్చాతుర్యం, సామాజిక అవగాహనను పెంపొందిం చడానికి దోహదపడతాయని తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు కుమారి కీర్తి యాదవ్, కుమారి భూక్యా ప్రవల్లిక తో పాటు కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## విద్య అభివృద్ధికై బడ్జెట్ కేటాయింపులపై స్పష్టతనివ్వకపోవడం సిగ్గుచేటు

### పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు కంపాటి పృథ్వీ,ఎస్ అనిల్

**ముషీరాబాద్, మార్చ్ 01 (జనం సాక్షి):** విద్యాకమిషన్ ప్రవేశపెట్టిన నివేదికలో విద్య అభివృద్ధి కొరకు బడ్జెట్ కేటాయింపులపై స్పష్టతనివ్వకపోవడం సిగ్గుచేటని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణం గా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కంపాటి పృథ్వీ,ఎస్ అనిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం విద్యానగర్ మార్క్స్ భవన్ లోని రాష్ట్ర కార్యాలయంలో పిడిఎస్యు రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు రెండు రోజుల పాటు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. తెలంగాణ విద్యా కమిషన్ ఆకునూరి మురళి నేతృత్వంలో ప్రవేశపెట్టిన నివేదికలో గురుకుల, ప్రాథమిక విద్యా, ఉ న్నత విద్యా బాగుకోసం నిర్దిష్టమైన బడ్జెట్ కేటాయింపులపై స్పష్టత ఇవ్వకుండా పబ్లిక్ స్కూల్స్ పేరుతో ప్రజల ఆలోచనలను దారి మళ్లించడమే తప్ప బీద ప్రజల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం కోసం కృషి చేయడం లేదన్నారు. రాష్ట్రంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ నియామ కాలు చేపట్టక పోవడం, గురుకులాలకు సొంత భవనాలు లేక, గ్రామీణ పాఠశాల లకు పాత బిల్డింగ్ లలో బోధన కొనసాగుతున్నది దీని మూలాన వర్షాకాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, వీటిపైన విద్యాకమిషన్ సరైన దృష్టి కేంద్రీకరించడం లేదు అనేది స్పష్టం అవుతున్నది అని తెలిపారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు నాణ్యత ప్రమాణాలు పాటించ కుండా అడ్డగోలుగా నడుస్తున్నవాటిపై నివేదికలో పొందుపరచక పోవడం అంటే ప్రయివేటు, కార్పొరేట్ లకు వత్తాసు పలికే విధంగా ఉన్నది. విద్యా సంస్థల ఫీజుల దోపిడీపై ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని పిడిఎస్యు విద్యార్థి సంఘంగా అనేక పోరాటాలు నిర్వహిస్తున్నాం. ఫీజుల నియంత్రణ చట్టం అమలు చెయ్యాలి అని కమిషన్ ఇచ్చిన రిపోర్టును స్వాగతిస్తున్నాంమని, ఇది నివేదికల వరకు మాత్రమే పరిమితం కాకుండా పకడ్బందీగా అమలు జరపడం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం చెయ్యాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయా ల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలు పునరుద్ధరించాలని కోరారు. క్యాంపస్‌లలో పోలీసుల ప్రమేయాన్ని తగ్గించాలనీ, ప్రభుత్వాల వత్తిడి లేకుండా స్వయం ప్రతిపత్తి విద్యాసంస్థలుగా నడిపేందుకు స్వేచ్ఛ ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బి నర్సింహారావు, ఎస్ రాకేష్, బి దీక్షిత సహాయ కారుదర్శులు కె గణేష్, వెంకటేష్, శివకుమార్, వీరభద్రం, అజయ్ కోశాధికారి కుమార్ గర్ల్స్ కమిటీ కో కన్వీనర్ అనూష రాష్ట్ర కమిటీ సభ్యులు మారుతి, సీతారాం, మధు, నాగరాజు, ఆశూరు, హరీష్,వెంకటేష్, మహేష్ పాల్గొన్నారు.

## ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులేవి?

- హామీలిచ్చి మోసం చేయడంలో కేసీఆర్‌ను మించిపోయిన రేవంత్ రెడ్డి
- పంచాయతీ ఎన్నికలైన వెంటనే కేంద్రం గ్రామాలకు నిధులు మంజూరు చేసింది.
- ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీలకు రూ.10లక్షల ప్రోత్సహకం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**కరీంనగర్ బ్యూరో, మార్చి 01 (జనంసాక్షి) :**

బీజేపీ బలపర్చిన సర్పంచు అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకునే గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల ప్రోత్సహకాన్ని అందజేస్తా నంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గత పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన మాటను ఆదివారం రోజు నిలబెట్టుకున్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ అభ్యర్థులను సర్పంచులుగా ఎన్నుకున్న గన్నేరువరం మండలంలోని పీచుపల్లి, కోహెడ మండంలోని విజయనగర్ కాలనీ గ్రామ పంచాయతీలకు తన ఎంపీ లాడ్స్ నిధుల నుండి రూ.10 లక్షల చొప్పున ప్రోత్సహక నిధులు విడుదల చేశారు. ఆదివారం రోజు ఆ యా గ్రామ పంచాయతీలకు విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజ య్ గ్రామస్థుల సమక్షంలో ఆయా నిధుల సర్క్యులర్ కాపీలను గ్రామ సర్పంచులకు అందజేశారు. ఈ సందర్భంగా విజయనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడు తూ... భవిష్యత్తులో గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొస్తా, అభివృద్ధి చేస్తా, అయినా కొందరు బండి



సంజయ్ ఏం తెచ్చారంటూ విమర్శలు చేస్తున్నారు. వాటిని నేను పట్టించుకోను, ఎందుకంటే నా లక్ష్యం గ్రామాలను అభివృద్ధి చేయడమే ఎందుకంటే గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అని, వీటితోపాటు ప్రజల కోసం అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని పునరుద్ఘాటించారు. అనంతరం పీచుపల్లికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ గ్రామ పంచాయ తీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ సామ రాజిరెడ్డి, బీజేపీ స్థానిక నేతలకు తన ఎంపీ లాడ్స్ నుండి రూ.10 లక్షల ప్రోత్సాహక నిధుల సర్క్యులర్ కాపీని అందజేయడంతోపాటు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.

బీజేపీ బలపర్చిన సర్పంచు అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకునే గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల ప్రోత్సహకాన్ని అందజేస్తానని గత పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన మాటను నేను నిలబెట్టుకున్నా నని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీ లకు రూ.10 లక్షల చొప్పున ప్రోత్సాహక నగదు అందజేస్తానని ప్రకటించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 1203 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఒక్కో పంచాయతీకి 10 లక్షల చొప్పున మొత్తం 120 కోట్ల 30 లక్షల రూపాయలు ఇవ్వాలి. కానీ ఇంతవరకు నయాపైసా ఇయ్యలే అని తెలిపారు.

హామీలిచ్చి మోసం చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ సర్కార్ ను మించిపోయారని, కేసీఆర్ సైతం ఆనాడు ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీకి 5 నుండి 10 లక్షలదాకా ప్రోత్సాహక నగదు అందిస్తామని హామీ ఇస్తే, దాదాపు 2 వేలకుపైగటా గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు లేకుండా ఏకగ్రీవమయ్యాయి. కానీ చిల్లిగవ్వ ఇయ్యలే. ఈ రెండు పార్టీలు దొందూ దొందే అని ప్రోత్సాహక నిధులు ఎందుకు ఇవ్వడం లేదనే అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రజలను కోరుతున్నా అని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధికి చిల్లిగవ్వ ఇవ్వడంలేదని, మాజీ సర్పంచులు చేసిన పనులకు బిల్లులివ్వాలని తిరిగి తిరిగి ఆత్మహత్యలు చేసుకున్నా గత ప్రభుత్వం పట్టించుకోలే. ఈ ప్రభుత్వం అదే బాటలో నడుస్తోంది. బీజేపీ పోరాటాలకు, మాజీ సర్పంచుల ఆందోళనలకు తలొగ్గి వాయిదాల పద్ధతిలో పైసలిచ్చేందుకు ముందుకొచ్చింది. మాజీ సర్పంచుల బిల్లులు సరే, గ్రామ పంచాయతీల అభివృద్ధికి పైసలేవి? కేంద్రం ఇప్పటి వరకు పంచాయతీల అభివృద్ధి కోసం దశల వారీగా దాదాపు వెయ్యి కోట్లకుపైగా నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో అంతో ఇంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని, వీళ్లా గ్రామ స్వరాజ్యం గాంధీ ఆశయాల గురించి మాట్లాడేది? అని ఆ ప్రకటనలో విమర్శించారు.

## భూదాన భూముల్లోనే పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలి

- సరైన భోజనం వసతి సౌకర్యాలు కల్పించాలి
- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బి.వి. రాఘవులు లేఖ

**ముషీరాబాద్ మార్చి 01 (జనంసాక్షి) :** ఖమ్మం పట్టణంలో పేదల ఇండ్ల కూల్చివేత సమస్యపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని, బాధితులకు ప్రస్తుతం సరైన భోజనం, వసతి సౌకర్యాలు కల్పించాలని, అదే భూదాన భూముల్లో వారికి పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తూ సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు ముఖ్యమంత్రికి లేఖ రాశారు. ఫిబ్రవరి 28 ఆ ప్రాంత సందర్శనకు వెళ్ళాననీ, అది యుద్ధంలోనో, భారీ భూ కంపంలోనో నాశనమైన ట్లు బీభత్సంగా తలపిస్తుందన్నారు. ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉండి బుల్డోజర్ సంస్కృతిని వ్యతిరేకిస్తున్న మీరు, మీ ప్రభుత్వం.. పేదల పట్ల అమానుషంగా వ్యవహరించటం దారుణమైన విషయమన్నారు. వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలో గత 12 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్న సుమారు 700 మంది పేదల ఇండ్లు కూల్చివేశారనీ, పోలీసు, రెవెన్యూ సిబ్బంది కలిసి ఈ దుశ్చర్యకు పాల్పడ్డారనీ పేర్కొన్నారు. అవి భూదాన యజ్ఞ బోర్డుకు చెందిన భూములు, 2014 లోనే బోర్డు చైర్మన్ రాజేందర్‌రెడ్డి అక్కడి పేదలకు ఇంటి స్థలం కోసం 100 గజాల చొప్పున మంజూరు చేసినట్లు తెలిపారు. విలువైన భూములనే పేరుతో పేదలను అక్కడి నుండి తొలగించటం సరైంది కాదని భావిస్తున్నామన్నారు. వారికి తాత్కాలిక ఆశ్రయం కల్పించిన అంబేద్కర్ భవన్, టిటిడిసిలలో కూడా, సరైన వసతి, భోజన ఏర్పాట్లు, మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేదు. అక్కడ ఉన్నవారు అనారోగ్యం పాలౌతున్నట్లు కూడా చెప్పారు. వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని, ప్రస్తుతం సరైన భోజనం, వసతి సౌకర్యాలు కల్పించి, వారికి అదే భూదాన భూముల్లో పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతున్నానమన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
2 మార్చి 2026



# పాల ఉత్పత్తి గుజరాత్ మోడల్ ఆదర్శనీయం

- తెలంగాణలోనూ అనుసరించాలి
- రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

**అహ్మదాబాద్ (జనంసాక్షి) :** పాడి పరిశ్రమ అభివృద్ధి విధానాలను అధ్యయనం చేయడానికి రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి శాఖ మంత్రి వాకిటి శ్రీహరి బృందం గుజరాత్‌లో పర్యటించింది. ఆదివారం ఆనంద్‌లోని ప్రముఖ అమూల్ పాల ప్రాసెసింగ్ ప్లాంట్‌ను రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి కలిసి సందర్శించారు. అమూల్ ప్లాంట్ సందర్శనకు వచ్చిన మంత్రిబృందానికి నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ డాక్టర్ మీనేష్ షా బృందం ఘనస్వాగతం పలికింది. ఈ సందర్భంగా అమూల్ సంస్థలో అమలు చేస్తున్న ఆధునిక సాంకేతిక విధానాలు, రైతులకు అందిస్తున్న సేవలు, పాల సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్ , మార్కెటింగ్ వ్యవస్థలపై మంత్రి బృందానికి చైర్మన్ డాక్టర్ మీనేష్ షా వివరించారు. పాడి పరిశ్రమ ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించడం, సహకార వ్యవస్థను మరింత విస్తరించడం వంటి అంశాలపై గుజరాత్ అధికారులు పేర్కొన్నారు.

అమూల్ మోడల్ ప్రగతి పథంపై, దేశవ్యాప్తంగా సహకార డెయిరీ రంగ అభివృద్ధిలో పాత్ర గురించి తెలిపారు. అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, గుజరాత్‌లో అమూల్ మోడల్ ద్వారా సాధించిన విజయాలు తెలంగాణకు ప్రేరణగా నిలుస్తాయని అన్నారు. రాష్ట్రంలో పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసి, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో, మహిళల ఆర్థిక సాధికారతలో డెయిరీ రంగం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పాల ఉత్పత్తి పెంపు, ఆధునిక సాంకేతిక వినియోగం, సహకార వ్యవస్థ బలోపేతం, రైతులకు మెరుగైన ధరలు అందించే దిశగా గుజరాత్ అనుభవాలను తెలంగాణలో అమలు చేయనున్నట్లు తెలిపారు. అక్కడ గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పాల ఉత్పత్తి కేంద్రాల అభివృద్ధి ఆదర్శనీయమన్నారు. పాల ఉత్పత్తిలో గుజరాత్ మోడల్ తెలంగాణకు అవసరం అని, పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. రాష్ట్రాన్ని పాల ఉత్పత్తిలో నెంబర్‌వన్‌గా నిలిపేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు.

# రాంచందర్‌రావు అబద్ధాలు మానుకో

- సబర్మతి ప్రక్షాళన చేసినప్పుడు 10 వేల కుటుంబాలను తరలించారు
- అదే స్ఫూర్తితో మూసీ ప్రక్షాళన చేస్తాం
- ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి



**అహ్మదాబాద్ (జనంసాక్షి):** బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు అబద్ధాలు మానుకోవాలని, బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఒక నీతి తెలంగాణకు ఒక నీతా? అని ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. గుజరాత్ రాష్ట్రంలోని సబర్మతి రివర్ పరివాహక ప్రాంతాన్ని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, డైరీ డెవలప్మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, మదర్ పాల డైరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డిలు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, గుజరాత్‌లో సబర్మతి రివర్ 22 కిలోమీటర్లు ప్రక్షాళన జరిగిందని, సబర్మతి రివర్ కు ఎస్టీపీల నుంచి నర్మదా నది నుంచి వచ్చే నీళ్లను పంటలకు పంపిస్తున్నారన్నారు. హైదరాబాద్ నగరంలో మూసీ ప్రక్షాళన చేసి గోదావరి నీళ్లను తెచ్చి మూసీలో కలపాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని, సాగు, తాగు నీరు ఇవ్వాలనేది సీఎం సంకల్పమని ఎంపీ చామల చెప్పారు. సబర్మతి రివర్‌కు మూసీకు సంబంధం లేదని తెలంగాణ చీఫ్ రామచందర్ రావు అంటున్నారని, సబర్మతి రివర్ ప్రక్షాళనకు 2004 నుంచి 2014 వరకు పది వేల కుటుంబాలను తరలించినట్లు అధికారులు చెప్పారని అన్నారు. కానీ ఎవరిని తరలించలేదని రామచందర్ రావు అబద్ధాలు మాట్లాడుతున్నారని ఎంపీ చామల విమర్శించారు. మూసీ నదిని ప్రక్షాళనను చేసుకోవద్దా? ఆ మురికి కూపం లోనే బ్రతుకుదామా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి మూసీ ప్రక్షాళన చేస్తే ఎప్పటికీ సీఎంగా ఉంటారని భయపడి బీఆర్ఎస్, బీజేపీలు వ్యతిరేకిస్తున్నారని ఆయన ఆరోపించారు. హరీశ్‌రావు, రామచందర్ రావులు సబర్మతి రివర్‌ను చూసి మాట్లాడాలని, ఇక్కడి అధికారులతో మాట్లాడి వాస్తవాలు తెలుసుకోవాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సూచించారు.

## ప్రయివేటు ఆస్పత్రుల్లో ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు

# ఉచిత వైద్యం అందించాలి

- బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రైవేటు దవాఖానలు సమాజ సేవలో భాగంగా ఉచితంగా వైద్యం అందించాలని బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రాణాలను కాపాడడంలో ముందుండాలన్నారు. శనివారం రాత్రి నాగోలులోని పీవీఆర్ కన్వెన్షన్ హాలులో ఓజోన్ ప్రైవేట్ ఆసుపత్రి 13వ వార్షికోత్సవాలు నిర్వహించి, ఉత్తమ వైద్యులు, సిబ్బందికి ధన్వంతరి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమానికి మంత్రితోపాటు సినీ నటుడు సుమన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వైద్యులు దైవంతో సమానమని, వృత్తి ధర్మాన్ని పాటిస్తూ రోగాలకు మనోధైర్యం కల్పిస్తూ ప్రాణాలను రక్షించాలన్నారు. 13 సంవత్సరాలుగా ఓజోన్ ఆసుపత్రి అనేక మందికి మెరుగైన వైద్య సేవలు అందించి ప్రాణాలను కాపాడిన ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులను, సిబ్బందిని అభినందించారు.

లాభాపేక్షతో కాకుండా పేద, బడుగు, బలహీన వర్గాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వారికి అందుబాటు ధరల్లో వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు కూడా వైద్య సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ... ఒక ప్రాణిని కాపాడగలిగేది వైద్య వృత్తి మాత్రమేనని అన్నారు. అటువంటి మహత్తర వృత్తిని ఎంచుకుని సేవలందిస్తున్న వైద్యులను అభినందించారు. ఓజోన్ ఆసుపత్రి చైర్మన్ బీవీ సత్యసాయి ప్రసాద్ మాట్లాడుతూ... కొత్తపేట నుంచి ఎల్బీనగర్ వైపు వెళ్లే విజయవాడ ప్రధాన రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంతో అత్యవసర వైద్య సేవల అవసరాన్ని గుర్తించి ఈ ప్రాంతంలో 13 ఏండ్ల క్రితం ఓజోన్ ఆసుపత్రిని స్థాపించామని తెలిపారు.

# మేడారం తరహాలో మల్లూరు క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తాం

- టెంపుల్ టూరిజం ప్రాంతంగా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి





**మంగపేట మార్చి 01(జనంసాక్షి) :** మల్లూరు శ్రీ హేమాచల క్షేత్రాన్ని మేడారం తరహాలో అద్భుతంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం మంగపేట మండలం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి చేరుకున్న రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు, పినపాక శాసన సభ సభ్యులు పాయం వెంకటేశ్వర్లు లు ఆలయానికి చేరుకోగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో, డోలు వాయిద్యాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి శ్రీనివాస రెడ్డి, మంత్రి సీతక్క, ఎంపి బలరాం నాయక్, పినపాక, భద్రాచలం, శాసన సభ సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు లతో కలిసి దర్శించుకొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు మంత్రులకు, శాసన సభ సభ్యులకు ఆలయ విశిష్టతను కులకషంగా వివరించి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మీడియా తో మాట్లాడుతూ మల్లూరు గుట్టలో స్వయంభుగా వెలసిన హేమాచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. మల్లూరు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి విశిష్ట ప్రాముఖ్యత కలిగి ఉందని దశాబ్దాల కాలం నుంచి వివిధ సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామి వారి దర్శనం కోసం రావటం జరుగుతుందని భక్తులు కోరిన కోర్కెలు తీరుస్తారనే పూర్తి విశ్వాసంతో భక్తులు వస్తుంటారని అన్నారు. ములుగు ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన పర్యాటక కేంద్రాలు నెలవై ఉన్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి , ప్రజా ప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా మేడారం జాతరను అద్భుతంగా 200 సంవత్సరాల వరకు చెక్కుచెదరకుండా ఉండే విధంగా అభివృద్ధి చేసుకొని, మహా జాతరను గత నెల చివరిలో విజయవంతం చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా గోదావరి పరివాహక ప్రాంతాల్లోని దేవాలయాలను బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని వాటికి సంబంధించిన పనులు కూడా త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందని స్పష్టం చేశారు. స్థానిక మంత్రి సీతక్క కోరిక మేరకు దేవాలయాన్ని అద్భుతంగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసి చూపిస్తుందని, అన్ని మతాల భక్తుల మనోభావాలను, అభిప్రాయాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుంది వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, ఎస్పి సుధీర్ రామనాథ్ కేకన్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆలయ కార్య నిర్వాహణాధికారి రేవెల్లి మహేష్, రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ యర్రంగారి సురేశ్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అనర్హుల చేతుల నుంచి సర్కారు భూములు స్వాధీనం చేసుకోండి

- పదేళ్ల బీఆర్ఎస్ పాలన లో సర్కారు భూములు కబ్జా చేసిన అనర్హులు..
- సర్కార్ భూములు స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేస్తాం..
- ధర్మారంలో క్రీడా మైదానం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి..
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ధర్మారం (జనంసాక్షి) :** పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అనర్హులైన కొందరు ప్రభుత్వ భూములను కబ్జా చేశారని కబ్జా చేసిన వారు అంతటివారైనా వారి నుండి స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు అందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలో ఆదివారం ఇంటింటికి సోలార్ పథకంపై జరిగిన అవగాహన కార్యక్రమానికి మంత్రి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మారం మండలంలోని నర్సింగాపూర్, ఖిలావనపర్తి , ధర్మారం గ్రామంలో కొందరు భూములను అక్రమంగా ఆక్రమించుకున్నారని మంత్రి లక్ష్మణ్ అన్నారు. రెవెన్యూ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి పట్టాలు రద్దు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ భూములను అర్హులైన పేదలకు అందజేస్తామని మంత్రి తెలిపారు. ధర్మారం మండల కేంద్రంలో క్రీడా మైదానం కొరకు కేటాయించిన స్థలాన్ని 15 రోజుల్లో చదును చేసి క్రికెట్, వాలీబాల్ ,వాకింగ్ ట్రాక్ కు అనుగుణంగా తీర్చిదిద్దాలని మంత్రి అధికారులకు సూచించారు. రాజకీయంగా జన్మనిచ్చిన ధర్మారం మండలం పై ప్రత్యేక ప్రేమ ఉంటుందని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

ప్రభుత్వం అందజేస్తున్న సోలార్ పథకాన్ని నంది మేడారం గ్రామస్తులు 100 శాతం ఉపయోగించుకోవాలని మంత్రి కోరారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారి చొరవతో మేడారం గ్రామం 100శాతం సోలార్ గ్రామంలో ఎంపిక అయిందని మంత్రి వివరించారు.

గ్రామంలో తొలి విడతలో గృహ అవసరాలకు 1486 విద్యుత్ కనెక్షన్లు కు రెండు కిలో వాట్స్ సోలార్ ప్యానల్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రెండవ విడతలో 628 కరెంట్ వ్యవసాయ పెంపు సెట్లకు సోలార్ ప్యానల్ ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. మేడారం గ్రామాన్ని 100 శాతం సోలార్ వినియోగం గ్రామంగా మార్చడానికి ప్రభుత్వం రూ. 51 కోట్లు విడుదల చేసిందని మంత్రి తెలిపారు. గ్రామంలో విద్యుత్తు లైన్ల మార్పిడి కోసం రూ. 36 లక్షలు కేటాయించడం మంత్రి వివరించారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా బోర్ బావులు తవ్వించామని 80 మందికి మేడారం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశామని మంత్రి తెలిపారు.

## ట్రాఫిక్ చలానాల
# రాయితీల్లేవ్

- ఫేక్‌న్యూస్ స్ప్రెడ్ చేయకండి
- హైదరాబాద్ సీపీ సజ్జనార్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ట్రాఫిక్ చలానాల విషయంలో రాయితీలు ఇకపై ఉండ బోవని హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. సోషల్ మీడియాలో వ్యూస్, లైక్స్ కక్కుర్తితో కొందరు ఎంతకైనా దిగజారు తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఎక్స్ వేదికగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోను షేర్ చేశారు. మార్చి 14న లోక్ అదాలత్ సందర్భంగా ట్రాఫిక్ చలానాలపై రాయితీలు అంటూ ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేశారు. ఈ ఫేక్ సమాచారం వీడియోలకు ఏకంగా లక్షల్లో వ్యూస్ వస్తున్నాయని ఆశ్చర్యకరం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ చలానాల రాయితీలు పూర్తిగా అవాస్తవం అని స్పష్టం చేశారు. పోలీస్ శాఖ అధికారికంగా ఎలాంటి రాయితీలను ప్రకటించలేదని వెల్లడించారు. దయచేసి ఇలాంటి ఫేక్ వీడియోలను నమ్మకండని సూచించారు. తప్పుడు వార్తలు సృష్టించి, ప్రజలను తప్పుదోవ పట్టించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని సీపీ సజ్జనార్ హెచ్చరించారు.

# ‘సీఎం ప్రజావాణి’ ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- రెండేళ్లు పూర్తి చేసుకున్న సీఎం ప్రజావాణి
- సక్సెస్ రేటు 74 శాతం
- సీఎం ప్రజావాణి ఇంచార్జి డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య అంకిత భావంతో సక్సెస్








**హైదరాబాద్ (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి ప్రజావాణి ప్రజల సమస్యల పరిష్కార వేదికగా నిలుస్తోంది. సమస్యలు వేగవంతంగా పరిష్కారం అవుతుండడంతో రాష్ట్రం నలువైపుల నుంచి ప్రజలు భారీ ఎత్తున రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహిస్తున్న సీఎం ప్రజావాణికి తరలివస్తున్నారు. రెండు సంవత్సరాల ఒక నెల క్రితం ప్రారంభమైన సీఎం ప్రజావాణి ప్రతి వారంలో మంగళ శుక్రవారాలలో జరిగే ఈ కార్యక్రమం ఇప్పటివరకు 24 సెషన్స్ పూర్తి చేసుకుంది.

రెండేళ్ల కాలంలో సీఎం ప్రజావాణిలో మొత్తం ఒక లక్షా 12 వేల 245 దరఖాస్తులు నమోదు కాగా అందులో 64 వేల 558 దరఖాస్తులు పరిగణలోకి తీసుకొని 47 వేల 935 దరఖాస్తులు పరిష్కరించారు. మిగతా 47, 687 దరఖాస్తులు ప్రభుత్వ పథకాలు, విధానపరమైన ప్రభుత్వ నిర్ణయాలు తీసుకోవాల్సినవి కావడం, ఉద్యోగాల కోసం సంబంధించినవి ఉన్నాయి. వీటిని పరిష్కరించాలని కోరుతూ సంబంధిత శాఖలకు సిఫార్సు చేశారు. సీఎం ప్రజావాణికి వచ్చే దరఖాస్తుల పరిష్కారం 74% శాతం మేరకు ఉండడంతో ప్రజల నుంచి భారీ స్పందన వస్తోంది. సీఎం ప్రజావాణి పై ప్రజల్లో భరోసా పెరిగింది దీంతో వారంలో రెండు రోజులు మంగళ, శుక్రవారాలలో సుమారు వేయి దరఖాస్తులు నమోదు అవుతున్నాయి.

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి సీఎం ప్రజావాణి ఇంచార్జిగా బాధ్యతలు చేపట్టి సరిగ్గా ఆదివారానికి రెండేళ్లు పూర్తి అవుతోంది. సీఎం ప్రజావాణికి వచ్చే ప్రజల నుంచి దరఖాస్తులు స్వయంగా స్వీకరించి ఓపికతో సమస్యలు విని వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్లో మాట్లాడి దరఖాస్తుపై ఎండార్స్మెంట్ చేసి చిన్నారెడ్డి స్వయంగా స్టాంప్ వేస్తుండడం విశేషం. ఈ ప్రక్రియ ప్రజల్లో విశ్వాసాన్ని నింపుతోంది. నిరంతరం వారంలో రెండు రోజులు ఇదే తరహా ప్రక్రియతో పాటు ప్రతి దరఖాస్తు ఆన్లైన్లో ద్వారా సంబంధిత శాఖకు సిఫార్సు చేస్తుండడం వల్ల సమస్యలు సత్వరంగా పరిష్కారం అవుతున్నాయి. గల్ఫ్ లోని ఏడు దేశాలు సహా ఇతర దేశాలలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీఎం ప్రవాసి ప్రజావాణి కేంద్రాన్ని కూడా ఈ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

సీఎం ప్రజావాణిలో దరఖాస్తులు రాసి ఇచ్చేందుకు హెల్ప్ డెస్క్, ప్రతి శాఖ నుంచి అధికారులతో ప్రత్యేక డెస్కులు, వైద్య సహాయం కోసం మెడికల్ క్యాంపు, వృద్ధులు దివ్యాంగుల రవాణా కోసం బ్యాటరీ బగ్గి, వీల్ చైర్స్, అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్, ప్రజలకు మంచినీటి సౌకర్యం, జీ.హెచ్.ఎం.సీ. ఆర్థిక సహకారంతో హరే కృష్ణ ఫౌండేషన్ ద్వారా ఐదు రూపాయల భోజనం వంటివి సీఎం ప్రజావాణిలో కల్పించారు.

సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ కూడా ఎంతో ఓపికతో ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న పట్టాదారు పాసు పుస్తకాల సమస్యలు పరిష్కరించడం, పబ్లిక్ సర్వీస్ కమిషన్ వివిధ గ్రూపుల పరీక్షలు, వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్ రిక్రూట్మెంట్ లలో జాప్యం, ఫలితాల విడుదల వంటి అంశాలు, రైతుల వ్యవసాయ సంబంధిత సమస్యలు, విద్యుత్ సమస్యలు, ప్రజల ఆరోగ్య సమస్యలు, రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ళు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్యలు, ఆర్టీసీ కార్మికులు, గల్ఫ్ కార్మికుల సమస్యలు వంటి



అనేక అంశాలు సీఎం ప్రజావాణి, ప్రవాసి ప్రజావాణి ద్వారా పరిష్కారమవుతున్నాయి. సీఎం ప్రజావాణి సక్సెస్ కార్యమాన్ని వివిధ రాష్ట్రాలకు చెందిన ట్రైనీ ఐ. ఏ. ఎస్., గ్రూప్ -1 అధికారులు పరిశీలించారు.

సీఎం ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో డాక్టర్ జీ. చిన్నారెడ్డి, దివ్యదేవరాజన్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నందు వల్ల పరిష్కార శాతం 74% ఉంది. రానున్న రోజుల్లో పరిష్కార శాతాన్ని మరింత మెరుగు పర్చేందుకు అన్ని చర్యలు తీసుకోనున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370